

‘నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 96

మంగళవారం 27-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నాతో నేనే పోటీ పడ్డాను..!

పరిధి పెంచుకుంటే అవకాశాలు మెరుగవుతాయి అంటోంది మహతి -11లో



జింబాబ్వే జిగేల్..

వరల్డ్‌కప్ అర్హత టోర్నీలో అమెరికాపై 304 పరుగులతో గెలుపు -12లో



భారత్ వాణి ప్రపంచం వింటోంది

ప్రధాని మోదీ హయాంలో ప్రపంచ వేదికపై భారత్ పలుకుబడి, స్థాయి పెరిగాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.

వివరాలు 6లో ▸



వెదురు నుంచి జీవ ఇంధనాలు!

బయో ఇథనాల్, బయో గ్యాస్, బయోచర్ తయారీకి వెదురు అనుకూలమని ఓ అధ్యయనంలో తేలింది.

వివరాలు 6లో ▸



డ్యూటీ ముగిసింది.. విమానం నడపను

డ్యూటీ ముగియడంతో.. అత్యవసరంగా ల్యాండైన విమానాన్ని నడపబోనంటూ ఎయిర్ ఇండియా పైలట్ నిరాకరించాడు.

వివరాలు 6లో ▸



‘వాగ్నర్’ చీఫ్ ప్రాణాలకు ముప్పు

రష్యాలో తిరుగుబాటు చేసిన ‘వాగ్నర్’ చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు ఉందని సీఐఏ అధిపతి డేవిడ్ పేట్రాయస్ హెచ్చరించారు.

వివరాలు 6లో ▸

మన టైం వచ్చింది..

కేసీఆర్‌ను గద్దె దింపేద్దాం!

పొంగులేటి, జూపల్లి, ఇతర నేతలతో రాహుల్, ఖర్గే, ప్రియాంక వ్యాఖ్యలు

- ‘కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో’ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలి
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్న విషయాన్ని ప్రచారం చేయాలి
- ‘ఘర్ వాపసీ’ మొదలైంది.. ప్రోత్సహించాలి
- పార్టీలో చేరే నేతలకు సముచిత స్థానం
- జూలై 2న ఖమ్మం సభలో పొంగులేటి, జూలై 14 లేక 16న మహబూబ్‌నగర్ సభలో జూపల్లి కాంగ్రెస్‌లో చేరిక
- మహబూబ్‌నగర్ సభకు ప్రియాంక, ఖమ్మం సభకు రాహుల్ హాజరు!



ఏఐసీసీ కార్యాలయంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతో పొంగులేటి, జూపల్లి. చిత్రంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరవేసే సమయం వచ్చిందని.. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపేద్దామని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, పార్టీలో చేరబోతున్న సీనియర్లకు ఏఐసీసీ పెద్దలు పిలుపునిచ్చారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణ ఓటర్లలో కాంగ్రెస్ పట్ల విశ్వాసం పెరిగిందని.. దీనిని అనుకూలంగా మల్చుకుని సమష్టి కృషితో కాంగ్రెస్‌ను గెలిపించుకుందామని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పరస్పర అవగాహన ఉందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ సర్కారుపై ఉన్న వ్యతిరేకతను కాంగ్రెస్‌కు అనుకూలంగా మార్చుకునేలా వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు గుర్నాథ్‌రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి సహా 35 మంది నేతలతో ఏఐసీసీ

మిగతా 2వ పేజీలో ▶

ఎన్నికల వ్యూహాలపై నేడు భేటీ

తెలంగాణ ఎన్నికల వ్యూహాలపై చర్చించేందుకు అధిష్టానం పెద్దలు మంగళవారం మరో మారు రాష్ట్ర నేతలతో భేటీ కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ఈ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో పాటు, అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొననున్నారు. రాష్ట్ర నేతల మధ్య ఉన్న భేదాభిప్రాయాలు, ఐక్యతా యత్నాలు, ఎన్నికల వ్యూహాలు, సంస్థాగతంగా బలోపేతం తదితర అంశాలపై అందులో చర్చించనున్నారు. బీఆర్ఎస్ సర్కారు అవినీతిని ప్రధాన అస్త్రంగా చేసుకుని పోరాడేలా వ్యూహాన్ని ఖరారు చేయనున్నారని.. పార్టీ ప్రకటిస్తున్న హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు, సభలపై చర్చించనున్నారని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి.

ప్రజల నాడి కాంగ్రెస్‌వైపే!

అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నాం..: పొంగులేటి, జూపల్లి

కేసీఆర్ మాయల మరాఠీ వేషాలు, గారడీలకు చెక్ పెడతాం 2లో



మహారాష్ట్రకు బయల్దేరే ముందు కార్యకర్తలతో కేసీఆర్ కరచాలనం

ప్రత్యేక బస్సు.. 600 కార్లు

భారీ కాన్వాయ్‌తో మహారాష్ట్రకు కేసీఆర్

- షోలాపూర్‌లో మాజీ ఎంపీ ఇంట్లో తేనీటి విందుకు హాజరు
- విఠలేశ్వరుని దర్శనం కోసం వచ్చినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రెండురోజుల పర్యటన నిమిత్తం మహారాష్ట్ర బయలుదేరి వెళ్లిన భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం సాయంత్రం షోలాపూర్‌కు చేరుకున్నారు. ఆయన వెంట పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు ఉన్నారు. కేసీఆర్ సోమవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ప్రగతిభవన్ నుంచి ప్రత్యేక బస్సులో మహారాష్ట్రకు బయలుదేరారు. కేసీఆర్ చేతికి రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ దట్టీ కట్టి వీడ్కోలు పలికారు. 600 కార్లతో కూడిన భారీ వాహన శ్రేణి ఆయన వాహనాన్ని అనుసరించింది. 65వ నంబరు జాతీయ రహదారి మీదుగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను దాటి ముఖ్యమంత్రి మహారాష్ట్రలో అడుగు పెట్టారు. మొత్తం 320 కిలోమీటర్ల దూరం ప్రయాణించారు. కాగా మహారాష్ట్రకు వెళ్లే మార్గమంతా కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు వెలిశాయి. ప్రజలు, పార్టీ శ్రేణులు పూలు, గులాబీ కాగితాలు వెదజల్లుతూ పార్టీ జెండాలతో స్వాగతం

మిగతా 2వ పేజీలో ▶

నేడు పండరీపూర్, తుల్జాపూర్‌లో ప్రత్యేక పూజలు

కేసీఆర్ మంగళవారం ఉదయం పండరీపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి సమీపంలోని సర్కోలి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగే సభకు హాజరవుతారు. సర్కోలి సభ వేదికగా స్థానిక ఎన్సీపీ నేత భగీరథ్ భల్కే బీఆర్ఎస్‌లో చేరుతారు. అక్కడ నుంచి మధ్యాహ్నం తుల్జాపూర్‌కు చేరుకుని భవానీ మాత ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం సమీపంలోని ఉస్మానాబాద్ (దారాశివ్) విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

న్యూస్‌రీల్

ర్యాంకుల్లో రాష్ట్రం వెనుకబాటు బాధాకరం



మంచి విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నా జాతీయ ర్యాంకుల్లో తెలంగాణ వెనుకబడటం బాధాకరమని గవర్నర్ తమిళిసై అన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ వంటి జాతీయ స్థాయి ర్యాంకుల్లో ఎందుకు వెనుకబడుతున్నామో గుర్తించి, లోపాన్ని అధిగమించాలని సూచించారు.

- వివరాలు 14లో▶

కాలేజీలెన్ని? సీట్లెన్ని?



వైద్యవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా క్లినికల్, నాన్ క్లినికల్ కేటగిరీలో దాదాపు 65 వేల సీట్లు ఉన్నాయి. కౌన్సెలింగ్‌కు వీలుగా కోర్సుల వారీగా సీట్ల సంఖ్యను ఆయా కాలేజీల యాజమాన్యాలు ఎంసీసీకి సమర్పించాయి.

- వివరాలు 2లో▶

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. స్థలాలున్న పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు, వందరోజుల పనికెళ్లే కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీనిచ్చారు.

- వివరాలు 3లో▶

మందకొడిగా సాగు



వానాకాలం సాగు మందకొడిగా సాగుతోంది. ఆహార, ఉద్యాన పంటలన్నీ కలిపి ఇప్పటి వరకు 11.36 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. అత్యధికంగా 3.24 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. 16,408 ఎకరాల్లో వరి నాట్లు వేశారు.

- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



విపక్షాల భేటీ తర్వాత డెవలప్‌మెంట్ బాగా కనిపిస్తుంది. సంతోషం

అభివృద్ధిని ఓర్వలేకే అడ్డగోలు మాటలు

బీజేపీ అధ్యక్షుడు నడ్డాపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం

- ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించబోరు
- సీఎం కేసీఆర్‌ను ఎందుకు జైల్లో వేస్తారు?
- రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినందుకా?
- ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద స్కైవాక్ ప్రారంభించిన కేటీఆర్



ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మల్లారెడ్డితో కలసి ఉప్పల్ స్కైవాక్‌పైకి వెళ్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. ఈ అభివృద్ధిని చూస్తూ ఓర్వలేకే ప్రతిపక్షాలు అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను జైల్లో పెడతామంటూ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నడ్డా.. అడ్డమైన

మిగతా 3వ పేజీలో ▶

ఫుడ్ ప్రాసెసింగ్‌కు రాష్ట్రం గమ్యస్థానం

- మంత్రి కేటీఆర్ వెల్లడి
- రూ. 3,650 కోట్లతో లులు గ్రూప్ కార్యకలాపాలు ప్రారంభం

3లో

ప్రమాదాల విరుగుడుకు మూడో మిర్రర్!

బస్సు ముందుభాగంలో దాటేవారు డ్రైవర్‌కు కనిపించక ప్రమాదాలు

టైర్ల కిందపడటంతో చాలామంది దుర్మరణం



ముందుభాగం కనిపించేలా మిర్రర్ ఏర్పాటుచేస్తున్న ఆర్టీసీ

2లో

రాష్ట్రంలో మెజార్టీ స్థానాల్లో పోటీ



ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

- ఏయే స్థానాల్లో పోటీచేసేదీ ఎన్నికల ముందు ప్రకటిస్తాం
- పట్నాలో ప్రతిపక్షాల సమావేశానికి మాకు ఆహ్వానం అందలేదు

3లో

ఢిల్లీకి బండి సంజయ్



అధిష్టానం పిలుపు మేరకు హుటాహుటిన పయనం

ఈటల, రాజగోపాల్ తిరిగొచ్చిన మరునాడే వెళ్లడంపై ఊహాగానాలు

మోదీ, అమిత్‌షా పర్యటనల ఖరారు కోసమేనంటూ ఓ వర్గం ప్రచారం

బండి సంజయ్ మళ్లీ ఢిల్లీ వెళ్లిన నేపథ్యంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్టీలో సంస్థాగత మార్పులపై సంప్రదింపుల కోసమే సంజయ్‌ను ఢిల్లీకి పిలిపించి ఉంటారని పార్టీలోని కొందరు అంటుండగా, నెలాఖరులోగా రాష్ట్రంలో మోదీ రోడ్డుషో లేదా బహిరంగసభ తేదీ, సమయం ఖరారు కోసమే వెళ్లారని ఇంకో వర్గం నాయకులు చెబుతున్నారు.

3లో

క్లుప్తంగా...

జూలై 4న రాష్ట్రపతి ముర్ము రాక

అల్లూరి 125వ జయంతిలో పాల్గొననున్న రాష్ట్రపతి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జూలై 4న హైదరాబాద్‌ పర్యటనకు రానున్నారు. అదే రోజు సాయంత్రం అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు. రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో డీజీపీ అంజనీకుమార్‌తో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాల్లోని రోడ్ల మరమ్మతులు, బారికేడింగ్‌ చేపట్టాలన్నారు. విస్తృత బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్‌ అధికారులను కోరారు. నిరంతర విద్యుత్‌ సరఫరా, వైద్య బృందాలను నియమించడం, పారిశుద్ధ్య పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రోటోకాల్‌ను అనుసరించి ఏవిధమైన లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

తెలంగాణకు రూ.2,102 కోట్లు

మూలధన పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: మూలధన పెట్టుబడి నిమిత్తం రాష్ట్రాలకు ప్రత్యేకసాయం 2023–24లో భాగంగా తెలంగాణకు రూ.2,102 కోట్లు కేంద్ర ఆర్థికశాఖ ఆమోదించింది. తెలంగాణ సహా 16 రాష్ట్రాలకు రూ.56,415కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. రాష్ట్రాల్లో ఆరోగ్యం, విద్య, నీటిపారుదల, విద్యుత్తు, రహదారులు, వంతెనలు, రైల్వే సహా పలు రంగాలకు సంబంధించిన మూలధన పెట్టుబడి ప్రాజెక్టులు ఆమోదం పొందిన వాటిలో ఉన్నట్లు వెల్లడించింది.


14న ఆర్‌ఎంసీ భేటీ

సాక్షి, హైదరాబాద్‌: శ్రీశైలం, నాగార్జునసాగర్‌ జలాశయాల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు రిజర్వాయర్ల నిర్వహణ(ఆర్‌ఎంసీ) కమిటీ జూలై 14న సమావేశం కావాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) నిర్ణయించింది. ఆర్‌ఎంసీ కన్వీనర్‌గా కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరే, సభ్యులుగా ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలు సి. మురళీధర్, సి.నారాయణరెడ్డి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌ ప్రాజెక్టుల జలవిద్యుత్‌ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి సంబంధించిన నిబంధనల రూపకల్పన, రెండు జలాశయాల నిర్వహణకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రూపొందించిన ముసాయిదా విధివిధానాల(రూల్‌ కర్వ్స్‌)ను పరిశీలించి అవసరమైన మార్పులతో తుదిరూపు ఇవ్వడం, జలాశయాలన్నీ నిండాక ఇరు రాష్ట్రాలు వాడుకున్న వరద జలాలను లెక్కించకుండా మినహాయింపు కల్పించడం అనే 3అంశాలు ఆర్‌ఎంసీ ఎజెండాలో ఉన్నాయి. చివరిసారిగా జరిగిన ఆర్‌ఎంసీ 6వ సమావేశంలో కీలక సిఫారసులతో నివేదికను సిద్ధం చేయగా, ఏపీ అధికారులే సమ్మతి తెలుపుతూ సంతకాలు పెట్టారు. తెలంగాణ అధికారులు సంతకాలు చేయకపోవడంతో ఆ సిఫారసులు బుట్టదాఖలయ్యాయి. మళ్లీ ఎజెండాలోని అంశాలపై కొత్తగా చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

సీతమ్మసాగర్‌పై 'ఎన్జీటీ' విచారణ

సాక్షి, హైదరాబాద్‌: సీతమ్మసాగర్‌ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులను నిలిపివేయాలన్న తమ ఆదేశాలను ఉల్లంఘిస్తూ తెలంగాణ ప్రభుత్వం పనులను కొనసాగించడంపై జాతీయ హరిత ట్రిబ్యునల్‌(ఎన్జీటీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్‌ డైరెక్టర్, గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) సూపరింటెండింగ్‌ ఇంజనీర్‌తో కూడిన బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి, వాస్తవ పరిస్థితులపై నివేదిక సమర్పించాలని ఇటీవల ఆదేశించింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఈ నెల 28న అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, ఎన్జీటీకి నివేదిక సమర్పించనుంది. జూలై 12న ఎన్జీటీ తదుపరి విచారణ జరపనుంది. పర్యావరణ అనుమతులు లేకుండానే సీతమ్మసాగర్‌ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ తెల్లం నరేష్, బుర్ర లక్ష్మీనారాయణ అనే వ్యక్తులు ఎన్జీటీలో కేసు వేయగా, అనుమతులు పొందేవరకు పనులను నిలుపుదల చేయాలని ఆదేశిస్తూ ఎన్జీటీ గత మార్చి 24న ఆదేశాలు జారీ చేసింది.

ఆర్టీసీ 'అడ్వాన్స్‌' రిజర్వేషన్‌ చార్జీల సవరణ



సాక్షి, హైదరాబాద్‌: అడ్వాన్స్‌ రిజర్వేషన్‌ చార్జీలను ఆర్టీసీ స్వల్పంగా సవరించింది. ఎక్స్‌ప్రెస్, డీలక్స్‌ బస్సులకు ముందస్తుగా సీట్లు రిజర్వ్‌ చేసుకుంటే రూ.20గా ఉన్న రిజర్వేషన్‌ చార్జీలను మార్చినట్లు టీఎస్‌ఆర్టీసీ తెలిపింది. 350 కి.మీ. కంటే తక్కువ దూరంలో ఉన్న ప్రాంతాలకు రూ.20గా, అంతకంటే ఎక్కువ దూరం ఉన్న ప్రాంతాలకు రిజర్వ్‌ చేసుకుంటే రూ.30గా నిర్ణయించింది. సూపర్‌ లగ్జరీ, ఏసీ కేటగిరీ బస్సులకు ప్రస్తుతం రూ.50గా ఉన్న చార్జీని రూ.30కి తగ్గించింది. ఆర్టీసీలో ప్రస్తుతం సగటున రోజుకు 16 వేల మంది సీట్లు ఓపీఆర్‌ఎస్‌ ద్వారా రిజర్వ్‌ చేసుకుంటున్నట్లు టీఎస్‌ఆర్టీసీ పేర్కొంది.





మహారాష్ట్రకు వెళ్తుండగా రోడ్డు పక్కన స్వాగతం పలుకుతున్న అభిమానులకు అభివాదం చేస్తున్న కేసీఆర్‌. 600 కార్లతో భారీ కాన్వాయ్‌

ప్రత్యేక బస్సు.. 600 కార్లు

▶ మొదటి పేజీ తరువాయి

పలికారు. కేసీఆర్‌ వెంట సుమారు 6 కిలోమీటర్ల పొడవున వాహన శ్రేణి బారులు తీరింది.

ఒమర్గాలో మధ్యాహ్న భోజనం

కేసీఆర్‌ వాహన శ్రేణి తెలంగాణలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్‌ మీదుగా ప్రయాణించి కర్ణాటకలో అడుగు పెట్టింది. ముర్కుంద, మన్నెకెల్లి, తలమడిగి, హుమ్నాబాద్, బసవకళ్యాణ్‌ మీదుగా మధ్యాహ్నం రెండు గంటలకు మహారాష్ట్రలోని దారాశివ్‌ (ఉస్మానాబాద్‌) జిల్లా ఒమర్గాకు కేసీఆర్‌ చేరుకున్నారు. స్థానిక మహిళలు సాంప్రదాయ పద్ధతిలో హారతి ఇచ్చి స్వాగతం పలికారు. తన వెంట వచ్చిన నేతలతో కలిసి ఒమర్గాలో సీఎం మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం షోలాపూర్‌ చేరుకున్న కేసీఆర్‌కు స్థానిక తెలుగు ప్రజలతో పాటు బీఆర్‌ఎస్‌ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలకగా, మహిళలు హారతులు ఇచ్చారు. భారీగా డప్పు చప్పుళ్లు, స్థానిక కళారూపాల ప్రదర్శన నడుమ తాను బస చేసే బాలాజీ సరోవర్‌ హోటల్‌కు కేసీఆర్‌ చేరుకున్నారు.

నలుగురు మినహా కేబినెట్‌ మొత్తం..

సీఎం కేసీఆర్‌ వెంట నలుగురు మంత్రులు మినహా రాష్ట్ర కేబినెట్‌ మొత్తం తరలి వెళ్లింది. మంత్రులు కేటీ రామారావు, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్, మహమూద్‌ అలీ మినహా మిగతా మంత్రులంతా ఆయన వెంట ఉన్నారు. వారితో పాటు బీఆర్‌ఎస్‌ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యులు కె.కేశవ రావు, ఎంపీలు నామా నాగేశ్వర్‌ రావు, బీబీ పాటిల్, సంతోష్‌తో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మహారాష్ట్ర వెళ్లారు. మొత్తంగా వందలాది మంది నేతలు షోలాపూర్‌కు వెళ్లడంతో స్థానిక హోటళ్లు, లాడ్జీలు కిక్కిరిసిపోయాయి. బసకు ఇబ్బందులు ఎదుర్కొన్న కొందరు స్థానికంగా స్థిరపడిన తెలంగాణవాసుల ఇళ్లలో ఆశ్రయం పొందారు.

మాజీ ఎంపీ సాదుల్‌ ధర్మన్న ఇంటికి కేసీఆర్‌



షోలాపూర్‌లో సాదుల్‌తో మాట్లాడుతున్న కేసీఆర్‌

షోలాపూర్‌ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్‌ నేత ధర్మన్న ముండయ్య సాదుల్‌ ఆహ్వానం మేరకు పార్టీ ముఖ్య నేతలతో కలిసి షోలాపూర్‌ భావనారుషి పేట్‌లోని ఆయన నివాసానికి కేసీఆర్‌ తేనీటి విందుకు వెళ్లారు. తిరిగి హోటల్‌కు వెళ్తున్న సమయంలో మీడియా ప్రశ్నించడంతో.. తెలంగాణ ఉద్యమ సమయంలో, తెలంగాణ సాధించిన తర్వాత పండరీపూర్‌ విఠలేశ్వరుని మంత్రివర్గ సహచరులు, ప్రజా ప్రతినిధులతో కలిసి దర్శించుకుంటానని మొక్కుకున్నానని చెప్పారు. ఇప్పుడు దైవ దర్శనం కోసమే వచ్చానని, రాజకీయాలు మాట్లాడనని అన్నారు.



పాత బస్సులకు ముందుభాగంలో ప్రత్యేకంగా బిగించిన అద్దం..

ప్రమాదాల విరుగుడుకు మూడో మిర్రర్‌!

- బస్సు ముందుభాగంలో దాటేవారు డ్రైవర్‌కు కనిపించక ప్రమాదాలు
- టైర్ల కింద పడిపోతుండటంతో చాలామంది దుర్మరణం
- ముందుభాగం కనిపించేలా మిర్రర్‌ ఏర్పాటుచేస్తున్న ఆర్టీసీ
- సత్ఫలితాలిస్తున్న ప్రయోగం

సాక్షి, హైదరాబాద్‌

ఆర్టీసీ బస్సు దిగిన భార్యాభర్తలు మరో బస్సు ఎక్కాలన్న ఆత్రుతలో దిగిన బస్సు ముందు నుంచే రోడ్డు దాటబోయారు. వారు రోడ్డు దాటుతున్నది కనిపించక బస్సు డ్రైవర్‌ ముందుకు పోనిచ్చాడు. బస్సు తగిలి ఇద్దరూ కింద పడిపోగా బస్సు చక్రాలు వారిని చిదిమేశాయి. కొద్దిరోజుల క్రితం సికింద్రాబాద్‌లో జరిగిన దుర్ఘటన అక్కడి వారిని కలిచివేసింది.

ఇందులో తప్పెవరిది..?

బస్సు డ్రైవర్‌కు కొన్ని కోణాల్లో ముందున్న ప్రాంతం కనిపించదు. అందులో ముఖ్యమైంది బస్సు ముందు దాదాపు మూడునాలుగు అడుగుల స్థలం. దాన్నే బ్లైండ్‌స్పాట్‌గా చెబుతారు. తక్కువ ఎత్తున్న వారు, బస్సు రేడియేటర్‌ ముందు నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లేవాళ్లు ఆ ప్రాంతంలో బస్సును దాటుతున్నప్పుడు వారిని గుర్తించటం డ్రైవర్‌కు సాధ్యం కాదు. ఆ ప్రాంతంలో ఎవరూ బస్సు దాటకూడదని తరచూ ఆర్టీసీ అధికారులు ప్రకటనలు చేస్తున్నా చాలామంది అవగాహన లేక దాటుతూ బస్సు చక్రాల కింద నలిగిపోతున్నారు. దానికి విరుగుడుగా ఆర్టీసీ బస్సు ముందుభాగంలోని 'కనపడని ప్రాంతం' డ్రైవర్‌కు కనిపించేలా ప్రత్యేకంగా మిర్రర్‌ ఏర్పాటు చేస్తోంది.



ప్రత్యేక ఏర్పాటు

కొంతకాలంగా ఆర్టీసీ బస్సులకు ముందు భాగంలో మూడు మిర్రర్లు కనిపిస్తున్నాయి. ఆయా డిపోల్లో ప్రత్యేకంగా వాటిని బిగిస్తున్నారు. బస్సు ముందు భాగంలో ఉండే రెండు అద్దాల మధ్య బయటి నుంచి ఈ మిర్రర్‌ ఏర్పాటై ఉంటోంది. ఇటీవల కొత్తగా కొనుగోలు చేసిన సూపర్‌ లగ్జరీ, డీలక్స్‌ బస్సులకు మాత్రం బస్సు ముందు రెండు వైపులా ఉండే సైడ్‌ మిర్రర్‌ రాడ్‌లకే ఈ ప్రత్యేక మిర్రర్‌ బిగించి ఉంది. బస్సు బాడీని నిర్మించేటప్పుడే వీటిని బిగిస్తుండటం విశేషం. బస్సు ఆగినప్పుడు అందులోంచి దిగిన వారో, ఆ బస్సు ఎక్కాలన్న ఆత్రుతలో పక్క నుంచి వచ్చిన వారో బస్సు ముందు భాగం నుంచి దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అలాంటి ప్రమాదాల్లో ఎక్కువ మంది మృత్యువాతపడుతున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్టీసీ పెద్దమొత్తంలో నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తోంది. దీంతో ఈ సమస్యకు పరిష్కారంగా ఆర్టీసీ అధికారులే ఈ ఆలోచన చేశారు. ఆ మిర్రర్‌లో బస్సు ముందు భాగం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపిస్తుంది. బస్సును ముందుకు కదిలించేప్పుడు ఆ మిర్రర్‌ను చూసి ముందు భాగంలో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాకే కదిలించాలని డిపో మేనేజర్లు డ్రైవర్లకు సూచిస్తున్నారు. ఇప్పటికే కొన్ని బస్సులకు వీటిని బిగించారు. కొద్ది రోజుల్లో అన్ని బస్సులకు ఏర్పాటు చేయనున్నారు.

కాలేజీలు ఎన్ని? సీట్లు ఎన్ని?

- మెడికల్‌ పీజీ అడ్మిషన్లకు కౌన్సెలింగ్‌ కమిటీ సన్నద్ధం
- కోర్సుల వారీగా సీట్ల వివరాలు సమర్పించాలని ఆదేశం
- జూలై రెండో వారం తర్వాత కౌన్సెలింగ్‌ షెడ్యూల్‌ విడుదల

సాక్షి, హైదరాబాద్‌: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మెడికల్‌ కౌన్సెలింగ్‌ కమిటీ (ఎంసీసీ) సన్నద్ధమవుతోంది. వచ్చేనెల చివరి వారంకల్లా షెడ్యూల్‌ విడుదల చేసి ప్రవేశాల కౌన్సెలింగ్‌ ప్రారంభించే దిశగా ఎంసీసీ చర్యలు వేగవంతం చేసింది. దేశావ్యాప్తంగా క్లినికల్, నాన్‌ క్లినికల్‌ కేటగిరీలో దాదాపు 65వేల సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న కాలేజీల్లో అనుమతుల పునరుద్ధరణ క్రమంలో ఏటా పీజీ సీట్ల సంఖ్య తగ్గుతూ, పెరుగుతూ ఉంటుంది. అనుమతులకు అనుగుణంగా సీట్ల వివరాలను కాలేజీలు ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్‌ కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. ఇందులోభాగంగా కాలేజీలు, కోర్సుల వారీగా సీట్ల సంఖ్యను సమర్పించాలని ఇటీవల కాలేజీల యాజమాన్యాలకు ఎంసీసీ నోటీసులిచ్చింది. ఈమేరకు గడువుకు అనుగుణంగా కాలేజీలన్నీ సీట్ల వివరాలను సమర్పించాయి.

కౌన్సెలింగ్‌లో ప్రకటించేలా...

మెడికల్‌ పీజీ కౌన్సెలింగ్‌లో సీట్ల ప్రకటన అత్యంత కీలకం. ఏ కాలేజీలో ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి... ఈ కోర్సుల్లో ఎన్ని సీట్లు ఉన్నాయనేది అభ్యర్థులకు అత్యంత కీలకమైనది. మునుపటి ఏడాది సీట్లతో పోలిస్తే ప్రస్తుత సీట్ల సంఖ్య చాలాకాలేజీల్లో వ్యత్యాసం ఉంటుంది. ఈక్రమంలో కాలేజీల లాగిన్‌ ఐడీ ఇచ్చిన వివరాలకు అనుగుణంగా కౌన్సెలింగ్‌ పోర్టల్‌లో సీట్ల సంఖ్యను ప్రదర్శించేలా సాఫ్ట్‌వేర్‌ను ఎంసీసీ అప్‌డేట్‌ చేస్తోంది. ప్రస్తుతం కాలేజీల నుంచి స్వీకరించిన సీట్ల వివరాలకు అనుగుణంగా వారంలోపు సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్‌ చేసే అవకాశముంది. ఆ తర్వాత వెబ్‌ కౌన్సెలింగ్‌ ట్రయల్స్‌ నిర్వహించి జూలై రెండో వారం నాటికి ఖరారు చేస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్‌ షెడ్యూల్‌ను ప్రకటించి జూలై ఆఖరు నాటికి మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి చేసేలా కౌన్సెలింగ్‌ కమిటీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఆగస్టు రెండో వారం కల్లా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే... వచ్చే ఏడాది మరింత ముందుగా కౌన్సెలింగ్‌ ప్రక్రియను ప్రారంభించనుంది.

రిజిస్ట్రేషన్‌ తర్వాత రాష్ట్రస్థాయి ర్యాంకులు

పీజీ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఆలిండియా ర్యాంకుతోపాటు రాష్ట్రస్థాయి ర్యాంకులు ఉంటాయి. ప్రస్తుతం జాతీయ స్థాయి ర్యాంకులు వెల్లడించిన నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ (ఎన్‌టీఏ)... ఇటీవల రిజర్వేషన్‌ కేటగిరీ వారీగా ర్యాంకులను ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలో జాతీయ ర్యాంకులు వెలువడ్డాయి. ఇటీవల రాష్ట్రం యూనిట్‌గా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడించింది. అయితే ఈ జాబితా కేవలం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులదేనని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్రస్థాయిలో ర్యాంకుల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. అయితే కౌన్సెలింగ్‌ షెడ్యూల్‌ వెలువడిన తర్వాత రిజిస్ట్రేషన్ల ఆధారంగా రాష్ట్ర ర్యాంకులపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అభ్యర్థులు మరో రెండు, మూడు వారాలు వేచిచూడాల్సిందే.

ధరణిని రద్దు చేసి రైతులను గోస పెడతారా?

- ఇదీ కేసీఆర్‌ అడ్డా.. నోరు అదుపులో పెట్టుకో బిడ్డా
- జేపీ నడ్డాపై మంత్రి వేముల ధ్వజం



సాక్షి, హైదరాబాద్‌: ధరణిని రద్దు చేసి, వీఆర్వో వ్యవస్థతో మళ్లీ రైతులను గోస పెట్టాలని బీజేపీ చూస్తోందా? అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'తెలంగాణకు వచ్చి నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావా? ఇదీ కేసీఆర్‌ అడ్డా.. నోరు అదుపులో పెట్టుకో బిడ్డా?' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను వేముల హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చిన ప్రతీసారి రాష్ట్ర అభివృద్ధిపై విషం చిమ్మే మాటలేనని, రాష్ట్ర నేతలు రాసిన పాత స్క్రిప్టునే ఎన్నిసార్లు చదువుతారని నిలదీశారు. పేదలు, రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న కేసీఆర్‌ని జైళ్లో పెట్టాలంటే.. మరి దేశ సంపదను తన కార్పొరేట్‌ మిత్రులకు దోచి పెడుతున్న ప్రధాని మోదీని ఎన్నిసార్లు జైల్లో పెట్టాలో చెప్పాలని వేముల ప్రశ్నించారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 12వేల కోట్లు ఖర్చు చేస్తే, కేంద్రం ఇచ్చింది రూ. 1200 కోట్లేనని ఎద్దేవా చేశారు. ప్రధాని కిసాన్‌ సమ్మాన్‌ నిధి ద్వారా 29 లక్షల మంది రైతులకు కేంద్రం ఇప్పటివరకు 9వేల కోట్లు ఖర్చు చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మంది రైతులకు ఈ సీజన్‌ వరకు 72వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతుల పట్ల ఎవరి చిత్తశుద్ధి ఏంటో ఈ గణాంకాలు చూస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ రైతులకు అసరాగా నిలబడితే, బీజేపీ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతోందని వేముల మండిపడ్డారు.

రాహుల్‌తో భేటీ అయిన నేతలు వీరే..

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకోవడంతో.. వారి వెంట పెద్ద సంఖ్యలో నేతలు కూడా హస్తం పార్టీలోకి వస్తున్నారు. ఈమేరకు మొత్తం 35 మంది నేతలు సోమవారం ఢిల్లీలో ఖర్గే, రాహుల్‌గాంధీలతో జరిగిన భేటీలో పాల్గొన్నారు. ఇందులో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు గుర్నాథ్‌రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, ఒక మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సిరెడ్డి ఉన్నారు. వీరితోపాటు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, పిడమర్తి రవి, తాడిపత్రి సాయిచరణ్‌రెడ్డి, కూర అన్న కిష్టప్ప, ముద్దప దేశ్‌ముఖ్, జూపల్లి అరుణ్, సూర్య ప్రతాప్‌గౌడ్, కొత్త కల్యాణ్‌కుమార్, దండు నర్సింహ, కిచ్చారెడ్డి, గోపిశెట్టి శ్రీధర్, సూర్య, ముద్వ విజయబేబీ, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ, బానోత్‌ విజయ, తూళ్లురి బ్రహ్మయ్య, మద్దినేని స్వర్ణకుమారి, బొర్ర రాజశేఖర్, కోట రాంబాబు, ఊకంటి గోపాలరావు, డా.రాజా రమేశ్, జూపల్లి రమేశ్, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, హనుమండ్ల ఝాన్సీరెడ్డి, రఘునాథ యాదవ్, రాఘవేంద్రరెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, సూతగాని జైపాల్‌ తదితరులు ఉన్నారు. భేటీ తర్వాత మరో 150 మంది కార్యకర్తలతో ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా ఫొటోలు దిగారు.

ఖమ్మం సభకు ఏర్పాట్లు షురూ..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక నేపథ్యంలో వచ్చే నెల 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఖమ్మం వైఎస్సార్‌ నగర్‌లోని పొంగులేటి వ్యవసాయ క్షేత్రంలో ఇప్పటికే ఏర్పాట్లు మొదలయ్యాయి.

ప్రజల నాడి కాంగ్రెస్‌వైపే!

- బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోవడం ఆ పార్టీకే సాధ్యం
- అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నాం..: పొంగులేటి, జూపల్లి
- బీఆర్‌ఎస్‌ సభను తలదన్నేలా ఖమ్మంలో సభ: పొంగులేటి
- కేసీఆర్‌ ప్రతి పథకంలో భారీగా అవినీతి: జూపల్లి



రాహుల్‌ గాంధీ, ఖర్గేతో సమావేశమైన రేవంత్‌రెడ్డి, పొంగులేటి, జూపల్లి. చిత్రంలో ఠాక్రే తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ నిరంకుశ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే సమయం వచ్చిందని.. వచ్చే ఎన్నికల్లో ఆయనను ఇంటికి పంపిస్తామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కేసీఆర్‌ మాయల మరాఠీ వేషాలు, ప్రజలను మభ్యపెట్టే గారడీలకు చెక్‌ పెడతామని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం పాతాళానికి, అవినీతికి ఆకాశానికి చేరిందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోవడం కాంగ్రెస్‌ పార్టీకే సాధ్యమని, ప్రజల నాడి కూడా అటువైపే ఉన్నందున కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నామని ప్రకటించారు. సోమవారం ఢిల్లీలో ఖర్గే, రాహుల్‌గాంధీలతో భేటీ అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీలతో కలసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి మీడియాతో మాట్లాడారు.

మాయల మరాఠీ 'కేసీఆర్‌': పొంగులేటి

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ బిడ్డలకు ఏమాత్రం ఆత్మగౌరవం దక్కట్లేదని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లుగా కేసీఆర్‌ మాయమాటలు చెప్తూ, గారడీలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అలా ఇప్పటికి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌.. మళ్లీ అదే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ ప్రజలను ఎలా గౌరవిస్తున్నారు, ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అందరికీ తెలుసన్నారు. ఆరు నెలలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అనేక మంది మేధావులు, కవులు, ఉద్యమకారులు, అనేక కులాలు, మతాలకు చెందినవారితో చర్చించామని.. తెలంగాణ బిడ్డలందరి మనసులో కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతను గుర్తించామని చెప్పారు. నాలుగైదు సంస్థలతో చేయించిన సర్వేల్లో కూడా ఇదే విషయం వెల్లడైందన్నారు. బీఆర్‌ఎస్‌లో ఆత్మగౌరవం లేదని.. ఆ పార్టీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు దీనిపై లోలోన మథనపడుతున్నారని పొంగులేటి చెప్పారు.

ప్రాంతీయ పార్టీ పెడదామనుకున్నా..

వివిధ పార్టీల్లోని అసంతృప్త నేతలతో కలసి ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయాలనుకున్నామని.. కానీ దానివల్ల ప్రభుత్వ వ్యతిరేకత ఓటు చీలడం తప్ప లాభం ఉండదన్న ఆలోచనకు వచ్చామని పొంగులేటి వివరించారు. "తెలంగాణ బిడ్డలు ఎవరినైతే ఛీ కొడుతున్నారో, ఎవరినైతే ఇంటికి సాగనంపాలని అనుకుంటున్నారో.. మళ్లీ తిరిగి వారే అధికారంలోకి రావటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుందన్న ఉద్దేశంతో ప్రాంతీయ పార్టీ ఏర్పాటు ఆలోచనను పక్కనబెట్టాం. యాంటీ కేసీఆర్‌ టీమ్‌ అంతా ఒకే జట్టుగా ఉండాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆరు నెలల పాటు విశ్లేషించుకున్న తర్వాత కాంగ్రెస్‌ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నాం.." అని వెల్లడించారు. రాహుల్‌ గాంధీ భారత్‌ జోడో యాత్రతో తెలంగాణలో కాంగ్రెస్‌ గ్రాఫ్‌ పెరగడం ప్రారంభమైందని చెప్పారు. జూలై 2వ తేదీన సాయంత్రం ఖమ్మం వేదికగా జరగబోయే భారీ బహిరంగ సభలో రాహుల్‌ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌ కండువా కప్పుకోనున్నట్టు పొంగులేటి వెల్లడించారు. గతంలో ఖమ్మం వేదికగా బీఆర్‌ఎస్‌ నిర్వహించిన సభను తలదన్నేలా కాంగ్రెస్‌ సభను ఏర్పాటు చేస్తామన్నారు.

కేసీఆర్‌కు పాలించే అర్హత లేదు: జూపల్లి

తొమ్మిదేళ్ల కేసీఆర్‌ పాలనలో ప్రజాస్వామ్యం పాతాళానికి, అవినీతి ఆకాశానికి చేరాయని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. కేసీఆర్‌ ఎన్నికలు వచ్చిన ప్రతీసారి కొత్త పథకాలు, హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి పథకం వెనుక ఎంతో అవినీతి ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌ నియంతలా వ్యవహరిస్తున్నారని.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా కనీసం గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లోనైనా తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి సోనియా రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూలై 14 లేదా 16వ తేదీన మహబూబ్‌నగర్‌ జిల్లాలో జరిగే బహిరంగసభలో ఏఐసీసీ పెద్దల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటించారు.

వారిది ఫెవికాల్‌ బంధం: రేవంత్‌రెడ్డి

తెలంగాణలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్‌ బంధమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్లుగా ఈ రెండు పార్టీలు కలసి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు అందరినీ కలుపుకొని పోరాడేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌ కలసి పోటీ చేయడం ఖాయమన్నారు.

మన టైం వచ్చింది..

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ భేటీ అయ్యారు. ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, పొదెం వీరయ్య, సీనియర్‌ నేతలు జానారెడ్డి, దామోదర రాజనర్సింహ, మహేశ్‌కుమార్‌గౌడ్, చిన్నారెడ్డి, వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ భేటీలో పొంగులేటి, జూపల్లిలను రాహుల్, ఖర్గేలకు రేవంత్‌రెడ్డి పరిచయం చేశారు. తర్వాత వారు మిగతా నేతలను పరిచయం చేశారు.

కేసీఆర్‌ హఠావో.. తెలంగాణ బచావో..

ఈ సందర్భంగా రాహుల్‌ గాంధీ మాట్లాడారు. తెలంగాణలో 'ఘర్‌ వాపసీ' మొదలైందని, పార్టీని వీడిన నేతలంతా తిరిగి చేరేలా చూడాలని రాష్ట్ర నేతలకు సూచించారు. రాష్ట్రంలో కేసీఆర్‌ కుటుంబ, నియంత పాలనపై ప్రజలకు విసుగొచ్చిందని, ఈ సర్కారును సాగనంపాలని అంతా నిర్ణయించుకున్నారని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ కలసిపోయాయని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని, ఇది కాంగ్రెస్‌కు అనుకూలిస్తుందని వివరించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌ సమయం వచ్చిందని, దీన్ని అనుకూలంగా మల్చుకుని 'కేసీఆర్‌ హఠావో.. తెలంగాణ బచావో' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రస్తుత అవకాశాన్ని చేజారనీయొద్దని స్పష్టం చేశారు.

ఖమ్మం సభకు రాహుల్‌..

ఏఐసీసీ పెద్దలతో భేటీలో జూపల్లి, పొంగులేటి కూడా మాట్లాడారు. తెలంగాణలో మార్పు మొదలైందని, బీఆర్‌ఎస్‌ను ఓడించడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని వివరించారు. ఈసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి సోనియాకు బహుమతిగా ఇస్తామన్నారు. జూలై 2న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు రావాలంటూ రాహుల్‌గాంధీని వారు ఆహ్వానించగా.. ఆయన సుముఖత తెలిపారు. ఆ సభలోనే పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌ కండువా కప్పుకోనున్నారు. భేటీ అనంతరం జూపల్లి, పొంగులేటి, వారి అనుచరులతో రాహుల్‌ గ్రూప్‌ ఫొటోలు దిగారు.

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్‌ చేయకపోవడం వెనుక డీల్‌ ఉందని, బీజేపీ–బీఆర్‌ఎస్‌ల అవగాహనలో భాగంగానే అరెస్ట్‌ ఆగిపోయిందని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలను ఆదేశించారు. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం, సమష్టి బాధ్యతతో పార్టీని అధికారంలోకి తేవాలని సూచించారు.



ఢిల్లీలో ప్రియాంకాగాంధీతో పొంగులేటి, జూపల్లి

పాలమూరు సభకు ప్రియాంక గాంధీ..

రాహుల్, ఖర్గేలతో భేటీ అనంతరం జూపల్లి, పొంగులేటి తదితరులు సోనియాగాంధీ నివాసానికి వెళ్లి ప్రియాంకా గాంధీతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. జూలై 14 లేక 16న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు రావాలని ప్రియాంకా గాంధీని జూపల్లి ఆహ్వానించారు. దీనికి ప్రియాంక సమ్మతించారని అనంతరం జూపల్లి తెలిపారు. కష్టపడి పనిచేయాలని, దానికి అనుగుణంగా పదవులు అవే లభిస్తాయని ఆమె పేర్కొన్నట్టు సమాచారం.

క్లుప్తంగా...

నేడు బీజేపీ కార్యకర్తలతో మోదీ మాటామంతీ

సాక్షి, హైదరాబాద్: మంగళవారం ఉదయం 10:30 గంటలకు మధ్యప్రదేశ్ భోపాల్ నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నారు. పార్టీపరంగా మేరా బూత్ సబ్సే మజ్బూత్ (నా పోలింగ్ బూత్ అన్నిటికన్నా శక్తివంతమైనది) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం, అత్యధిక సభ్యులున్న బీజేపీ విధివిధానాలు, పార్టీ కార్యకర్తల బాధ్యతలు, సేవ వంటి అంశాలపై ప్రధాని మాట్లాడతారని రాష్ట్ర 'మేరా పోలింగ్ బూత్ సబ్సే మజ్బూత్' ప్రముఖ్ గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా విస్తృతంగా చేసిన ఏర్పాట్ల ద్వారా మోదీ సందేశాన్ని ప్రజలకు తెలియచేస్తామన్నారు. రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో దాదాపు 36 వేల పోలింగ్ బూత్‌లు, మండల స్థాయిలలో టెలివిజన్, స్క్రీన్లు, మొబైల్‌ఫోన్ల వంటివి ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, పోలింగ్ బూత్‌ల స్థాయిలలో బాధ్యతలు ఉన్నవారు ప్రజలతో మమేకమై ప్రధాని సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

పోడు భూముల పంపిణీలో మోసం

మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలను సీఎం కేసీఆర్ అడుగడుగునా మోసం చేస్తున్నారని, గిరిజనులకు పోడు భూముల విషయంలో అరకొరగా పంపిణీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ ఆరోపించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పోడు భూముల కోసం నాలుగు లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 1.5 లక్షల మందికి పట్టాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. పోడు పట్టాల కోసం గిరిజనులు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు సీఎం కేసీఆర్‌ను కూడా నిలదీయాలన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం పేరుతో భూములు గుంజుకుంటున్నారని, ఇందిరాగాంధీ హయాంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కూడా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పట్టాల పంపిణీ పేరిట మళ్లీ నాటకానికి తెరలేపారని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న పేదలు ఆ భూములను దున్నుకోవాలని, వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందని రాములు నాయక్ పిలుపునిచ్చారు.

పార్లమెంట్, అసెంబ్లీ సీట్ల పునర్విభజనపై కుట్ర'

విభజనతో విజయం సాధించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): దేశాన్ని ప్రాంతాల వారీగా రాజకీయ విభజన చేసి, తద్వారా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని బీజేపీ భావిస్తుందని, దాన్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం మీడియాకు లీకుల్ని విడుదల చేసి, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన 'పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం కుట్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, జనాభా నిష్పత్తి ఆధారంగా పునర్విభజన పేరుతో విభజించు పాలించు అనే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉత్తరాదిలో స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, దక్షిణాదికి చట్టసభల్లో సరైన ప్రాధాన్యత ఇవ్వకుంటే సహించేది లేదన్నారు.

పార్టీలు బీసీ డిక్లరేషన్ ప్రకటించాలి: జాజుల



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలో మరో నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అన్ని పార్టీలు బీసీ రాజకీయ డిక్లరేషన్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు ఏ పార్టీ ఎన్ని టిక్కెట్లు ఇస్తుంది? ఏ పార్టీ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటిస్తారో స్పష్టం చేయాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు రాజకీయంగా అనుసరించాల్సిన విధానంపై చర్చించి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటించేందుకు జూలై 15న 10 వేల మంది బీసీ ప్రతినిధులతో 'బీసీల రాజకీయ ప్లీనరీ' నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఎన్ని టిక్కెట్లు ఇస్తారో చెప్పకుండా రాయితీలు, సంక్షేమ పథకాల పేరుతో అన్ని పార్టీలు బీసీ డిక్లరేషన్ అని కొత్త నాటకానికి తెరలేపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు రాష్ట్రం గమ్యస్థానం

- రూ. 3,650 కోట్లతో లులు గ్రూప్ కార్యకలాపాల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్
- వ్యవసాయ, అనుబంధ రంగాల పురోగతితో ఆహార శుద్ధి రంగంలో పెట్టుబడులు
- కేటీఆర్ సమక్షంలో పత్రాల మార్పిడి



రాష్ట్రంలో పెట్టుబడులపై మంత్రి కేటీఆర్ నుంచి ఒప్పంద పత్రాలను స్వీకరిస్తున్న లులు గ్రూప్ చైర్మన్ యూసుఫాలీ ఎంఏ. చిత్రంలో అధర్ సిన్హా, నరసింహారెడ్డి తదితరులు.

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల్లో రాష్ట్రం విప్లవాత్మక పురోగతి సాధించడం ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాధించిన ఐదు విప్లవాలతో అనేక దిగ్గజ సంస్థలు పెట్టుబడులతో ముందుకు వస్తుండటంతో రైతులు, ప్రభుత్వ ఆదాయం పెరగడంతోపాటు రైతుల జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులు, రిటైల్ రంగంలో అంతర్జాతీయంగా పేరొందిన లులు గ్రూప్ తెలంగాణలో రూ. 3,650 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పత్రాలను సోమవారం మంత్రి కేటీఆర్ సమక్షంలో లులు గ్రూప్ ఇంటర్నేషనల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ యూసుఫాలీ ఎంఏ స్వీకరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటైన తొమ్మిదేళ్లలోనే రాష్ట్ర ప్రభుత్వ తలసరి ఆదాయం రెట్టింపైందని, జీఎస్‌డీపీలోనూ భారీగా వృద్ధిరేటు నమోదైందన్నారు. నాలుగేళ్ల రికార్డు సమయంలో కాళేశ్వరాన్ని ఎత్తిపోతలను పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 90 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి వరి దిగుబడి 68 లక్షల మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం 3.5 కోట్ల టన్నులకు చేరిందని చెప్పారు. తెలంగాణ బియ్యం కోసం కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా డిమాండ్ ఉందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, మత్స్య, మాంసం, పాడి, పామాయిల్ విప్లవాలు సాధించడంతో రైతులకు ఆదాయం పెరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. రోజుకు ఐదు లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే మెగా డెయిరీని రూ. 300 కోట్లతో ఈ ఏడాది ఆగస్టులో ఏర్పాటు చేస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించేందుకు 10 వేల ఎకరాల్లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ రంగంలో పెట్టుబడులతో ముందుకొస్తే స్థలం కేటాయించేందుకు సిద్ధమని యూసుఫాలీకి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో లులు పెట్టుబడులు రూ. 3,650 కోట్లు

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కేంద్రంగా పనిచేస్తున్న తాము తెలంగాణలో రూ. 3,650 కోట్లతో కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు లులు గ్రూప్ ఇంటర్నేషనల్ సీఎండీ యూసుఫాలీ ఎంఏ ప్రకటించారు. తొలివిడతలో రూ. 500 కోట్ల మేర పెట్టుబడి పెడుతుండగా ఇందులో రూ. 300 కోట్లతో కూకట్‌పల్లిలో ఏర్పాటు చేసిన మాల్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభిస్తామన్నారు. ఈ మాల్ ద్వారా 2 వేల మందికిపైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మరో రూ. 200 కోట్లతో చెంగిచెర్లలో రోజుకు 60 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 2,500 మందికి ఉపాధి కల్పించేలా ఆధునిక ఇంటిగ్రేటెడ్ మాంసం ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరో 18 నెలల్లో ఈ ప్లాంట్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే ఐదేళ్లలో లులు గ్రూప్ ద్వారా తెలంగాణలో రూ. 3,150 కోట్ల కొత్త పెట్టుబడులు వస్తాయని, రూ. 2 వేల కోట్లతో హైదరాబాద్‌లో డెస్టినేషన్ షాపింగ్‌మాల్, రూ.వెయ్యి కోట్లతో ప్రధాన నగరాలు, ఇతర పట్టణాల్లో మినీమాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం సహకరిస్తే తెలంగాణ నుంచి 5 లక్షల టన్నుల బియ్యం కొనుగోలుతోపాటు ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్‌ను తక్షణమే ఏర్పాటు చేస్తామని యూసుఫాలీ ప్రకటించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ ప్రత్యేక కార్యదర్శి అధర్ సిన్హా, టీఎస్ఐఐసీ చైర్మన్ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ
- ఆదివాసీలకు హక్కులు, పోడు భూముల సమస్యకు పరిష్కారం
- సీఎల్పీ నేత భట్టి హామీ



మున్యానాయక్ తండాలో భట్టితో కలసి పాదయాత్రలో ఆర్. దామోదర్‌రెడ్డి

చివ్వెంల (సూర్యాపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. అలాగే స్థలాలున్న పేదలు ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు, వందరోజుల పనికి వెళ్లే కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. అదేవిధంగా వృద్ధాప్య పింఛన్ భార్యాభర్తలిద్దరికీ ఇస్తామన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని భరోసా ఇచ్చారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం, కొండల రాయినిగూడెం, మున్యానాయక్‌తండా, కర్వీ నాగారం గ్రామాల గుండా సాగింది. బీబీగూడెం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొండల రాయినిగూడెంలో భట్టి.. శతాధిక వృద్ధురాలు మరియమ్మతో మాట్లాడి, నాటి నిజాం రజాకార్ల దౌర్జన్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. కేసీఆర్ మరోసారి ఆదివాసీలు, అడవి బిడ్డలను మోసం చేసేందుకు పోడు భూములకు పట్టాలిస్తామంటున్నారని, ఇలాంటి మాటలను కేసీఆర్ అనేకమార్లు చెప్పారని అన్నారు. గతంలో అడవి బిడ్డల కోసం యూపీఏ ప్రభుత్వం పోడు భూముల చట్టాన్ని తీసుకువచ్చిందని, అయితే ఆ చట్టాలను, అడవి బిడ్డల హక్కులను బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తోందని భట్టి ధ్వజమెత్తారు. నాలుగు నెలల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఆదివాసీలకు హక్కులు దక్కేలా చేయటంతో పాటు, అటవీ భూముల చట్టాలను అమలు చేస్తామని తెలిపారు. అటవీ హక్కుల కోసం ఇప్పుడు ఆదిలాబాద్ నుంచి నల్లమల వరకు ప్రతి గిరిజన బిడ్డ గర్జిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పోడు భూముల సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. కాగా, భట్టి విక్రమార్క తన పాదయాత్ర మార్గమధ్యలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించిన ఎస్సారెస్పీ కాలువను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, చివ్వెంలం మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి బండి సంజయ్

- అధిష్టానం పిలుపు మేరకు హుటాహుటిన పయనం
- ఈటల, రాజగోపాల్ తిరిగొచ్చిన మరునాడే పిలుపుపై పలు ఊహాగానాలు
- మోదీ, అమిత్ షా పర్యటనల ఖరారు కోసమేనంటూ ఓ వర్గం ప్రచారం
- కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు, అమెరికా వీసా కోసమంటున్న సన్నిహితులు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హుటాహుటిన ఢిల్లీకి పయనం కావడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ అధిష్టానం పిలుపు మేరకే రాష్ట్రంలో కార్యక్రమాలను రద్దు చేసుకుని.. సంజయ్ సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్నట్టు సమాచారం. నాలుగైదు రోజుల కిందే సంజయ్ ఢిల్లీ వెళ్లి పార్టీ ముఖ్య నేతలను కలసి రావడం, తర్వాత అసంతృప్త నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఢిల్లీలో అధిష్టానం పెద్దలతో భేటీ అయి తిరిగి రావడం, ఆ మరునాడే సంజయ్ మళ్లీ ఢిల్లీ వెళ్లడం నేపథ్యంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

చక్కదిద్దే పనిలో భాగంగానే..

రాష్ట్ర బీజేపీలో ఏర్పడిన గందరగోళ పరిస్థితులను చక్కదిద్దే పనిలో భాగంగా ఈటల, రాజగోపాల్‌రెడ్డిలతోపాటు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో జాతీయ నేతలు అమిత్ షా, జేపీ నడ్డా సమాలోచనలు జరిపారు. ఆదివారం నడ్డా రాష్ట్ర పర్యటనకు వచ్చిన సమయంలోనూ పార్టీలో పరిస్థితులపై పలువురు నేతలు తమ అసంతృప్తిని ఆయనకు వివరించినట్టు సమాచారం. ఈ క్రమంలో పార్టీలో సంస్థాగత మార్పులపై సంప్రదింపుల కోసమే సంజయ్‌ను ఢిల్లీకి పిలిపించి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్య నేతల మధ్య సమన్వయ లోపం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులకు తగిన ప్రాధాన్యత లభించకపోవడం వంటి అంశాలపై ఈటల, రాజ్‌గోపాల్‌రెడ్డి, మరి కొందరు నేతలు వెలిబుచ్చిన అభిప్రాయాలపై సంజయ్‌తో మాట్లాడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో రాష్ట్ర పార్టీలో అసంతృప్తిని చల్చార్చి, ముఖ్య నేతలను ఏకతాటిపైకి తేవడం లక్ష్యంగా అధినాయకత్వం చేస్తున్న కసరత్తులో భాగంగానే ప్రస్తుత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నాయి.

జాతీయ నేతల పర్యటనల కోసమే..!

విదేశీ పర్యటన ముగించుకుని ప్రధాని తిరిగి రావడంతో ఈ నెలాఖరులోగా రాష్ట్రంలో ఆయన రోడ్డుషో లేదా సభ తేదీ, సమయం ఖరారు కోసం సంజయ్ ఢిల్లీ వెళ్లారని ఒక వర్గం నాయకులు చెప్తున్నారు. ఖమ్మంలో లేదా మరోచోట అమిత్ షా సభ కోసం టైమ్ తీసుకోనున్నట్టు వివరిస్తున్నారు. సంజయ్ గతంలోనే పలువురు కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్లు కోరారని.. అవి ఖరారు కావడంతోనే హస్తినకు వెళ్లారని ఆయన సన్నిహితులు చెప్తున్నారు. త్వరలో 'ఆటా'సభల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లాల్సి ఉన్నందున వీసా నిమిత్తం ఢిల్లీ వెళ్లారని అంటున్నారు.

'పాకెట్ మనీ' వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్

బండి క్షమాపణలు చెప్పాలి: టీపీసీసీ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 30 మంది కాంగ్రెస్ నేతలకు సీఎం కేసీఆర్ పాకెట్ మనీ ఇస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతల విశ్వసనీయతను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసిన సంజయ్.. పార్టీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడిన పలువురు నేతలు బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు. బండి సంజయ్ వ్యాఖ్యలు కట్టె తుపాకోళ్ల మాటలను మరిపిస్తున్నాయని, రోజురోజుకూ రాష్ట్రంలో చతికిలపడుతున్న బీజేపీని జాకీలు పెట్టి లేపేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే కాంగ్రెస్‌పై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నిజంగా సంజయ్‌కు దమ్ముంటే ఆ నేతల పేర్లు బయటపెట్టాలన్నారు.

విద్యా వలంటీర్లను రెగ్యులరైజ్ చేయండి

మంత్రి సబితకు వినతి

బంజారాహిల్స్: ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసిన 15 వేల మంది విద్యా వలంటీర్లను రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర విద్యావలంటీర్ల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు బానోతు శివలాల్ ఆధ్వర్యంలో విద్యావలంటీర్లు విద్యాశాఖామంత్రి సబితను ఆమె నివాసంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు లేని చోట్ల విద్యా వలంటీర్లను నియమిస్తామని దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 25న నిర్వహించిన విద్యాదినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పర్యటనలో మంత్రి కేటీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. కరోనా వేళ తమను విధుల నుంచి తొలగించారని, మూడేళ్లుగా రెన్యువల్ కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఉపాధి లేక చాలా మంది వలంటీర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం తమను రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు.

అభివృద్ధిని ఓర్వలేకే అడ్డగోలు మాటలు

▶ మొదటి పేజీ తరువాయి

మాటలు మాట్లాడొద్దంటూ హెచ్చరించారు. అడ్డం పొడుగు లేని మాటలు మాట్లాడితే తెలంగాణ ప్రజలు సహించబోరని చెప్పారు. ఉప్పల్ రింగురోడ్డు వద్ద సుమారు రూ.25 కోట్లతో నిర్మించిన స్కైవాక్‌ను మంత్రి కేటీఆర్ సోమవారం ప్రారంభించారు. అంతకుముందు ఉప్పల్ మినీ శిల్పారామం వద్ద రూ.10 కోట్లతో నిర్మించిన మల్టీ పర్పస్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు.

మీరంతా సొంత అస్తిత్వం లేని గులాములు

'కేసీఆర్‌ను ఎందుకు జైల్లో వేస్తారు? కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసినందుకా? సర్కార్ దవాఖానాల్లో వైద్య సేవలను మెరుగుపర్చినందుకా? ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు కేసీఆర్ కిట్‌లను అందజేసినందుకా? డబుల్ బెడ్‌రూమ్ వంటి పథకాలను ప్రవేశపెట్టినందుకా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 'హైదరాబాద్‌లో మా ప్రభుత్వం 35 ఫ్లైఓవర్ బ్రిడ్జీలను నిర్మించింది. ప్రజలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు సదుపాయాలను అభివృద్ధి చేసింది. కేంద్రం నారపల్లి నుంచి ఉప్పల్ వరకు చేపట్టిన ఫ్లైఓవర్ ఆరేళ్లు అయినా పూర్తి కాలేదు. అంబర్‌పేట్ ఫ్లైఓవర్ అలాగే ఉండిపోయింది. ఇదీ కేసీఆర్ పనితీరుకు, మోదీ పనితీరుకు మధ్య వ్యత్యాసం. కాంగ్రెస్, బీజేపీ నాయకులంతా సొంత అస్తిత్వం లేని ఢిల్లీ గులాములు. కానీ కేసీఆర్ స్వీయ రాజకీయ అస్తిత్వంతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలోని దరిద్రాన్ని, పేదరికాన్ని కేవలం తొమ్మిదేళ్లలో పోగొట్టారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ ఒక అన్నగా, ఇంటి పెద్దగా అండగా ఉండి వాళ్ల కష్టాలను తీరుస్తున్నారు. ఆయన నాయకత్వంలోనే ప్రగతి రథచక్రాలు పరుగులు తీస్తాయి..' అని మంత్రి చెప్పారు.

అమరవీరులను చంపింది సోనియా గాంధీయే..

'అమరవీరులను చంపింది సోనియా గాంధీయే. తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంలో జాప్యం వల్లనే వాళ్లు చనిపోయారు. అయితే రేవంత్‌రెడ్డి అమరుల గురించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు. కేసీఆర్‌ను తిడుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడు. పులి శాకాహారిగా మారినట్లు ఆయన అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. రూ.50 లక్షల నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన దొంగోడు, జైల్లో చిప్పకూడు తిన్నోడు అవినీతి గురించి మాట్లాడుతున్నాడు..' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

పాదచారుల భద్రతకు భరోసా

'నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన స్కైవాక్ వల్ల రింగురోడ్డుకు 5 మార్గాల్లో పాదచారులు నిర్భయంగా రాకపోకలు సాగించవచ్చు. ఉప్పల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేసింది. రూ.453 కోట్లతో మంచినీళ్ల ట్యాంకులు, పైపులైన్‌లు కొత్తగా ఏర్పాటు చేశాం. త్వరలో ఎయిర్‌పోర్టు మెట్రో కూడా అందుబాటులోకి వస్తుంది. ఉప్పల్–ఘట్‌కేసర్ మార్గంలో నాణ్యమైన రోడ్లు వేస్తాం' అని మంత్రి తెలిపారు. స్కైవాక్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన దానిపై కొద్దిసేపు నడిచారు. హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను, స్కైవాక్ మోడల్‌ను తిలకించారు. హెచ్ఎండీఏ కమిషనర్ అరివింద్ కుమార్, చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డి ప్రాజెక్టు ప్రత్యేకతలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్ ప్రారంభించిన ఉప్పల్ స్కైవాక్

తెలంగాణలో మెజార్టీ స్థానాల్లో పోటీ

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



ఖలీల్‌వాడి (నిజామాబాద్): తెలంగాణలో వచ్చే శాసన సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలలో పోటీకి సిద్ధమవుతున్నట్లు ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఏయే స్థానాల్లో పోటీ చేసేది ఎన్నికల ముందు ప్రకటిస్తామని చెప్పారు. సోమవారం ఆయన నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ముందు పార్టీ శ్రేణులతో మాట్లాడి ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేస్తామని, తర్వాత ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే విషయం ఆలోచిస్తామని తెలిపారు. బోధన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే షకీల్‌కు ఎన్నికల ద్వారా తగిన బుద్ధి చెబుతామని స్పష్టంచేశారు. పట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశానికి ఎంఐఎం పార్టీకి ఆహ్వానం అందలేదన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దేశంలో ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయన్నారు. అంతేగాకుండా దళితులు, ముస్లింలపై దాడులు పెరిగాయన్నారు. నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కావద్దని కోరుకుంటున్నట్లు తెలిపారు. పట్నా సమావేశానికి తమను ఆహ్వానించకున్నా.. మోదీని గద్దె దించడానికి సహకారం అడిగితే తప్పకుండా మద్దతు ఇస్తామని చెప్పారు. సీఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్న సమయంలో యూపీఏతో విభేదాలు వచ్చాయని, దానితో ఆ కూటమి నుంచి బయటకు వచ్చామని అసదుద్దీన్ వెల్లడించారు. తెలంగాణలో బీజేపీ గెలుపునకు ఎంఐఎం కారణమని చెప్పడం సరైంది కాదన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బీజేపీ ఎంపీల గెలుపునకు ఎవరు కారణమో ప్రజలకు తెలుసునన్నారు. కామన్ సివిల్ కోడ్‌కు ఎంఐఎం పార్టీ ఎప్పుడూ వ్యతిరేకంగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌లో మైనారిటీలకు అధిక నిధులు కేటాయించినా ఎక్కడా నిధులు విడుదల చేయడం లేదన్నారు.

మాజీ సైనికుల కోసం 'జై జవాన్ కిసాన్'

సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) తెలంగాణలోని మాజీ సైనిక ఉద్యోగుల కోసం 'జై జవాన్ కిసాన్' కార్యక్రమాన్ని చేపట్టింది. రక్షణ సేవల నుంచి చిన్న వయస్సులో పదవీ విరమణ పొందే సిబ్బందికి పునరావాసం కల్పించేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిటైర్డ్ సిబ్బందికి వేతనంతో కూడిన స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడానికి నాబార్డు సహకారంతో మేనేజ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాజీ సైనికులకు వ్యవసాయ సంబంధిత నైపుణ్యాన్ని అందించేందుకు 15 రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభించనుంది. సెప్టెంబర్ 4 నుంచి 18వ తేదీ వరకు రాజేంద్రనగర్‌లోని మేనేజ్‌లో నిర్వహించే ఈ కోర్సుకు ఎలాంటి ఫీజు లేదు. ఉచిత భోజనం, వసతి ఉంటాయి. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తారు. దీనికి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోని మాజీ సైనికులు, రాష్ట్రంలోని బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్ మొదలైన పారామిలిటరీ దళాల నుంచి పదవీ విరమణ పొందిన సిబ్బంది అర్హులు. అర్హతగల 50 మంది అభ్యర్థులను మేనేజ్ ఎంపిక చేస్తుంది. దరఖాస్తు సమర్పణకు జూలై 15 చివరి తేదీ. వివరాలకోసం 9052028777 నంబర్ సంప్రదించాలని లేదా సంస్థ వెబ్‌సైట్‌లో చూడాలని మేనేజ్ ఒక ప్రకటనలో తెలిపింది.

> ఒక వ్యక్తి ఎల్లప్పుడూ తనను తాను సగం చెడ్డవాడిగా,
> సగమే నీతిమంతుడిగా భావించుకోవాలి.
> అప్పుడు మాత్రమే అతడు ధర్మం వైపు మొగ్గు చూపగలడు.
> – జుడాయిజం

సాక్షి

మంగళవారం, 27 జూన్ 2023

స్వయంకృతాపరాధం

పాలు పోసి పెంచిన పాము కాటేయడానికి పడగ విప్పి మీదకొస్తే ఎలా ఉంటుంది? అది ఎలా ఉంటుందో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇప్పుడు తెలిసొచ్చి ఉంటుంది. శత్రు దేశాలపై దాడి కోసం తాను పెంచిపోషిస్తూ వచ్చిన కిరాయి సైన్యం 'వాగ్నర్ ప్రైవేట్ మిలటరీ కంపెనీ', దాని అధినేత యెవ్‌జెనీ ప్రిగోజిన్ ఒక్కసారిగా తన మీదకే విరుచుకుపడేసరికి పుతిన్ దిగ్భ్రమకు లోనైనట్టున్నారు. గత వారాంతంలో రష్యాలో దాదాపు అంతర్యుద్ధం అంచులకు వెళ్ళిన పరిణామాలు అలాంటివి. దేశానికి దక్షిణాన అతి కీలక నగరాల్లో ఒకటైన రోస్తోవ్ – ఆన్– డాన్ చేజిక్కించుకొని, మాస్కో దిశగా వాగ్నర్ కిరాయి సైనికులు దూసుకు వస్తున్నప్పుడు పరిస్థితి భయానకంగా కనిపించింది. పైకి ఎన్ని బీరాలు పలికినా, చివరకు బెలారస్ దేశాధినేత కుదిర్చిన సంధితో పుతిన్ ఊపిరిపీల్చుకో గలిగారు. ఇప్పటికి వాగ్నర్ సేనలు వెనక్కి తగ్గి, ఉక్రెయిన్‌తో పోరుకు మళ్ళీ సరిహద్దుల దారి పట్టినా, పుతిన్‌కు తగిలిన షాక్, ఆయన ఇమేజ్‌కు పడిన దెబ్బ సామాన్యమైనవి కావు.

ఎవరికీ వంగని, దేనికీ లొంగని ధీరుడిగా పేరున్న పుతిన్ ప్రతిష్ఠను ఈ తిరుగుబాటు చావుదెబ్బ తీసింది. ఉక్రెయిన్‌తో పోరులో బింకంగా ముందడుగు వేస్తున్న ఆయన ఈ దెబ్బ నుంచి కోలుకోవడం సులభమేమీ కాదు. 1999 నుంచి ఇప్పటి దాకా ప్రధానిగానో, అధ్యక్షుడిగానో అధికారంలో ఉంటూ వచ్చారు పుతిన్. రష్యాపై తిరుగులేని పట్టు బిగించిన ఈ ఏలిక తన సుదీర్ఘ హయాంలో తొలిసారిగా పెద్ద సవాలును ఎదుర్కొంటున్నారు. 'పుతిన్‌కు వంటగాడ'నే పేరు దక్కిన ఒక దొంగ, హంతకుడు ఆ స్థాయి నుంచి ప్రైవేట్ సైనిక సంస్థకు అధిపతిగా ఎదగడం వెనక ఉన్నది పుతినే అన్నది జగమెరిగిన సత్యం. ఆఫ్రికా నుంచి అరబ్ ప్రపంచం వరకు, తాజా ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఈ కిరాయి మూకల్ని వాడుకుంటూ వచ్చిందీ పుతినే! అందుకే, పూర్తి బాధ్యత కూడా ఆయనదే!

ఉక్రెయిన్‌పై కార్యకలాపాల్లో రష్యా సైనికాధిపతుల పట్ల, ముఖ్యంగా రక్షణ మంత్రి పట్ల ప్రిగోజిన్ కొద్ది నెలలుగా అసంతృప్తితో ఉన్నారు. రక్షణ శాఖలో అగ్రస్థానంలో మార్పుల్ని కోరుకుంటున్నారు. ఆఖరికి ఆయన కిరాయి మూకలు తేలిగ్గా ఒక్కో నగరం దాటుకుంటూ మాస్కో సమీపానికి రావడం అంతర్యుద్ధ మేఘాలను అలముకొనేలా చేసింది. బెలారస్ నేత లుక షెంకో తెరవెనుక రాజీతో ఇప్పటికి గండం గడిచింది. పుతిన్ మీద ప్రేమ కన్నా, డబ్బు కోసమనే ప్రాణాలకు తెగించే వాగ్నర్ మూకలు వెనుదిరగడం ఊరికే జరగలేదు. దేశద్రోహులంటూ వీరంగం వేసిన పుతిన్ చివరకు ఎవరిపై ఏ కేసులూ పెట్టనని ఒప్పుకోవాల్సి వచ్చింది. ప్రిగోజిన్‌పై చర్యలుండవని హామీ ఇవ్వాల్సొచ్చింది. రెండు లక్షల కోట్ల డాలర్ల కన్నా తక్కువకు పడిపోయిన జీడీపీతో, ఉక్రెయిన్‌తో పోరులో నష్టాలతో సతమతమవుతున్న రష్యా కొత్తగా మరో పోరు చేసే పరిస్థితిలో లేదు.

వెరసి, తప్పుడు అంచనాలతో ఉక్రెయిన్‌పై 16 నెలల క్రితం యుద్ధం మొదలుపెట్టి, వెనక్కి రాలేని పద్మవ్యూహంలో చిక్కుకున్న పుతిన్‌కు ప్రపంచం ముందు ఇవి తీరని తలవంపులే. ఇవన్నీ ఆయన స్వయంకృతాపరాధాలే. బలమైన వాగ్నర్ మూకల్ని రక్షణ శాఖ కిందకు తేవాలన్న రష్యా సైనిక నేతల నిర్ణయం బెడిసికొట్టింది. వ్యూహంలో, దాడుల్లో తమ కన్నా వెనుకబడిన ప్రభుత్వ సైనిక నేతల కింద పనిచేయడం ప్రిగోజిన్‌కు మింగుడుపడని విషయం. అందువల్లే ఈ తిరుగుబాటు తలెత్తిందట. పుతిన్‌కు తాను వ్యతిరేకం కాదనే నేటికీ ప్రిగోజిన్ మాట. ఏమైనా, ఇప్పుడు రష్యాకు మరో తలనొప్పి వచ్చి పడింది. ఇకపై ఉక్రెయిన్‌పై పోరులో రష్యన్ సైనిక నేతలు మునుపటిలా ఈ కిరాయి మూకల్ని నమ్మలేరు. రక్షణ శాఖతో కాంట్రాక్ట్ ఉన్నవారే ఇకపై పోరులో పాల్గొంటారట. కానీ, అపనమ్మకమున్న యుద్ధంలో అడుగు ముందుకు పడదు. అసలే ఉక్రెయిన్‌లో ఆశించిన పురోగతి లేక అస్తుబిస్తవుతున్న పుతిన్‌కు ఇది దెబ్బ మీద దెబ్బ.

తాజా తిరుగుబాటులో చేరని వాగ్నర్ ఫైటర్లను ప్రభుత్వ సైన్యంలోకి తీసుకోవాలని రష్యా యోచిస్తున్నప్పటికీ, ఇలాంటి మూకలతో రష్యా ఎలా వేగగలదో చెప్పలేం. ప్రిగోజిన్ తిరుగుబాటు ఇప్పటికి టీ కప్పులో తుపానైపోయినా, క్షీణిస్తున్న పుతిన్ పట్టుకు అది ప్రతీక. అణ్వస్త్ర రష్యా సైనిక బలగంలోని బలహీనతలూ, చీలికలూ బట్టబయలయ్యాయి. సైనిక జనరల్స్‌ను ఒకరి తర్వాత మరొకరిని తొలగిస్తూ వస్తున్న పుతిన్‌కు యుద్ధంలో తగిన వ్యూహమూ ఉన్నట్టు లేదు. మరోపక్క, తాజా ఘటనలతో యుద్ధంలో ఉక్రెయిన్ సైన్యానికి ఊహించని సానుకూలత వరించింది. ఒకవేళ యుద్ధాన్ని ముగించదలుచుకుంటే ఇరుపక్షాలకూ ఓ చిన్న కిటికీ తెరుచుకుంది. కానీ, కిందపడ్డా నాదే పై చేయి అనే పుతిన్ కానీ, 'నాటో' బూచితో రష్యాను దారికి తెచ్చుకోవాలని చూస్తున్న పాశ్చాత్య ప్రపంచం కానీ అందుకు ముందుకొస్తాయా?

ఏమైనా రష్యా పరిణామాలను ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. పుతిన్ తదుపరి అడుగులు, భవితవ్యంపై లెక్కలు కడుతోంది. సైన్యం, పాలనా యంత్రాంగం, వ్యాపార వర్గం సహా వ్యవస్థలన్నిటినీ విడగొట్టి, ఎవరూ అధికారం ప్రోది చేసుకోకుండా బలహీనంగా ఉంచి, నియంత్రణ తన చేతిలో పెట్టుకొనే పుతిన్ ఈ విన్యాసం ఎన్నాళ్ళు చేయగలరో చూడాలి. అందుకే, స్టాలిన్ తర్వాత దీర్ఘకాలం రష్యాను ఏలుతున్న పుతిన్ ఓ అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త అన్నట్టు ఒక రకంగా 'బలహీన బలిష్ఠుడు'. వాగ్నర్ వ్యవహారం అందుకు తాజా ఉదాహరణ. పామును పెంచుతున్నది పగవాణ్ణి కాటేయడానికని భావించినా విషపురుగుకు తన, పర తేడా ఉండదని మర్చిపోవడమే చిక్కు. ఆ సంగతి అమెరికా, పాకిస్తాన్ నుంచి ఇప్పుడు రష్యా దాకా అందరికీ అనుభవంలోకి వచ్చిన పాఠమే!

వైద్య విద్య ప్రక్షాళన అత్యవసరం

విశ్లేషణ



రాకేశ్ కోచర్

ప్రస్తుతం ఒక ఎంబీబీఎస్ విద్యార్థికి ప్రాక్టికల్ అంశాలపై అవగాహన నాస్తి. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరడమెలా అన్నదానిపైనే విద్యార్థి దృష్టి కేంద్రీకృతమై ఉంటోంది. కానీ ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే పీజీ సీట్లు మూడొంతుల వరకూ తక్కువ. అయినా అత్యధికులు పీజీ కోసం పోటీపడుతూంటారు. సహజ సామర్థ్యం, అభిరుచులకు అనుగుణంగా పీజీ కోర్సులను ఎంచుకునే సౌలభ్యం వారికి ఉండాలి. దానికోసం ప్రాంతీయ, దేశ అవసరాలకు తగ్గట్టుగా పీజీ సీట్ల సంఖ్యలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించుకోవాలి. దేశంలో వైద్యవిద్య ఎదుర్కొంటున్న ఇంకో సవాలు, నాణ్యత! వైద్య విద్య బోధనాంశాలను సమీక్షించి, మార్పులు చేయాల్సిన అవసరముంది. ఈ మార్పుల్లో ప్రాక్టికల్ అంశాలపై శ్రద్ధ పెట్టడం ఒకటి.

ఇటీవల వార్తా పత్రికల్లో ప్రచురితమైన రెండు వార్తలు పరస్పర విరుద్ధంగా కనిపించాయి. ఒకటేమో ప్రభుత్వం యాభై కొత్త వైద్య కళాశాలలకు అనుమతిచ్చిందన్నది. ఈ రెండు కాలేజీల చేరికతో దేశంలోని మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1,07,000కు చేరుకుంటుంది. రెండో వార్త ఏమిటంటే, దేశం మొత్తమ్మీద కనీసం 38 వైద్యకళాశాలు తమ గుర్తింపును కొనసాగించేందుకు అవసరమైన ప్రమాణాలను పాటించడం లేదన్నది! ఇంకో వంద కాలేజీలూ ఇదే స్థితిలో ఉన్నట్లు ఈ వార్త చెబుతోంది. నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాలను ఇవి పాటించడం లేదన్నది ఆరోపణ. సిబ్బంది బయోమెట్రిక్ పద్ధతుల్లో అటెండెన్స్ ఇవ్వాలన్న అంశంతోపాటు మరికొన్ని ఉల్లంఘనల కారణంగా వీటి గుర్తింపు రద్దయ్యే పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. బహుశా ఈ సమస్య కళాశాలల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వల్ల ఉత్పన్నమై ఉండవచ్చు. లేదా, సిబ్బంది ఒక చోట కాకుండా, మరిన్ని కళాశాలల్లో బోధనకు అంగీకరించి ఉండటమూ కావచ్చు.

దేశంలో ప్రస్తుతం ఉన్న వైద్యులు ఎంతమంది? 2002 జూన్ నెలలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి పార్లమెంటుకు ఇచ్చిన సమాధానం ప్రకారం 13,08,009 మంది అల్లోపతి వైద్యులు ఉన్నారు. వీరిలో పదవీ విరమణ చేసినవారు, మరణించిన వారు లేదా ఇతర దేశాలకు వలస వెళ్లినవారు ఉజ్జాయింపుగా 20 శాతం మంది ఉన్నారని అనుకున్నా ప్రస్తుతం పది లక్షలకుపైగా వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తేలుతుంది. ఆయుష్ వైద్యులు 5.75 లక్షల మందిని కూడా చేర్చితే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉన్నట్లు అవుతుంది.

2014లో దేశంలోని మొత్తం వైద్య కళాశాలలు 387 కాగా, ఇప్పుడు ఆ సంఖ్య 695కి చేరింది. మరో 75 జిల్లా ఆసుపత్రులను వైద్యకళాశాలలుగా మార్చేందుకు ఇటీవలే ప్రభుత్వం ప్రతిపాదించింది. వీటిల్లో కొన్నింటిని ఇప్పటికే మార్చేశారు కూడా. జిల్లా ఆసుపత్రి కానీ, ఈఎస్ఐ ఆసుపత్రి కానీ రాత్రికి రాత్రి వైద్య కళాశాలగా మారిపోదు. ఇందుకు శిక్షణ పొందిన సిబ్బంది, మౌలిక సదుపాయాల కూర్పు వంటి అనేక మార్పులు, చేర్పులు అవసరమవుతాయి.

దేశంలో ఇప్పటిమాదిరిగానే రాన్నున ఐదు, ఏడేళ్లలో ఏటా ఒక లక్ష మంది కొత్త ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులోకి వస్తారని అనుకుందాం. అప్పటికి దేశ జనాభా సుమారు 150 కోట్లకు చేరుకుంటుంది. వైద్యుల సంఖ్య కూడా 15 లక్షల వరకూ ఉంటుంది. కాబట్టి ప్రతి వెయ్యి మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉంటాడు. ఈ దశలోనే పరిస్థితులు ఆసక్తికరంగా మారతాయి. ఏటా ఎంతమంది వైద్యులు అవసరం? వారందరితో సమర్థంగా పనిచేయించుకోగల పరిస్థితులు ఉన్నాయా?



ప్రస్తుతం ఒక ఎంబీబీఎస్ విద్యార్థికి ప్రాక్టికల్ అంశాలపై అవగాహన నాస్తి. ఎందుకంటే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరడమెలా అన్నదానిపైనే విద్యార్థి దృష్టి కేంద్రీకృతమై ఉంటోంది. కానీ ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే పీజీ సీట్లు మూడొంతుల వరకూ తక్కువ. అయినా ఎంబీబీఎస్ చదివిన వారిలో అత్యధికులు పీజీ కోసం పోటీపడుతూంటారు. పడాలి కూడా. సహజ సామర్థ్యం, అభిరుచులకు అనుగుణంగా పీజీ కోర్సులను ఎంచుకునే సౌలభ్యమూ వారికి ఉండాలి. ప్రాంతీయ, దేశ అవసరాలకు తగ్గట్టుగా పీజీ సీట్ల సంఖ్యలో మార్పులు చేర్పులు చేసుకునే వెసులుబాటు కల్పించుకోవాలి. ఉదాహరణకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు ఫ్యామిలీ మెడిసిన్‌లో పీజీ చేసిన వారిని ఎంపిక చేయవచ్చు. బోధన, పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్నవారిని వైద్య కళాశాలలకు ఉపాధ్యాయులుగా శిక్షణ అందించాలి.

ఆరోగ్య రంగంలో నగర, గ్రామీణ ప్రాంతాల మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. మూడింట రెండొంతుల జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నా, అక్కడ పనిచేస్తున్న వైద్యులు మొత్తం వైద్యుల్లో 30 శాతాన్ని కూడా చేరడం లేదు. గ్రామీణ ఆరోగ్య రంగ గణాంకాల ప్రకారం 2021– 22లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులు, సిబ్బంది కొరత యాభై శాతం కంటే ఎక్కువే! అంతేకాదు... రాష్ట్రాల వారీగా చూసినా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పంపిణీలో తేడా ఉంది. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవా, ఢిల్లీలతో పోల్చితే... జార్ఖండ్, యూపీ, బిహార్ రాష్ట్రాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఇంకో ఆసక్తికరమైన అంశం... కర్ణాటకలోని మొత్తం వైద్యుల్లో 40 శాతం రాజధాని బెంగళూరులోనే ఉండటం! ఫలితంగా అనేక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ఇప్పటికీ దూరంగానే ఉంటోంది.

కేంద్ర ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్లను పెంచాలన్న విధాన నిర్ణయం తీసుకోవటం అసలు లక్ష్యమేమిటి? నగరాల్లో తగినంత మంది వైద్యులు అందుబాటులోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంత అవసరాలను తీర్చడమా? మౌలిక సదుపాయాలు లేకపోవడం అనే కారణంతో చాలామంది వైద్యులు పల్లె ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడరు. పల్లెల్లో పనిచేస్తే పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి లేదన్న భావన కూడా కొంతమంది వైద్యుల్లో, మరీ ముఖ్యంగా ప్రైవేట్ కాలేజీల్లో చదివిన వారిలో ఉంటుంది.

దేశంలో వైద్యవిద్య ఎదుర్కొంటున్న ఇంకో సవాలు, నాణ్యత! వైద్య విద్య బోధనాంశాలను అప్పుడప్పుడు సమీక్షించి, మార్పులు చేయాల్సిన అవసరముంది. ఈ మార్పుల్లో ప్రాక్టికల్ అంశాలపై శ్రద్ధ పెట్టడం ఒకటి. కొత్త కాలేజీలు ఏర్పాటవుతున్నంత వేగంగా మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. చాలా రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషలిస్టుల పోస్టులకు దరఖాస్తులే రాకపోవడం దీనికి ఒక ఉదాహరణ! తగిన మౌలిక సదుపాయాలు, పరికరాలు, పనిచేసుకునేందుకు తగినంత స్వేచ్ఛ ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మాత్రం ఈ పరిస్థితి లేదు.

ఎంబీబీఎస్‌లోకి ప్రవేశాలను నియంత్రించేందుకు 'నీట్' ద్వారా గట్టి ప్రయత్నమే జరిగింది. అయితే సగం కాలేజీలు ప్రైవేట్‌వి కావడం, అక్కడి విద్యార్థుల ర్యాంకులు అతి తక్కువగా ఉండటం వల్ల దేశంలోని విద్యా ప్రమాణాల్లో సమానత లేదని తెలుస్తుంది! టెలి మెడిసిన్ టెక్నాలజీ ద్వారా దేశం మొత్తమ్మీద ఒకే రకమైన వైద్య విద్యను ఎందుకు అందించలేకపోతున్నామన్నది ప్రశ్న!

ఏతావతా... దేశంలో వైద్యవిద్యను సమూలంగా మార్చాల్సిన అవసరముంది. 1910లో ఫ్లెక్స్‌నర్ నివేదిక తరువాత అమెరికాలో జరిగిన మార్పుల మాదిరిగా అన్నమాట. అప్పట్లో బోధనాంశాలు మొత్తాన్ని రివైజ్ చేశారు. కాలేజీల సంఖ్యను 155 నుంచి తగ్గించారు. ప్రతి అంశానికి సంబంధించిన కనీస ప్రమాణాలు, శిక్షణ, అవధులను నిర్ణయించారు. తరువాతి కాలంలో కెనడా, యూరప్‌లలోనూ ఇదే పద్ధతిని అనుసరించడం గమనార్హం.

భారత్‌లో వైద్య కళాశాలల సంఖ్యను హేతుబద్ధీకరించాల్సిన అవసరముంది. భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టులు, సూపర్ స్పెషలిస్టులను సిద్ధం చేసుకోవాలి. ఉదాహరణకు 2025లో మనకు చిన్న పిల్లల వైద్యులు, కంటి వైద్యుల అవసరం ఎక్కువ అనుకుందాం. అదే సమయంలో ఐదేళ్ల తరువాత న్యూరోసర్జన్లు, ఫిజీషియన్ల అవసరం ఉందని అనుకుంటే... అందుకు తగ్గట్టుగా పీజీ కోర్సులు, సీట్ల సంఖ్యలో హెచ్చుతగ్గులు చేసుకోవాలి.

వ్యాసకర్త ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ మాజీ అధ్యక్షులు

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకు ఉన్నట్లు?



లెఫ్టినెంట్ గవర్నర్ రాజీనామా చేయాలి. ఢిల్లీకి ప్రజలకు భద్రతను, రక్షణ కల్పించగలిగిన మరొక వ్యక్తికి మార్గం ఏర్పరచాలి. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని సురక్షితంగా ఉంచలేకపోతే ఆ పనిని మాకు అప్పగించమనండి. నగరాన్ని, నగర పౌరులను ఎలా భద్రంగా ఉంచవచ్చో మేం చేసి చూపుతాం.

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి


వృథా పని



కారణం ఏదైనా, జనానికి ఈ రోజుల్లో దేవుడు అనే భావన సమస్యాత్మకం అవుతోంది. అందువల్ల ఏర్పడే ఆధ్యాత్మిక శూన్యతను వాళ్లు 'ధ్యానం', 'నిర్నిమిత్తం' అనే మాటలతో పూరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కళ్ల ముందర చక్రం తిరుగుతూ కనిపిస్తున్నప్పుడు దానిని కొత్తగా కనిపెట్టడం ఎందుకంటాను!

– షీలా నజీరియన్, టీవీ పర్సనాలిటీ

ఇదేం ప్రశ్న!



మణిపూర్ సంక్షోభాన్ని ప్రధాని ఎప్పటికప్పుడు విదేశాల నుంచే సమీక్షిస్తున్నారని హోమ్‌శాఖ చెబుతూ ఉండగా... వారం రోజుల విదేశీ పర్యటన అనంతరం ఢిల్లీ చేరుకోగానే మోదీ, 'ఇండియాలో ఏం జరుగుతోంది?' అని జె.పి. నడ్డాను అడగడం విడ్డూరంగా ఉంది! మణిపూర్‌పై తన 55 రోజుల మౌనాన్ని ప్రధాని ఇకనైనా వీడుతారా?

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ నాయకుడు

నిశ్చయమే జయం



ఈరోజు నేను నా కాళ్లపై నిలబడటానికి కారణం నా తల్లిదండ్రులను డబ్బు అడగకూడదని నిశ్చయించుకోవడమే. ఈ రోజు నేను నాలుగు రాళ్లు సంపాదిస్తున్నానంటే కారణం నాకు ఇష్టమైన పనిని నేను వృత్తిగా ఎంపిక చేసుకోవడమే. ఎదగడం అన్నది మన ఎంపికను బట్టే ఉంటుంది.

– సహేలీ ఛటర్జీ, యువ ఎడ్యుప్రెన్యూర్

వీళ్లా చెప్పేది!



నైతికంగా మృతి చెందిన సమాజంలో 'జాంబీ'లు (బతికి లేచిన శవాలు) జీవించి ఉన్నవారికి ఎలా జీవించాలో బోధిస్తాయి. అవినీతిలో కూరుకుపోయిన కొందరు మనుషులు... వైద్యులకు నైతికతను బోధిస్తుంటే నాకు ఆ జాంబీలే గుర్తుకొస్తున్నాయి.

– శివమ్ పాండ్యా, క్యాన్సర్ స్పెషలిస్ట్

మనకాలపు పెను సంచలనం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

తన కలల్ని వెంటాడుతూ దక్షిణాఫ్రికా నుంచి కెనడాకూ, అక్కడినుంచి అమెరికాకూ వచ్చాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్, దిన పత్రిక– ఏదిచూసినా వార్త రూపంలో దర్శనమిస్తాడు. 'సొంతిల్లు' లేకున్నా 2050 నాటికి ఏకంగా అంగారకుడిపైనే కాలనీలు కడతానని ఊరిస్తాడు. ఎవరు అవునన్నా కాదన్నా వర్తమాన యుగంలో విస్మరించలేని పెను సంచలనం ఎలాన్ మస్క్!

స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీలకు సీఈఓ, బోరింగ్ కంపెనీ సంస్థాపకుడు, ఇప్పుడు సంచలనం రేపుతున్న ఛాట్‌జీపీటీకి బీజం వేసిన భాగస్వాముల్లో మొన్నటివరకూ ఒకడు, మనుషుల ఆలోచనల్ని నియంత్రించే 'న్యూరాలింక్' ప్రాజెక్టు అధినేత, ఇప్పుడు ఎంతో సాధారణ విషయంగా మారిన ఆన్‌లైన్ బ్యాంకింగుకు 1999లోనే తన ఎక్స్‌డాట్ కామ్ ద్వారా అంకురార్పణ చేసినవాడు... ఇలా ఏ కొత్త సాంకేతికత పురుడు పోసుకున్నా అక్కడ మస్క్ ఉంటాడు. అందుకే అతన్ని 'ఇన్నో వేషన్ గురూ' అని ముద్దుగా పిలుస్తారు. ఎక్స్‌డాట్‌కామ్ 'పే పాల్'గా మారడం, అందులో 25 కోట్ల డాలర్లు సంపాదించటం మస్క్ సాధించిన వ్యాపార విజయం.

ల్యాప్‌టాప్‌ను పనిచేయించే లిథియం బ్యాటరీతో కారు కూడా నడపొచ్చని అతను తొలిసారి ప్రకటించినప్పుడు ప్రపంచం నమ్మలేదు. బడా కార్ల కంపెనీలనుకునేవన్నీ ఎగతాళి చేశాయి. కానీ 'టెస్లా' కారు రోడ్డుపైకి వచ్చేసరికి నోరెళ్లబెట్టాయి. పదేళ్లు గడిచిందో లేదో అన్ని బ్రాండ్ల ఎలక్ట్రిక్ కార్లు ఇప్పుడు పరుగులు పెడుతున్నాయి. పర్యావరణ పరిరక్షణకు అతనో రూట్ మ్యాప్ ఇచ్చాడు. వాహనాల తీరుతెన్నులను మార్చాడు గనుకే అతని టెస్లా సంస్థ ప్రఖ్యాత టొయోటా కార్ల కంపెనీ కంటే మూడు రెట్లు పెద్దదిగా ఆవిర్భవించింది.

మస్క్ గురించి ఆసక్తికర కథనం చెప్పాలి. నాసా వెబ్‌సైట్‌లోకి పోయి వాళ్లకు సమీప భవిష్యత్తులో అంగారకుడిపైకి వెళ్లే ఆలోచన లేదని తెలుసుకుని నేరుగా రష్యా వెళ్లి ఒక రాకెట్ బేరమాడాడు. అంగారకుడిపైకి తానే రాకెట్ ప్రయోగించడం అతని లక్ష్యం. వాళ్లు చెప్పిన రేటు గిట్టుబాటు కాకపోవడంతో తానే సొంతంగా రాకెట్‌ను ఎందుకు తయారుచేయరాదన్న పట్టుదల పెరిగింది. కొన్నాళ్లు స్పేస్ ఇంజనీరింగ్ బుక్స్ తిరగేసి రాకెట్ అంతు చూశాడు. దాని తయారీలోని ప్రతి అంశాన్నీ పట్టుకున్నాడు. ఆ రకంగా 'స్పేస్ ఎక్స్' ఆవిర్భవించింది. పునర్వినియోగ రాకెట్‌ను ప్రయోగించి, విజయవంతంగా భూమ్మీదకు తీసు కొచ్చాక మస్క్‌పై నమ్మకం పెరిగింది. ప్రైవేటు రంగంలో 'స్పేస్‌ఎక్స్' తిరుగులేని పెద్ద సంస్థ. 2008లో వచ్చిన 'ఐరన్ మ్యాన్' చిత్రానికి అతడే స్ఫూర్తి. బోరింగ్, హైపర్‌లూప్ సంస్థలు మస్క్ ముందుచూపును తెలియజేస్తాయి. నగరాల దిగువన టన్నెల్స్ తవ్వి వాటిలో వాహనాలు దూసుకుపోయేలా చేయడం, వ్యాక్యూమ్‌తో ఉండే హైపర్ లూప్‌లో హైస్పీడ్ రైళ్లను పరుగులు పెట్టించడం మస్క్ ధ్యేయాలు.



ఎలాన్ మస్క్

1971 జూన్ 28న దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియాలో జన్మించిన మస్క్ బాల్యం ఏమంత మధురమైనది కాదు. తొమ్మిదేళ్లున్నప్పుడే అమ్మా నాన్న విడిపోయారు. అయితే ఫిజిక్స్ మీద తనకు ఇంత ఆసక్తి కలగజేసింది మాత్రం తండ్రేనంటాడు. పన్నెండేళ్ల ప్రాయంలో ఎంతో పోరుపెట్టి తండ్రితో కొనిపించుకున్న కమొడోర్ వీఐసీ–20 కంప్యూటర్ ఎంత మొరాయిస్తున్నా దానిపైనే అద్భుతాలు సాధించిన చరిత్ర అతడిది. ఆ కంప్యూటర్ మాన్యువల్ ప్రకారం ఆర్నెల్లు పట్టే ప్రాథమిక అంశాలను, మూడంటే మూడు రోజుల్లో పూర్తి చేయడమే కాదు... దాంట్లోనే ఒక కొత్త కంప్యూటర్ గేమును తయారు చేశాడు. దాని సోర్స్ కోడ్ అమ్మి 500 డాలర్లు తెచ్చుకున్నాడు. అదే అతడి తొలి సంపాదన. దక్షిణాఫ్రికాలో స్కూల్ ఫైనల్ ముగిశాక ఒంటరిగా కెనడా వెళ్లాడు. గ్రాడ్యుయేషన్ అయ్యాక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సాధించినా రెండంటే రెండే రోజులు హాజరై మనసు మార్చుకున్నాడు. వ్యాపారమే తన భవిష్యత్తుగా భావించాడు. తన సోదరుడితో(కింబల్ మస్క్) కలిసి జిప్2 రూపొందించాడు. మనం ఇప్పుడు చూసే గూగుల్ మ్యాపులకు అది తొలి రూపం. దాన్ని 31 కోట్ల డాలర్లకు అమ్మి ఆశ్చర్యపర్చాడు.

మస్క్‌కు పని రాక్షసుడన్న పేరుంది. బోర్డ్ రూమ్ ఎత్తుగడల్లో అతన్ని మించినవాడు లేడు. టెస్లా సంస్థ స్థాపించి, తనను భాగస్వామిగా ఆహ్వానించిన మార్టిన్ ఎబెర్‌హార్డ్‌ను కంపెనీ నుంచే సాగనంపి 2008లో దాన్ని చేజిక్కించుకున్న కపటి అని మస్క్‌ను తిడతారు. ఇక ట్విటర్ మస్క్ చేతుల్లో పడ్డాక ఎలా విలవిల్లాడుతున్నదో తెలిసిందే. ట్విట్టర్ ఎదుగుదలలో చెమటోడ్చిన వేలాది మందిని ఇంటికి పంపాడు. వింత వింత నిర్ణయాలతో అందరినీ ఏడిపించాడు. అయితే రెండు మూడు తరాల ముందుచూపుతో ఆలోచించగలిగే సృజనాత్మకత, దాన్ని సాకారం చేసుకోవడానికి కావలసిన మొండి ధైర్యం ఉన్న ప్రజ్ఞాశీలి అనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

ఉమ్మడి పౌరస్మృతితోనే సమన్యాయం

అభిప్రాయం



పానక జనార్దన్ రెడ్డి

ఉమ్మడి పౌరస్మృతి గురించి భారత న్యాయ కమిషన్ వారు జూన్ 14, 2023న ఒక బహిరంగ ప్రకటన జారీచేసి... భారత పౌరులు, మత సంస్థల నుండి తమ అభిప్రాయాలు, సూచనలు, సంప్రదింపుల కోసం 30 రోజుల సమయం నిర్దేశించారు. మత ప్రస్తావన లేని వ్యక్తిగత పౌర చట్టాలు భావితరానికి అందించాలనే దృఢ సంకల్పమే పై నిర్ణయానికి కారణం.

భారత పార్లమెంట్‌లో ఉమ్మడి పౌరస్మృతి గురించి ఏనాడో చర్చించడం జరిగింది. ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక దశలో వ్యతిరేకించినా, న్యాయశాఖ మంత్రి బీఆర్ అంబేడ్కర్ మాత్రం సమర్థించారు. అయినప్పటికీ ఇది అమలులోకి రాలేదు. ఈ కారణంగానే హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, మైనారిటీ మరియు గార్డియన్‌షిప్ చట్టం, దత్తత చట్టం, మనోవర్తి చట్టాలు మాత్రమే అమల్లోకి వచ్చాయి. అంటే హిందువులకే వ్యక్తిగత చట్టాల క్రోడీకరణ జరిగింది.

కేంద్రంలోని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తమ 2019 మేనిఫెస్టోలో ఉమ్మడి పౌరస్మృతిని చేర్చింది. దీనికోసం భారత న్యాయ కమిషన్ విస్తృత ప్రచారం ద్వారా 75,000 పైచిలుకు భారత పౌరుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. దీనిమూలంగా నవంబర్ 2019, మార్చి 2020 రెండుసార్లు ఉమ్మడి పౌరస్మృతి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమ, ఇది తొందరపాటు నిర్ణయం అని ఆర్ఎస్ఎస్ ప్రకటించడం వల్ల ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకుంది.

చాలామందికి అవగాహన లేని విషయం ఏమిటంటే, ఉమ్మడి పౌరస్మృతి వర్తించే పౌర చట్టాలు ఆరు మాత్రమే. అవి: వివాహ చట్టం, విడాకుల చట్టం, మనోవర్తి చట్టం, వారసత్వ చట్టం, దత్తత చట్టం, ఆస్తిహక్కు వారసత్వ చట్టం. ఇప్పుడున్న పౌర చట్టాలు దేశాభివృద్ధికి నిరోధకంగా ఉన్నాయనీ, పౌరులందరికీ సమాన హక్కులు లేవనీ, కొన్ని మతాలలో స్త్రీలు అణచివేతకు గురవుతున్నారనీ అత్యున్నత న్యాయస్థానం ట్రిపుల్ తలాక్ కేసులో వ్యాఖ్యానించింది. 1985 నాటి షాబానో కేసులో అత్యున్నత న్యాయస్థానం మనోవర్తి కోసం ముస్లిం చట్టాలను పక్కనపెట్టి సెక్షన్ 125–128 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను ముస్లిం మహిళలకు వర్తింపజేసింది. ముస్లింలకు షరియత్ బోర్డు అనే ఒక ప్రైవేటు సంస్థ దశ, దిశ నిర్దేశించడాన్ని తీవ్రంగా పరిగణించింది.



భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21 ద్వారా అందరికీ సమాన అవకాశాలు ఉండాలనేది ప్రాథమిక హక్కుగా నిర్దేశించారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలైన ఆర్టికల్ 44 పార్ట్ 4 ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తీసుకురావాలని నిర్దేశించింది. కానీ ఆర్టికల్ 37 ప్రకారం ఆదేశిక సూత్రాల అమలు కోర్టుల ద్వారా కుదరదు. ఏమైనప్పటికీ ఉమ్మడి పౌరస్మృతి జాప్యానికి కారణాన్ని రాజకీయ కోణంగానే చూడాలి. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకు కోసం దీన్ని తెరపైకి తీసుకురావటం, వెంటనే వెనక్కి తీసుకోవటం జరుగుతోంది. ప్రతి రాజకీయ పార్టీలోనూ అంతర్గతంగా సమర్థించడం, విభేదించడం రెండూ జరుగుతున్నాయి. దీనికి ఉదాహరణ, ఆర్ఎస్ఎస్ దీన్ని తొందరపాటు చర్యగా అభివర్ణించడమే!

ఉమ్మడి పౌరస్మృతి పైన ఉన్న ప్రధాన అపోహ, ప్రభుత్వాలు వ్యక్తిగత మత స్వేచ్ఛను హరిస్తాయని! భిన్న సంస్కృతులు కలిగిన భారత దేశంలో అమలు కష్టసాధ్యమవుతుందని! 1961లో పోర్చుగీస్ దేశం నుండి విడిపడిన గోవా రాష్ట్రం ఇప్పటికే ఉమ్మడి పౌరస్మృతిని అమలుచేస్తోంది. అక్కడ మతస్వేచ్ఛకు భంగం కలిగినట్లు ఒక్క ఉదాహరణ కూడా కనిపించదు. ఉమ్మడి పౌరస్మృతి వల్ల ప్రత్యామ్నాయ న్యాయ ప్రక్రియకు స్వస్తి పలకవచ్చు. స్త్రీలపై మతపరమైన అణచివేత, అసమానతలను తొలగించవచ్చు. ఓటుబ్యాంకు రాజకీయాలు లేకుండా పోతాయి. కోర్టుల్లో పౌరులందరికీ ఒకే విధమైన తీర్పులతో సమన్యాయం అమలవుతుంది. మన దేశాన్ని సెక్యులర్ దేశంగా రాజ్యాంగపరంగా ప్రకటించడం వల్ల మత స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లదు. దీన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లో పొందుపరిచారు. అదేవిధంగా కొన్ని తెగలకు, అణగారిన వర్గాలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులు కాపాడబడతాయి. ఈ కారణాల వల్ల ఉమ్మడి పౌరస్మృతి భారతదేశానికి చారిత్రక అవసరం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ మహా ప్రశాసకుడు
మొబైల్: 83094 09689

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: శు.నవమి రా.10.24 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: హస్త ఉ.11.12వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: రా.7.34 నుండి 9.15 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.06 నుండి 8.58 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు, అమృతఘడియలు: తె.5.40 నుండి 7.22 వరకు (తెల్లవారితే బుధవారం): రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 5.31, సూర్యాస్తమయం: 6.34.

మందకొడిగా పంటల సాగు!

- రాష్ట్రంలో ఇప్పటివరకు 11.36 లక్షల ఎకరాల్లో సాగు
- ఇందులో ఉద్యాన పంటలు 7.18 లక్షలు.. ఆహార, వాణిజ్య పంటలు 4.18 లక్షలు
- రుతుపవనాల ఆలస్యమే కారణమని వ్యవసాయ శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం సీజన్ పంటల సాగు మొదలైంది. అయితే రుతు పవనాలు ఆలస్యం కావడంతో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఆహార, ఉద్యాన పంటలన్నీ కలిపి ఇప్పటివరకు 11.36 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కాగా, 7.18 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు కాగా, ఆహార, ఇతర పంటల సాగు విస్తీర్ణం 4.18 లక్షల ఎకరాలుగా నమోదైంది. సాగైన పంటల్లో అత్యధికంగా 3.24 లక్షల ఎకరాల్లో పత్తిని వేశారు. 32,070 ఎకరాల్లో పప్పు ధాన్యాల పంటలు సాగయ్యాయి. వీటిల్లోనూ 29,056 ఎకరాల్లో కంది సాగైంది. 16,408 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 8,840 ఎకరాల్లో సోయాబీన్, 7,525 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని వ్యవసాయ శాఖ నివేదిక వెల్లడించింది. ఇక ఉద్యాన పంటల్లో అన్ని రకాల పండ్ల సాగు 4.37 లక్షల ఎకరాల్లో నమోదైంది. ఆయిల్‌పాం 1.54 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ప్రస్తుతం రుతుపవనాలు విస్తరించడంతో పనులు ఇక్కపై జోరందుకుంటాయని భావిస్తున్నారు. ప్రధానంగా పత్తి సాగుపై రైతులు దృష్టిసారించారు. మరోవైపు వరి నార్లు కూడా వేస్తున్నారు. అనేకచోట్ల రైతులు పత్తి విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. పత్తి విత్తనాలు అందుబాటులోనే ఉన్నా, వారు కోరుకున్న వెరైటీలు లేవంటున్నారు. దీంతో పలుచోట్ల కొన్ని రకాల పత్తి విత్తనాలకు డిమాండ్ ఏర్పడటంతో కొందరు రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. రైతుల అవసరాలను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని చెపుతున్నారు. మరోవైపు నిషేధిత బీజీ-3 పత్తి విత్తనాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడికక్కడ దాడులు జరుగుతున్నా, దళారులు రైతులకు ఈ విత్తనాలను అంటగడుతున్నారని తెలుస్తోంది.



కొమురంభీం జిల్లాలో అధికంగా..

రాష్ట్రవ్యాప్తంగా 4.18 లక్షల ఎకరాల్లో ఆహార, ఇతర పంటలు సాగు కాగా, అందులో అత్యధికంగా కొమురంభీం జిల్లాలో 95,696 ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ నివేదిక వెల్లడించింది. ఆ తర్వాత నారాయణపేట జిల్లాలో 81,380 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 38,770 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 28,671 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 24,032 ఎకరాలు, గద్వాలలో 23,244 ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 23,025 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కాగా, కొమురంభీం జిల్లాలో పత్తి సాగు కూడా అధికంగా నమోదైంది. ఈ జిల్లాలో 84,430 ఎకరాల్లో పత్తి వేశారు. అలాగే నారాయణపేట జిల్లాలో 67,440 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 33,923 ఎకరాల్లో పత్తి వేశారు. కాగా, పంటల సాగు గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ప్రస్తుతం మూడో వంతుకే పరిమితమైంది. గతేడాది జూన్ 22వ తేదీ నాటికి 11.30 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు సాగు కాగా, ఇప్పుడు 4.18 లక్షల ఎకరాలకే పరిమితమైంది. ఇదిలా ఉండగా.. ఎరువులను సకాలంలో అందజేసేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఆగ్రోస్ ఎండీ కె.రాములు సోమవారం రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని సందర్శించారు. సకాలంలో యూరియా సరఫరా చేసేందుకే అక్కడకు వెళ్లినట్లు ఆయన వెల్లడించారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని ఆయన తెలిపారు. అవసరానికి మించి రాష్ట్రవ్యాప్తంగా ఎరువులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

క్లుప్తంగా...

తొలిరోజు రైతుబంధు రూ. 642.52 కోట్లు

- 22.55 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అయింది. తొలిరోజు.. ఎకరాలోపున్న రైతులకు రూ. 642.52 కోట్లు జమ చేశారు. మొత్తం 22,55,081 మంది రైతుల ఖాతాల్లో సొమ్మును జమ చేశామని, ఎకరాల వారీగా ప్రతి రోజు రైతుల ఖాతాల్లో నిధులు పడతాయని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. సీఎం కేసీఆర్ చెప్పిన విధంగా రైతుబంధు నిధుల జమ ప్రారంభమైందన్నారు. రైతుబంధు నిధులు జమ చేసిన సీఎం కేసీఆర్‌కు, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం 2 ఎకరాలున్నవారికి, మూడో రోజు 3 ఎకరాలున్నవారికి.. ఇలా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో మరిన్ని పౌరసేవలు: పువ్వాడ




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులతో మాట్లాడారు. బ్రోకర్ల ప్రమేయం లేకుండా నేరుగా తాము ఆర్టీఏ అధికారులను సంప్రదిస్తున్నట్లు పలువురు మంత్రికి చెప్పారు. గతంలో స్మార్ట్ కార్డుల కొరత కారణంగా వాహనదారులకు సకాలంలో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు అందజేయలేని పరిస్థితి ఉండేదన్నారు. కార్డులు, ప్రింటర్ల కొరతను తీర్చేందుకు అన్ని చర్యలు చేపట్టామని, దీంతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో వాహనదారులకు సకాలంలో స్మార్ట్‌కార్డులు అందుతున్నాయని మంత్రి చెప్పారు. కాగా, సాధారణ పర్యటనలో భాగంగానే ఆర్టీఏ సేవల అమలు తీరును తనిఖీ చేసేందుకు వచ్చినట్లు పువ్వాడ వెల్లడించారు. ప్రస్తుతం 19 రకాల పౌరసేవలు ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తేనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోహత్య నిషేధ చట్టాలు కఠినంగా అమలు చేయాలి

డీజీపీని కోరిన వీహెచ్‌పీ నేతలు

సాక్షి, హైదరాబాద్: గోహత్య నిషేధ చట్టాలు కఠినంగా అమలు చేయాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) డిమాండ్ చేసింది. ఇష్టారాజ్యంగా వధించేందుకు గోవులను తరలిస్తున్నారని వీహెచ్‌పీ ఆందోళన వ్యక్తం చేసింది. సోమవారం సాయంత్రం రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్‌ను వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి భానుప్రకాశ్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ ప్రముఖ్ శివ రాములు, న్యాయవిభాగం ప్రముఖ్ శివ ప్రసాద్ కలిసి వినతిపత్రం సమర్పించారు. చట్ట విరుద్ధంగా గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గోరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నా కూడా వాటిని అమలు చేయ కపోవడం దౌర్భాగ్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలను పకడ్బందీగా గోరక్షణ చేయాలని సూచిస్తానని డీజీపీ అంజనీకుమార్ హామీ ఇచ్చారని వీహెచ్‌పీ నేతలు తెలిపారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం



కొత్తకోట రూరల్: రాష్ట్రంలో బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని అల్వాల, చిన్నమందడి, మోజర్ల, మద్దిగట్ల, దొడగుంటపల్లి, పెద్దమందడి, మనిగిళ్ల గ్రామాల్లో 'బహుజన రాజ్యాధికార యాత్ర'కొనసాగింది. పెద్దమందడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల జీవితాలను మార్చే సత్తా తమ పార్టీకే ఉందన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా లింబాద్రి

- మూడేళ్లపాటు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలికి ఇప్పటివరకూ కార్యనిర్వాహక చైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని ప్రభుత్వం పూర్తిస్థాయి హోదాతో మండలి చైర్మన్‌గా నియమించింది. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉన్నత విద్యామండలిని ఏర్పాటు చేయగా, తొలి చైర్మన్‌గా ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి ఉన్నారు. ఏడేళ్లపాటు ఆయన చైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన స్థానంలో 2021 ఆగస్టు 24న లింబాద్రిని అఫిషియేటింగ్ చైర్మన్‌గా నియమించగా, ఇప్పుడు ఆయన్నే పూర్తిస్థాయి చైర్మన్‌గా నియమించారు. ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా చేస్తున్న ఆయన ఈ జూలైలో పదవీవిరమణ పొందనుండగా, తాజాగా ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా పూర్తిస్థాయి చైర్మన్ హోదా లభించింది.

వైస్ చైర్మన్‌గా మహమూద్

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా డాక్టర్ ఎస్‌కే మహమూద్ నియమితులయ్యారు. మూడేళ్ల కాలానికి ఆయన్ను నియమిస్తూ ప్రభుత్వం జీవోను జారీచేసింది. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ చేసిన మహమూద్ ఓయూలో బాటనీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు.

విద్యారంగ అభివృద్ధికి అంకితమవుతా

రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి, తెలంగాణను దేశంలోనే ఉన్నత స్థానంలో నిలబెట్టేందుకు నా వంతుగా కృషిచేస్తా. ఉన్నత విద్యామండలి ఔన్నత్యాన్ని పెంచేందుకు అందరి సహకారంతో ముందుకెళ్తా. జాతీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, విద్యార్థులకు లబ్ధి కలించే కోర్సులను అందుబాటులోకి తెస్తాం. – లింబాద్రి

ఆలయ నగరిపై యాదవ 'మహర్షి'



యాదగిరిగుట్ట: యాదవ 'మహర్షి'కోరిక ఫలితంగా సాక్షాత్కరించిన నారసింహుడు యాదాద్రి కొండపై కొలువై ఉన్నాడు. పంచ రూపాలతో భక్తుడికి శ్రీనరసింహస్వామి పంచ రూపాలతో కనిపించడంతో ఈ క్షేత్రాన్ని పంచనారసింహ నిలయంగా పురాణాలకెక్కింది. అలాంటి పంచ నారసింహ క్షేత్రానికి పరమభక్తుడైన యాదవ మహర్షి తపస్సు చేస్తున్నట్లు కనబరిచే విధంగా ఆలయ నగరి (టెంపుల్ సిటీ)పై కృష్ణశిలతో తయారు చేసిన విగ్రహాన్ని వైటీడీఏ ఏర్పాటు చేసింది. ప్రధానాలయం ముందు యాదవ మహర్షి తపస్సు చేస్తున్నట్లు అద్భుతంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొండకు దిగువన ఏళ్ల కాలం నుంచి మర్రిచెట్టు కింద యాదవ మహర్షి విగ్రహం ఉండటం గమనార్హం.

కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ సహా మరో ఇద్దరికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఆదేశాలంటే లెక్క లేదా... మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తారా.. స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి.. అంటూ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) అధికారులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రవితేజ, అసిస్టెంట్ టౌన్ ప్లానర్ రాజ్‌కుమార్‌లకు ఫారమ్–1 (వ్యక్తిగత హాజరు) నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 11కు వాయిదా వేసింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని కోర్టు ఆదేశించినా జీహెచ్‌ఎంసీ అధికారులు తమ డెక్కన్ కిచెన్‌ను కూల్చివేశారంటూ జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లో డబ్ల్యూ3 హాస్పిటాలిటీ సర్వీసెస్ హైకోర్టులో ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కన్నెగంటి లలిత ఇటీవల విచారణ చేపట్టారు. కోర్టు ఆదేశాలిచ్చినా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుంటే కోర్టులు మౌనం వహించలేవన్నారు.

మరో కేసులోనూ...

భూ సేకరణకు సంబంధించిన మరో కేసులోనూ జీహెచ్‌ఎంసీ కమిషనర్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హైదరాబాద్ కలెక్టర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు ఇచ్చినా తన భూమి విషయంలో అధికారులు జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ జియావుద్దీన్ హుస్సేనీ హైకోర్టులో ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలున్నా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలంటూ విచారణను జూలై 31కి వాయిదా వేసింది.

కోల్డ్‌స్టోరేజీలో సిలిండర్ పేలి..

- ఫ్రూట్ కంపెనీ యజమాని, కూలీ దుర్మరణం
- చెల్లాచెదురైన ఇద్దరి శరీర భాగాలు
- నల్లగొండలో దుర్ఘటన



సాజిద్



పేలుడు ధాటికి ధ్వంసమైన కోల్డ్‌స్టోరేజీ గది

నల్లగొండ క్రైం: నల్లగొండలో న్యూ స్టాక్ ఫ్రూట్ కంపెనీ కోల్డ్ స్టోరేజ్‌లో ఇథిలిన్ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మామిడి, అరటి పండ్లను మాగించేందుకు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో కోల్డ్ స్టోరేజ్‌లో ఇథిలిన్ గ్యాస్ సిలిండర్‌ను స్టోరేజ్ యజమాని షేక్ ఖలీం (42), కూలీ–ఆటోడ్రైవర్ సాజిద్ (40) మారుస్తూ ఏసీలోకి ఎక్కించేందుకు యత్నిస్తుండగా సిలిండర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలింది. పేలుడు ధాటికి ఇద్దరి శరీరర భాగాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. వీరి చేతులు ఇతరుల నివాసాల ముందు పడటంతో స్థానికులు భీతిల్లిపోయారు. అదే సమయంలో కోల్డ్ స్టోరేజ్‌లోనే పనిచేస్తున్న మజీద్, ఉస్మాన్, అశోక్, ప్రవీణ్, హన్సార్‌లకు నోటి మాట రాలేదు. ఈ ఐదుగురు కోల్డ్ స్టోరేజీ గదికి కొద్ది దూరంలో పండ్లను గ్రేడింగ్ చేస్తున్నారు. పరుగున కోల్డ్ స్టోరేజ్ నుంచి బయటికి వచ్చి బిగ్గరగా కేకలు వేయగా స్థానికులు అక్కడికి వచ్చారు.

మోతాదుకు మించి నింపడంతోనేనా..?

మామిడి, అరటి పండ్లను మాగించేందుకు కోల్డ్ స్టోరేజీలో ఇథిలిన్ గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. కార్బైడ్ ద్వారా పండ్లను మాగబెడితే అనారోగ్యానికి గురవుతున్నారని ప్రభుత్వం నిషేధించింది. చల్లదనంతో ఉన్న ఇథిలిన్ గ్యాస్ ద్వారా పండ్లను మాగబెట్టడం ద్వారా ఆరోగ్యంపై ప్రభావం చూపదని ప్రభుత్వం మార్గదర్శకాలిచ్చింది. ఇథిలిన్ గ్యాస్ సిలిండర్‌ను ఐదు రోజులకోసారి స్టోరేజీ విస్తీర్ణాన్ని బట్టి మారుస్తుంటారు. పదేళ్లుగా కోల్డ్‌స్టోరేజ్ నిర్వహిస్తున్న ఖలీం .. సాజిద్‌తో కలిసి ఇథిలిన్ సిలిండర్‌ను ఏసీలోకి ఎక్కించడం, మార్చడం చేస్తుంటారు. సిలిండర్‌ను మారుస్తూ ఇథిలిన్‌ను మోతాదుకు మించి ఏసీలో ఎక్కించడం ద్వారానే పేలుడు సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదస్థలాన్ని ఏఎస్పీ వరప్రసాద్, డీఎస్పీ నర్సింహారెడ్డి, ఏఆర్ఎస్పీ హన్మంతరావు, సీఐ గోపీ పరిశీలించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోడు పట్టాల పంపిణీ ఇదే చివరిసారి: ఇంద్రకరణ్



కైలాస్‌నగర్: పోడు భూములకు పట్టాల పంపిణీకి ఈ నెల 30 నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుడుతున్నామని, రాష్ట్రంలో పోడు భూ పట్టాల పంపిణీ ఇదే చివరిసారి అని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజనులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న పోడు భూముల సమస్యను పరిష్కరించేలా ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పట్టాల పంపిణీ ప్రారంభిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఎకరాలను 1.50 లక్షల మంది గిరిజనులకు పట్టాలు ఇవ్వడంతోపాటు రైతుబంధు వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ ఇదే చివరిదని ఇక్కపై పోడు సాగు చేస్తామంటే కుదరదని, ఫారెస్ట్ నిబంధనలను కఠినతరం చేయనున్నామని స్పష్టం చేశారు. చెట్లను నరకకుండా ఎమ్మెల్యే, ఎంపీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌ల నుంచి సంతకాలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు తమ పరిధిలో ట్రెంచ్‌లను ఏర్పాటు చేస్తారన్నారు. కాగా, రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావును మంత్రి సోమవారం పరామర్శించారు.

భూ తగాదాలతో ఇద్దరి హత్య

- వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో ఇరు కుటుంబాల ఘర్షణ
- మరో నలుగురికి తీవ్ర గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం



బక్కుబాయి



నర్సయ్య

రెబ్బెన (ఆసిఫాబాద్): వారసత్వంగా వచ్చిన భూమి కోసం ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు హత్యకు గురికాగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కుమురం భీం జిల్లా రెబ్బెన మండలం జక్కులపెల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జక్కులపెల్లి గ్రామానికి చెందిన భీమయ్య, నాగయ్య అన్నదమ్ములు. వారి మరణానంతరం వారసుల మధ్య భూతగాదాలు నడుస్తున్నాయి. వారసత్వంగా వచ్చిన సుమారు 9 ఎకరాల భూమిని భీమయ్య వారసులైన మండల బక్కయ్య, దుర్గయ్య, గిరిగుల బక్కుబాయి కాస్తు చేసుకుంటున్నారు. ఈ భూమి విషయంలో బక్కయ్య, దుర్గయ్య, బక్కుబాయికి నాగయ్య వారసులు మల్లేశ్, మెంగయ్యల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే బక్కయ్య, దుర్గయ్య, బక్కుబాయి భూమిని దున్ని ఆదివారం పత్తి విత్తనాలు విత్తారు. ఈ విషయం తెలుసుకున్న మండల మల్లేశ్, మెంగయ్యలు వారి బంధువులతో కలసి సోమవారం చేను వద్దకు వెళ్లారు. అదే సమయంలో బక్కయ్య, బక్కుబాయి భూమి వద్దకు రావడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. కర్రలు, గొడ్డళ్లతో దాడులకు దిగడంతో బక్కయ్య కుమారుడు నర్సయ్య(30), బక్కుబాయి (60) అక్కడికక్కడే మృతిచెందారు. బక్కయ్య, పెంటయ్య, మల్లేశ్, మెంగయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో బక్కయ్య, మెంగయ్యల పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన వారిని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు.

భూమి కబ్జా చేయటానికి వచ్చారంటూ..

- చెప్పులతో తరిమికొట్టిన రైతు కుటుంబం
- ఎమ్మెల్యే చల్లా అనుచరులంటూ ఆరోపణ..



చెప్పులతో దాడి చేస్తున్న మహిళలు

గీసుకొండ: హనుమకొండ జిల్లా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనుచరులు తమ సాగు భూమిని కబ్జా చేయటానికి వచ్చారని ఆరోపిస్తూ వారిని చెప్పులతో కొట్టి తరిమిన వీడియో సోమవారం వాట్సాప్‌లో వైరల్‌గా మారింది. రైతు కుటుంబ సభ్యుల చేతిలో దాడికి గురైన బాధితులు ఈ నెల 24న వరంగల్ జిల్లా గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గీసుకొండ మండలం విశ్వనాథపురం రెవెన్యూ పరిధి దస్రు తండాలోని 773 /1 సర్వే నంబర్‌లో 19 గుంటలు, 774లో 39 గుంటలు మొత్తం 1.8 ఎకరాల భూమిని ఆత్మకూరు మండలం చౌళ్లపల్లికి చెందిన శ్రీనివాస్, గొర్రెకుంటకు చెందిన కలువాల సత్యనారాయణ నుంచి గతంలో కొనుగోలు చేశారు. ఈ నెల 21న శ్రీనివాస్ తన వారితో కలిసి భూమిని దున్ని హద్దురాళ్లు వేసుకుందామని వెళ్లగా దస్రు తండా శివారు పింగ్యా తండా గ్రామానికి చెందిన ఆంగోతు శ్రావణ్, ఆంగోతు స్వామి, వారి తల్లి, భార్యలు అక్రమంగా ప్రవేశించి దున్నుతున్నారు. ఇదేమిటని శ్రీనివాస్ వారిని ప్రశ్నించగా దుర్భాషలాడుతూ చెప్పుతో కొట్టి చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ సట్ల రాజు తెలిపారు. అయితే తమ పూర్వీకుల నుంచి భూమిని సాగు చేసుకుంటున్నామని, తమకు తెలియకుండానే పట్టా చేసుకున్నారని శ్రావణ్, స్వామి ఆరోపించారు. కాగా, ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే ప్రమేయం లేదని, భూమి వద్దకు వచ్చిన వారు ఆయన అనుచరులు కాదని బీఆర్ఎస్ నేతలు తెలిపారు.

- 'మహాత్మా జ్యోతిబా పూలే'తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో వివిధ తరగతుల్లో ప్రవేశాలను కేవలం మెరిట్ ఆధారంగానే కేటాయిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి మల్లయ్యబట్టు స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

గో రక్షకుల మూకదాడిలో ఒకరు మృతి

ముంబై: ఆవు మాంసం తరలిస్తున్నారనే అనుమానంతో ఇద్దరు వ్యక్తులపై గో రక్షకుల మూక దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా గంభీర్‌వాడి వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ముంబైకి చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో మాంసం తీసుకెళ్తుండగా 10 నుంచి 15 మంది వ్యక్తుల గుంపు ఘోటి–సిన్నార్ రోడ్డులో వాహనాన్ని అడ్డుకుని స్టీల్ రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అఫాన్ అన్సారీ(32) చనిపోగా నాసిర్ ఖురేషి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. నాసిక్ జిల్లాలో రెండు వారాల వ్యవధిలో జరిగిన రెండో ఘటన ఇది. ఈ నెల 8న ఆవులను తరలిస్తున్న టెంపోను గోరక్షకులు అడ్డగించి, అందులోని ముగ్గురిపై దాడి చేయగా ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

సీనియర్ మంత్రులతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా, ఈజిప్టుల్లో అధికారిక పర్యటనలను ముగించుకుని వచ్చిన ప్రధాని మోదీ సోమవారం సీనియర్ కేబినెట్ సహచరులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పట్టణ వ్యవహారాలు, పెట్రోలియం శాఖల మంత్రి హర్దీప్ సింగ్ పూరి పాల్గొన్నారు. ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా తదితర సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. విదేశీ పర్యటనలను ముగించుకుని ప్రధాని మోదీ సోమవారం వేకువజామున ఢిల్లీకి చేరుకున్నారు.

రాజ్యసభ ఎంపీ హర్‌ద్వార్ దుబే కన్నుమూత



న్యూఢిల్లీ: ఉత్తర ప్రదేశ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు హర్‌ద్వార్ దుబే (74) కన్ను మూశారు. అనారోగ్యానికి గురైన ఆయన ఈ నెల 12న ఢిల్లీలోని ఫోర్టిస్ ఎస్కార్ట్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. ఆయన సోమవారం ఆస్పత్రిలో కన్నుమూశారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆగ్రా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి ఎన్నికైన దుబే..1991లో కల్యాణ్ సింగ్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. సంఘ్ పరివార్, ఏబీవీపీలతో ఆయనకు దగ్గరి సంబంధాలున్నాయి. దుబే మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం ప్రకటించారు.

వెదురు నుంచి జీవ ఇంధనాలు!



బయో ఇథనాల్, బయో గ్యాస్ తయారీకి అనుకూలం

- 'హంగేరియన్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ లైఫ్ సైన్సెస్' సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి
- పునరుత్పాదక ఇంధన రంగంలో వెదురు ఒక విప్లవమే సృష్టిస్తుందంటున్న పరిశోధకులు


ఆధునిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. సరైన ప్రత్యామ్నాయ ఇంధనాలు విరివిగా అందుబాటులో లేకపోవడంతో పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి వాటిపై అనివార్యంగా ఆధారపడాల్సి వస్తోంది. వీటివల్ల వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని, పర్యావరణానికి, భూగోళంపై మానవళి మనుగడకు ముప్పు ఏర్పడుతోందని తెలిసినప్పటికీ మరో దారిలేక ప్రమాదకరమైన ఇంధనాలపైనే అధికంగా ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు పునరుత్పాదక ఇంధనాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదు. జల విద్యుత్ ఉత్పత్తికి కొన్ని పరిమితులున్నాయి. ఇలాంటి తరుణంలో హంగేరీలోని 'హంగేరియన్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ లైఫ్ సైన్సెస్' పరిశోధకులు తీపి కబురు అందించారు. అడవుల్లో సహజసిద్ధంగా, విస్తృతంగా పెరిగే వెదురు(బ్యాంబూ)తో బయో ఇథనాల్, బయో గ్యాస్ వంటి జీవ ఇంధన ఉత్పత్తులు తయారు చేయవచ్చని తమ అధ్యయనంలో తేల్చారు. సమీప భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధన రంగంలో వెదురు ఒక విప్లవమే సృష్టించబోతోందని చెబుతున్నారు. శిలాజ ఇంధనాలకు కాలుష్యానికి తావులేని ఇలాంటి ఇంధనాలే సరైన ప్రత్యామ్నాయం అవుతాయని అంటున్నారు. ఈ అధ్యయనం వివరాలను 'జీసీబీ బయో ఎనర్జీ' జర్నల్‌లో ప్రచురించారు.

- ఇతర చెట్లతో పోలిస్తే వెదురు చాలా వేగంగా పెరుగుతుంది. ఇదొక విలువైన సహజ వనరు. కాలుష్యాన్ని కట్టడి చేసే విషయంలో వెదురును 'సూపర్ స్పాంజ్'గా పరిగణిస్తుంటారు. కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుంటుంది. వాతావరణంలోకి ప్రాణవాయువు(ఆక్సిజన్)ను అధికంగా విడుదల చేస్తుంది.
- ప్రమాదకరమైన గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని అరికట్టడంలో వెదురు పాత్ర చాలా కీలకం. భూమిపై వాతావరణాన్ని శుద్ధి చేస్తుంది.
- ప్రకృతిలో వెదురు ప్రాధాన్యతను గుర్తించిన పరిశోధకులు దాని నుంచి పునరుత్పాదక ఇంధనాల తయారీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.
- కిణ్వ ప్రక్రియ(ఫెర్మెంటేషన్), అధిక ఉష్ణోగ్రతల వద్ద కుళ్లిపోయేలా చేయడం(పైరోలిసిస్)తోపాటు హైడ్రోథర్మల్ లిక్విఫాక్షన్, అనెయిరోబిక్ డైజెషన్ వంటి ప్రక్రియల ద్వారా ముడి వెదురు నుంచి బయో ఇథనాల్, బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని కనిపెట్టారు.
- పరిశుద్ధమైన, స్థిరమైన ఇంధన వనరులను అందించగల సామర్థ్యం వెదురుకు ఉందని గుర్తించారు.
- కొన్ని జాతుల వెదురు నుంచి అధికంగా బయో ఇంధనం ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. వేర్వేరు జాతులు వేర్వేరుగా రసాయన చర్య జరపడమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు.
- వెదురులో సెల్యూలోజ్‌లు, హెమిసెల్యూలోజ్‌లో అధిక మోతాదులో ఉంటాయి. వీటి నుంచి బయో ఇథనాల్, బయోగ్యాస్‌తోపాటు బయోచర్ అనే ఎరువు కూడా ఉత్పత్తి అవుతుంది.
- వెదురు నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాలను తయారు చేసుకుంటే శిలాజ ఇంధనాలపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గిపోతుందని, తద్వారా కాలుష్యాన్ని, వాతావరణ మార్పులను నియంత్రించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు. వెదురు నుంచి జీవ ఇంధనాల ఉత్పత్తి ప్లాంట్లకు పెద్దగా పెట్టుబడి అవసరం లేదని చెబుతున్నారు. ఇది పూర్తిగా సురక్షితమైన ప్రక్రియ అని పేర్కొంటున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్ వాణిని ప్రపంచం ఆసక్తిగా వింటోంది

- మోదీ హయాంలో ఉగ్రవాదంపై సమర్థ చర్యలు
- అవసరమైతే సరిహద్దుల అవతల కూడా దాడులు చేస్తాం
- పాక్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్ష హెచ్చరిక



జమ్మూ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో ప్రపంచ వేదికపై భారత్ పలుకుబడి, స్థాయి పెరిగిపోయాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత్ చెప్పే విషయాలను ప్రపంచ సమాజం ఇప్పుడు ఆసక్తిగా వింటోందని చెప్పారు. గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ ఏ విషయమైనా చెబితే, అంత సీరియస్‌గా తీసుకునేవారు కారని తెలిపారు. మోదీ ప్రభుత్వం వచ్చాక 2014 తర్వాత అలాంటి పరిస్థితులు లేవని చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో జాతీయ భద్రతపై జరిగిన సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అమెరికా, ఈజిప్టుల్లో ఆరు రోజుల పర్యటన సందర్భంగా పలు చారిత్రక ఒప్పందాలపై సంతకాలు చేసిన నేపథ్యంలో రాజ్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో ప్రధాని మోదీ పలుకుబడి పెరిగిందని చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ 'బాస్'అంటూ మోదీని అభివర్ణించగా, అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆటోగ్రాఫ్ తీసుకునేంత ప్రజాదరణ కలిగిన నేతగా కొనియాడిన నేపథ్యంలో మంత్రి ఈ మాటలన్నారు. ప్రధాని మోదీ హయాంలో భారత్ మరింత శక్తివంతంగా మారిందన్న ఆయన..అవసరమైన పక్షంలో సరిహద్దుల వెలుపల కూడా దాడి చేయగలదంటూ పొరుగుదేశం పాకిస్తాన్‌ను హెచ్చరించారు. ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుందని చెప్పారు. ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్'విధానం అంటే అర్థం ఏమిటో దేశంతోపాటు ప్రపంచమే తెలుసుకుందని వ్యాఖ్యానించారు. 2016, 2019ల్లో జరిపిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన ప్రస్తావిస్తూ..ఇందుకు సంబంధించిన నిర్ణయాలను ప్రధాని మోదీ కేవలం 10 నిమిషాల్లోనే తీసుకున్నారని, దీన్ని బట్టి ఆయన సామర్థ్యమేంటో తెలుస్తుందని రాజ్‌నాథ్ తెలిపారు. సరిహద్దుల లోపలే కాదు, వెలుపల కూడా ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను మన బలగాలు ధ్వంసం చేశాయన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించడమే ప్రభుత్వ విధానంగా మార్చుకున్న దేశాలు ఈ ఆటను ఎక్కువ సేపు ఆడలేవన్న విషయాన్ని గ్రహించాలని ఆయన పాక్‌నుద్దేశించి వ్యాఖ్యలు చేశారు. భారత్ కృషితో నేడు చాలా వరకు పెద్ద దేశాలు ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడుతున్నాయని చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపించడం ద్వారా ఏమీ సాధించలేమన్న విషయం పాక్ తెలుసుకోవాలన్నారు. పాక్ ముందుగా తన సొంతింటిని చక్కదిద్దుకోవాలని హితవుపలికారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా భారత్‌దేనని చెప్పారు. దీనిపై పార్లమెంట్ ఇప్పటికే పలు తీర్మానాలు చేసిందని గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌లో తామూ భాగమేనంటూ పీవోకే ప్రజలు డిమాండ్ చేసే రోజులు ఎంతో దూరంలో లేవని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు.

5 గ్యారంటీలకు ఏటా రూ.60 వేల కోట్లు



బెంగళూరు: ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారంటీల అమలుకు ప్రతిఏటా రూ.60,000 కోట్ల నిధులు అవసరమని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. వచ్చే నెల 7న తేదీన ప్రవేశపెట్టనున్న బడ్జెట్ మొత్తం రూ.3,35,000 కోట్లు ఉంటుందన్నారు. నూతన ఎమ్మెల్యేల శిక్షణా శిబిరాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కర్ణాటక తొలి బడ్జెట్ కేవలం రూ.21.3 కోట్లు మాత్రమేనని చెప్పారు. కర్ణాటక ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటీలు ఏమిటంటే.. నివాస గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా. ఒక్కో ఇంట్లో ఒక మహిళకు నెలకు రూ.2,000 చొప్పున సాయం. దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబంలోని ప్రతి సభ్యుడికి 10 కిలోల చొప్పున బియ్యం పంపిణీ. 18–25 ఏళ్ల గ్రాడ్యుయేట్ నిరుద్యోగికి ప్రతినెలా రూ.3,000, డిప్లొమా నిరుద్యోగికి రూ.1,500 చొప్పున సాయం. ప్రజా రవాణా సంస్థ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం.

భారత్-అమెరికా భాగస్వామ్యానికి ప్రపంచంలో ప్రాముఖ్యత: బైడెన్

వాషింగ్టన్: భారత్–అమెరికా భాగస్వామ్యానికి, స్నేహానికి ప్రపంచంలో అత్యధిక ప్రాముఖ్యత ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా, సన్నిహితంగా, స్థిరంగా ఉన్నాయని వివరించారు. వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి చేర్చాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. ఈ మేరకు బైడెన్ తాజాగా ట్వీట్ చేశారు. బైడెన్ ట్వీట్ పట్ల ప్రధాని మోదీ స్పందించారు. భారత్–అమెరికా స్నేహం ప్రపంచదేశాల అభ్యున్నతికి తోడ్పతుందని పేర్కొన్నారు. మన భూగోళం మరింత ఉత్తమంగా, స్థిరంగా మారడానికి ఇరుదేశాల భాగస్వామ్యం ఎంతగానో ఉపయోగపడుతుందని ట్విట్టర్‌లో స్పష్టం చేశారు. బైడెన్ అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని తెలిపారు. ఇటీవల తాను చేపట్టిన పర్యటన భారత్–అమెరికా నడుమ సంబంధ బాంధవ్యాల బలోపేతానికి దోహదపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, అమెరికా దేశాల మధ్యనున్న సన్నిహిత, లోతైన భాగస్వామ్యాన్ని మోదీ పర్యటన మరింత దృఢతరం చేసిందని అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్‌హౌజ్ హర్షం వ్యక్తం చేసింది.

'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు

సీఐఏ అధినేత డేవిడ్ పేట్రాయస్ హెచ్చరిక



వాషింగ్టన్: రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌పై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ప్రైవేట్ సైన్యం 'వాగ్నర్' చీఫ్ ప్రిగోజిన్ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని అమెరికా నిఘా సంస్థ సీఐఏ అధిపతి డేవిడ్ పేట్రాయస్ హెచ్చరించారు. తెరిచి ఉన్న కిటికీల వద్ద చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రిగోజిన్‌కు సూచించారు. గతంలో పుతిన్ ప్రత్యర్థులు చాలా మంది ఇలా తెరిచి ఉన్న కిటికీల నుంచి జారిపడి మరణించారని పేట్రాయస్ పరోక్షంగా తెలియజేశారు. తిరుగుబాటు చర్య నుంచి వెనక్కి తగ్గడం ద్వారా ప్రిగోజిన్ ప్రస్తుతానికి ప్రాణాలు కాపాడుకున్నాడని, కానీ వాగ్నర్ గ్రూప్‌ను పోగొట్టుకున్నాడని అభిప్రాయపడ్డారు. రష్యా అధికార పీఠం పెత్తనాన్ని ప్రశ్నించినవారు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. సోవియట్ కూటమిలోనూ, ఆ తర్వాత రష్యాలోనూ ఇలాంటి మరణాలు సంభవించాయి. కిటికీల నుంచి కింద పడిపోయి చనిపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. తనపై తిరుగుబాటు చేసిన వారిని పుతిన్ అంత సులభంగా వదిలిపెట్టబోరని ఆయన గురించి తెలిసిన నిపుణులు చెబుతున్నారు. ప్రిగోజిన్ ప్రస్తుతం బెలారస్‌కు చేరుకున్నట్లు తెలుస్తోంది. ఆయన అక్కడ సురక్షితంగా ఉంటారా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు.

బెంగాల్‌లో కాంగ్రెస్, సీపీఎంలది మరోదారి: మమత


కూచ్‌బెహార్: కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటుకు తాను ప్రయత్నిస్తుండగా, తమ రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్, సీపీఎం భిన్న స్వరాలు వినిపిస్తున్నాయని టీఎంసీ చీఫ్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఆ రెండు పార్టీల చర్యలు రాష్ట్రంలో బీజేపీకి లాభం కలిగించేలా ఉన్నాయని విమర్శించారు. కూచ్‌బెహార్‌లో సోమవారం జరిగిన పంచాయతీ ఎన్నికల ర్యాలీలో మమత మాట్లాడారు. 'కేంద్రంలోని బీజేపీపై పోరాడేందుకు మేం మహాకూటమిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కానీ, బెంగాల్‌లో మాత్రం సీపీఎం, కాంగ్రెస్‌లు బీజేపీతో కలిసి పనిచేస్తున్నాయి. అటువంటి అపవిత్ర బంధాన్ని విచ్ఛిన్నం చేస్తాం'అని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ బెంగాల్ అధ్యక్షుడు అధిర్ రంజన్ ఛౌధురి స్పందించారు. బీజేపీకి వ్యతిరేకంగా సాగే పోరాటంలో టీఎంసీ విశ్వసనీయతపై ఎప్పటి నుంచో అనుమానాలున్నాయన్నారు. బీజేపీపై పోరాటం విషయంలో తమకు చెప్పే అర్హత మమతా బెనర్జీకి లేదని సీపీఎం ఎదురుదాడి చేసింది. ఈ నెల 23న బిహార్‌లోని పట్నాలో సీఎం నితీశ్ సారథ్యంలో 12కు పైగా రాజకీయ పార్టీల నేతలు సమావేశమై 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోరాడాలని వీరు నిర్ణయించారు. తాజాగా మమతా బెనర్జీ మరో బాంబు పేల్చడం గమనార్హం.



వాడేసిన ప్లాస్టిక్ బాటిళ్లతో రూపొందించిన సముద్ర తాబేలు రూపమిది. ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పించేందుకు చెన్నైలోని ఎడ్వర్డ్ ఇలియట్స్ బీచ్‌లో ఏర్పాటు చేసిన ఈ తాబేలును అందరూ ఆసక్తిగా తిలకించారు.

'డ్రగ్స్ రహిత భారత్'ను సాధిస్తాం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశం నుంచి డ్రగ్స్ భూతాన్ని తరిమేస్తుందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశం గుండా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికడుతుందని స్పష్టం చేశారు. సోమవారం 'ఇంటర్నేషనల్ డే ఎగెనెస్ట్ డ్రగ్ అబ్యూజ్'సందర్భంగా అమిత్ షా ఈ మేరకు ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఇతర శాఖలు, విభాగాల సమన్వయంతో తమ హోం శాఖ అమలు చేస్తున్న నార్కోటిక్స్ వ్యతిరేక జీరో–టాలరెన్స్ విధానం విజయవంతమైందని, సానుకూల ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని చెప్పారు. డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంలో విజయం సాధించేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆ వీడియోల అమిత్ షా స్పష్టం చేశారు. 201-2022 సంవత్సరాల మధ్యలో సమష్టి చర్యల ఫలితంగా రూ.22 వేల కోట్ల మాదకద్రవ్యాలను సీజ్ చేశామన్నారు. ఇవి 2006–13 సంవత్సరాల మధ్య స్వాధీనం చేసుకున్న రూ.768 కోట్ల డ్రగ్స్ కంటే 30 రెట్లు ఎక్కువని వివరించారు. 2006–13 మధ్యలో డ్రగ్స్ విక్రేతలపై 1,257 కేసులు నమోదు కాగా, 2014–22 సంవత్సరాల్లో 3,544 కేసులు పెట్టినట్లు చెప్పారు. ఇవి 181 శాతం అధికమన్నారు. వీటితోపాటు 2022 జూన్ నుంచి ఇప్పటి వరకు 600 టన్నుల డ్రగ్స్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఉమ్మడిగా సాగించిన కృషి వల్లనే సాధ్యమైందని అన్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సహా అన్ని విభాగాలు డ్రగ్స్‌పై పోరాటాన్ని కొనసాగిస్తున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తమ కుటుంబాలను ఈ మహమ్మారికి దూరంగా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు.

డ్యూటీ ముగిసింది.. విమానం నడపను

ఎయిర్ ఇండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ • పైలట్ నిర్వాకంతో 350 మంది ప్రయాణికుల అవస్థలు

జైపూర్: తన డ్యూటీ ముగిసిందని, అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానాన్ని నడపబోనంటూ ఎయిర్ ఇండియా పైలట్ నిరాకరించడంతో 350 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. లండన్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం షెడ్యూల్ ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. వాతావరణం అనుకూలించకపోవడంతో ఢిల్లీలో 10 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. అనంతరం జైపూర్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దాదాపు 2 గంటల అనంతరం తిరిగి ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) నుంచి అనుమతి లభించింది. కానీ, విమానాన్ని తిరిగి టేకాఫ్ చేసేందుకు పైలట్ అంగీకరించలేదు. తన డ్యూటీ అయిపోయిందని తేల్చిచెప్పాడు. దీంతో 350 మంది ప్రయాణికులు జైపూర్ ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణికులు ఇతర మార్గాల్లో ఢిల్లీ చేరుకున్నారు. కొన్ని గంటల తర్వాత మరో పైలట్‌ను ఏర్పాటు చేయడంతో విమానం ఢిల్లీకి చేరుకుంది. ఎయిర్ ఇండియా నిర్వాకం సోమవారం కూడా బయటపడింది. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే విమానాన్ని రద్దుచేయడంతో 150 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమిళనాడు రాజధాని చెన్నై నుంచి ఉదయం 10.05 గంటలకు ఢిల్లీకి విమానం బయలుదేరాల్సి ఉంది. ఆ విమానాన్ని ఎయిర్ ఇండియా యాజమాన్యం హఠాత్తుగా రద్దు చేసింది. ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే కొన్ని గంటలపాటు పడిగాపులు పడ్డారు. చివరకు అసలు విషయం తెలుసుకొని యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మణిపూర్ సీఎంను తొలగించండి



న్యూఢిల్లీ: మణిపూర్‌లో దాదాపు రెండు నెలలుగా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నప్పటికీ ప్రధాని మోదీ మౌనం దాల్చడమేంటని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. మణిపూర్ గురించి ప్రధాని మోదీ నిజంగా ఆందోళన చెందుతున్నట్లయితే ముందుగా చేయాల్సింది ఆ రాష్ట్ర సీఎంను తొలగించడమేనన్నారు. మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంలో విఫలమైన బీజేపీ ప్రభుత్వం ఆ విషయాన్ని కప్పిపుచ్చు కోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పలు ట్వీట్లు చేశారు. 'గడిచిన 55 రోజుల్లో మణిపూర్ గురించి ప్రధాని మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆయన ఏం చెబుతారా అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. మోదీ జీ నిజంగా మణిపూర్‌లో పరిస్థితులపై ఆందోళన చెందుతున్నట్లయితే, అక్కడి బీజేపీ సీఎంను ముందుగా తొలగించండి'అని పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాద సంస్థల నుంచి ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని పార్టీలతో సంభాషణలు జరిపి, ఉమ్మడి రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాలని ప్రభుత్వానికి ఖర్గే సూచించారు. 'రాష్ట్రంలో జాతీయ రహదారులపై సురక్షిత ప్రయాణానికి వీలు కల్పించాలి. ప్రజలకు నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తేవాలి. సహాయ, పునరావాస ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలి'అని ఖర్గే పేర్కొన్నారు.

'ప్రధానమంత్రి పదవి'పై చర్చించలేదు: శరద్ పవార్

పుణే: పట్నాలో ఇటీవల జరిగిన విపక్షాల సమావేశంలో ప్రధానమంత్రి పదవిపై ఎలాంటి చర్చ జరగలేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ సోమవారం స్పష్టం చేశారు. దేశంలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం, ప్రజా సమస్యలపై చర్చించామని తెలిపారు. మత ఘర్షణలను ప్రేరేపించడానికి కొందరు పన్నుతున్న కుట్రలపైనా చర్చ జరిగిందన్నారు. విపక్షాల సమావేశంపై అధికార బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలను పవార్ ఖండించారు. సమావేశాలు నిర్వహించుకొనే హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో విపక్ష నాయకులకు లేదా? అని నిలదీశారు. చిన్నపిల్లల తరహాలో మాట్లాడొద్దని మోదీ ప్రభుత్వానికి శరద్ పవార్ హితవు పలికారు.

విమానం ఇంజిన్ లోపలికి లాగేసింది!

టెక్సాస్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగి మృత్యువాత


హూస్టన్: ఊహించని ఘటన ఇది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. డెల్టా ఎయిర్ లైన్స్‌కు చెందిన విమానం 23న రాత్రి 10.25 గంటల సమయంలో లాస్ ఏంజెలెస్ నుంచి టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఎరైవల్ గేట్ వద్దకు చేరిన ఆ విమానంలోని ఒక ఇంజిన్ పనిచేస్తోంది. ఇంజిన్ వేగం ప్రభావానికి అదే సమయంలో అటుగా వెళ్లిన ఉద్యోగి ఒకరిని లోపలికి లాగేసింది. అతడు చనిపోయినట్లు నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ ఏజెన్సీ(ఎన్‌టీఎస్‌బీ)తెలిపింది. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై డెల్టా ఎయిర్ లైన్స్ అధికారులను విచారిస్తున్నట్లు పేర్కొంది. మృత్యువాత పడిన ఉద్యోగి వివరాలను వెల్లడించలేదు. విమానాశ్రయాల్లో హ్యాండ్లింగ్ కార్యకలాపాలకు కాంట్రాక్టు సేవలందించే యునిఫి ఏవియేషన్ సంస్థ అతడిని నియమించుకున్నట్లు సమాచారం. కాగా, గత ఏడాది అలబామా ఎయిర్‌పోర్టులోనూ ఇలాంటి ఘటనే జరిగింది. విమానం ఇంజిన్ ఒక ఉద్యోగిని లోపలికి గుంజుకోవడంతో అతడు చనిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన అధికారులు ఇటీవలే సదరు విమాన సంస్థకు రూ.12.80 లక్షల జరిమానా విధించారు.

వీర్యం తారుమారు చేసినందుకు రూ.1.5 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) రూ.1.5 కోట్ల జరిమానా విధించింది. కృత్రిమ గర్భధారణ కోసం వచ్చిన మహిళకు ఆమె భర్త వీర్యం బదులు మరొకరి వీర్యాన్ని ఎక్కించడమే ఇందుకు కారణం. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నిక్(ఏఆర్‌టీ) విధానంలో సంతానం కోసం దంపతులు ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన తర్వాత 2009 జూన్‌లో వారికి కవలలు జన్మించారు. శిశువులకు డీఎన్‌ఏ పరీక్షలు చేయించగా, వారి తండ్రి అతడు కాదని తేలింది. మరొకరి వీర్యంతో వారు జన్మించినట్లు స్పష్టమయ్యింది. మనోవేదనకు గురైన దంపతులు తమకు న్యాయం చేయాలని, రూ.2 కోట్ల నష్టపరిహారం చెల్లించేలా ఆసుపత్రిని ఆదేశించాలని కోరుతూ ఎన్‌సీడీఆర్‌సీని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ దర్యాప్తు వారికి అనుకూలంగా కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దంపతులకు రూ.1.5 కోట్ల పరిహారం చెల్లించాలని ప్రైవేట్ ఆసుపత్రిని ఆదేశించింది. ప్రైవేట్ హాస్పిటళ్లలో కృత్రిమ గర్భధారణ వల్ల జన్మించిన ప్రతి శిశువు డీఎన్‌ఏ ప్రొఫైల్‌ను తయారీ చేసి ఇచ్చేలా నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని కమిషన్ అభిప్రాయపడింది.

ఒడిశాలో ఘోర బస్సు ప్రమాదం

పెళ్లి బృందంలోని 12 మంది మృత్యువాత



బరంపురం: ఒడిశాలోని గంజాం జిల్లాలో రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పెళ్లి బృందానికి చెందిన 12 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన దిగపహండి సమీపంలోని బరంపురం–తప్తపాని రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెళ్లి బృందంతో వస్తున్న ప్రైవేట్ బస్సు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సును ఢీకొట్టిందని ఎస్పీ శరవణ వివేక్ చెప్పారు. ప్రైవేట్ బస్సులోని వారంతా బరంపురంలోని వివాహ వేడుకకు హాజరై ఖండాదేవ్‌లీకి వెళ్తుండగా ఘోరం చోటుచేసుకుందన్నారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురున్నారు. క్షతగాత్రులైన ఏడుగురిని ఆస్పత్రికి తరలించామని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్రం రూ.2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల చొప్పున సాయం ప్రకటించాయి. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున అందజేయనున్నట్లు పీఎంవో ట్వీట్ చేసింది. ప్రైవేట్ బస్సుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు తెలిపారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 27 । జూన్ । 2023



డబ్బు తిరిగివ్వాలని అడిగినందుకే..

తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కిడ్నాప్‌నకు యత్నించిన కేసులో నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. -8లో



భారీగా గంజాయి పట్టివేత

కుత్బుల్లాపూర్: కారులో తరలిస్తున్న 250 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. -8లో

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ ఫలితాల విడుదల

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్, బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డా. పరాంకుశం వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయం పోర్టల్ www. braouonline.in లో అందుబాటులో ఉంచామన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా పెద్దమ్మతల్లి శాకంబరి ఉత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ తల్లి శాకంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం సప్తశతి పారాయణం, వేద పారాయణం, రుద్రాభిషేకాలు, సాముహిక లలితా సహస్రనామ కుంకుమార్చన పూజలను నిర్వహించారు. సాయంత్రం అనుష్టాన హోమాలు, రాత్రి పెద్దమ్మతల్లి ఉత్సవ మూర్తి పల్లకీ సేవ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శాకంబరి దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని వివిధ రకాల కూరయగాయలు, పండ్లు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: హెచ్ఐసీసీలో సోమవారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటులు గీతిక, వర్షాలతో పాటు నిర్వాహకుడు డొమినిక్ ప్రారంభించారు. 350 మంది టాప్ డిజైనర్లు రూపొందించిన వస్తువులు స్టాల్స్‌లో కొలువుదీరాయన్నారు. యువతను ఆకట్టుకునే విధంగా వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. హైలైఫ్ ఎగ్జిబిషన్ మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

అందుబాటులోకి ఆర్టీసీ జనరల్ రూట్ పాస్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు అందజేసే రూట్‌పాస్ తరహాలోనే ఆర్టీసీ తొలిసారిగా సాధారణ ప్రయాణికులకు సైతం రూట్‌పాస్‌ను అందుబాటులోకి తెచ్చింది. 8 కిలోమీటర్ల వరకు రూట్‌పాస్ లభించనుంది. తక్కువ దూరం ప్రయాణం చేసేవారికి ఇది ఎంతో ప్రయోజనకారి అని అధికారులు తెలిపారు. రూట్ పాస్‌కు ఆర్డినరీ బస్సుల్లో నెలకు రూ. 600, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లో రూ.1000 చొప్పున చార్జీ ఉంటుంది. 8 కిలోమీటర్ల పరిధిలో ఎన్నిసార్లైనా ప్రయాణం చేయవచ్చు. కేవలం 15 రోజుల చార్జీలతో నెలపాటు ప్రయాణించే సదుపాయం లభిస్తుందని పేర్కొన్నారు. సెలవురోజు, శని, ఆదివారాల్లో కూడా ప్రయాణం చేయవచ్చని ఈడీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్

శంషాబాద్: ప్రయాణికుల కోసం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సదుపాయాలను ఇంతకింతకూ పెంచుతున్నారు. తాజాగా సోమవారం నుంచి సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాప్ సదుపాయాన్ని 9వ గేటు వద్ద ప్రారంభించారు. ఈ సౌలభ్యంతో మరింత సులభమైన ప్రయాణ అనుభూతి కలుగుతుందని సీఈఓ ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు. బ్యాగేజ్ చెక్-ఇన్ ప్రక్రియ కేవలం అతి తక్కువ సమయంలో పూర్తవుతుందన్నారు.

ఉప్పల్‌పై వరాల జల్లు

స్కైవాక్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

ఉప్పల్‌లో ప్రారంభమైన ఆకాశ నడక మార్గం





స్కైవాక్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ ప్రారంభోత్సవానంతరం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఉప్పల్ నియోజకవర్గంపై వరాల జల్లులు కురిపించారు. రామంతాపూర్‌లో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో పేదలు గౌరవంగా శుభ కార్యాలను కేవలం రూ. 15 వేలకు నిర్వహించుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చెప్పడంతో.. స్పందించిన మంత్రి ఒక్క డివిజనే కాదు ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌కూ ఒక మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించి ఇస్తామన్నారు. ఇందుకు సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్ మినీ శిల్పారామం ఆవరణలో ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణాన్ని ప్రారంభించిన కేటీఆర్‌కు.. హెచ్‌ఎండీఏ లేఅవుట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేకల మధుసూదన్ రెడ్డి, గోనే అర్జున్ రెడ్డిలతోపాటు మరికొందరు మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో మంచి నీరు, డ్రైనేజ్, రోడ్లు తదితర వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటుకు పలు దేశాల ప్రతినిధులు పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. వరంగల్ నుంచి ఉప్పల్ రావడానికి ఎంత సమయం పడుతుందో.. నారపల్లి నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు రావడానికి దాదాపు అంతే సమయం పడుతుందన్న విషయాన్ని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అంబర్‌పేట, ఉప్పల్ ఫ్లై(స్కై) ఓవర్లు ఆరేళ్లు గడిచినా ముందుకు సాగడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఈ కారణంగానే రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ఉప్పల్ రోడ్లను బాగు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



స్కైవాక్‌పై నడిచి వెళ్తున్న పాదచారులు

కేటీఆర్‌కు నిరసనల సెగ

ఉప్పల్‌లో మంత్రి కేటీఆర్‌కు నిరసన సెగ తగిలింది. దఫ దఫాలుగా బీజేపీ నేతలు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగారు. ఉప్పల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి విఫలమయ్యారంటూ.. ఉప్పల్ స్కైవాక్ వంతెన ప్రారంభోత్సవాన్ని బీజేపీ నేతలు అడ్డుకునేందుకు యత్నించారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆ పార్టీ నేతలతో కలిసి వరంగల్ రహదారిపైకి దూసుకు వచ్చారు. కేటీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి తదితరులు రహదారిపైకి దూసుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.




ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేస్తున్న బీజేపీ నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

డెంగీ జోరు.. ముందస్తు పోరు..

నగరంలో జూన్‌లోనే విస్తరిస్తున్న వ్యాధి

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- యాంటీ డెంగీ మంత్‌గా జులై మాసం
- కార్యాచరణ సిద్ధం చేస్తున్న వైద్య విభాగం



సాక్షి, సిటీబ్యూరో: వేసవి ముగిసి ఇలా వర్షాలు పడుతున్నాయో లేదో.. గ్రేటర్ పరిధిలో డెంగీ విస్తరిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ జూన్ నెలలోనే అత్యధికంగా కేసులు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ప్రతీ ఏడాది మాదిరిగానే వచ్చే జులై నెలను కూడా యాంటీ డెంగీ మంత్‌గా ప్రకటించి అందుకు తగిన కాస్త ముందుగానే కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నట్టు జిల్లా వైద్యాధికారి వెంకటి చెప్పారు.

నగరం... డెంగీకి కేరాఫ్...

రాష్ట్రవ్యాప్తంగా చూస్తే కూడా ఏటేటా అత్యధికంగా హైదరాబాద్ నగరంలోనే డెంగీ కేసులు నమోదవుతాయి. గత 2022లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,756 కేసుల్లో అత్యధికంగా నగరంలోనే నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 307 కేసులు మాత్రమే కాగా ఈ ఒక్క నెలలోనే 65 కేసులున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది కూడా అదే సంఖ్య చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో కొన్ని ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, ఫీవర్ ఆస్పత్రి వంటి ఆసుపత్రులతో పాటు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా కేసులు నమోదవుతున్నాయి.

ఎదుర్కోవడానికి రెడీ...

సాధారణంగా జులై నెలను డెంగీ ప్రారంభ దశగా దాన్ని డెంగీపై అవగాహన పెంచే మాసంగా అధికారులు చూస్తారు. అది 3 నెలల పాటు దశలవారీగా పెరుగుతూ సెప్టెంబరు నెలకు అత్యధిక సంఖ్యలో కేసులు వస్తాయి. ఈసారి జూన్‌లోనే ప్రతాపం చూపడం మొదలైంది కాబట్టి జులైలో కేసులు బాగా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ తదితర విభాగాలతో సమన్వయం చేసుకుని డెంగీని ఎదుర్కోవాలని జిల్లా వైద్య విభాగం సిద్ధమవుతోంది. వచ్చే నెలలో విస్తృతంగా మెడికల్ క్యాంపులు, ఫీవర్ సర్వే లు ఒక కేసు వస్తే కనీసం 50 కుటుంబాల సర్వే, అవగాహన ర్యాలీలు, సదస్సులు, పాఠశాల విద్యార్థుల కోసం కార్యక్రమాలు, ఫ్రైడే.. డ్రై డే కాన్సెప్ట్‌ను విజయవంతం చేయడం తదితర అంశాలపై సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. నగరంలో అత్యధిక కేసులు నమోదయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రత్యేకంగా ముందస్తు చర్యలు చేపట్టనున్నారు.

గాంధీలో రోగుల క్యూ

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగానికి సోమవారం రోగులు క్యూ కట్టారు. నగరంతో పాటు రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన రోగులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఓపీ విభాగం కిక్కిరిసింది. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ కంప్యూటర్ చిట్టీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే దుస్థితి దాపురించింది. సోమవారం అవుట్ పేషెంట్ విభాగంలో 3982 మంది రోగులకు వివిధ రకాల వైద్య సేవలు అందించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందడంతో ఓపీ రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఆస్పత్రి పాలనా యంత్రాంగం అధికారి ఒకరు తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో దగ్గు, జలుబు, జ్వరం, వైరల్ ఫీవర్లు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు సూచించారు. ఓపీ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందేలా కార్యాచరణ రూపొంది అమలు చేస్తున్నామని వివరించారు. నాట్కో సంస్థ ప్రతినిధి స్వాతి కాంతామణి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్లు కృష్ణవేణి, నాగమణిలు హెల్ప్‌డెస్క్ వద్ద రోగులకు తమ సహాయ సహకారాలు అందించారు.

గాంధీ ఓపీ విభాగంలో క్యూలైన్లలో బారులు తీరిన రోగులు



సిద్ధంగా ఉన్నాం



ఈ నెలలో కేసులు బాగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించి జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. వచ్చే నెలను యాంటీ డెంగీ మంత్ కాబట్టి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. నగరవాసులు కూడా వ్యాధిపై అవగాహన పెంచుకుని నీళ్ల నిల్వ ఉంచకపోవడం, పరిశుభ్రత పాటించడం వంటి జాగ్రత్తలు ఇప్పటి నుంచే తీసుకోవాలి. – డాక్టర్ వెంకటి, జిల్లా వైద్యాధికారి

మో'డల్' మార్కెట్లు



నిర్మాణాలు జరిగినా వినియోగంలోకి రాని వైనం

- ప్రజలకు అందుబాటులో లేకపోవడమే కారణం
- వృథాగా మారిన కోట్లాది రూపాయల ప్రజాధనం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రతి పదివేల మందికి ఒక మార్కెట్ ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో అలా లేకుండాపోయింది. ప్రజావసరాలకు అనుగుణంగా తగినన్ని మోడల్ మార్కెట్లు నిర్మిస్తామని గతంలో మోండా మార్కెట్‌ను సందర్శించిన సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభిప్రాయపడ్డారు. దీంతో నగరంలో కనీసం 200 మోడల్ మార్కెట్లు నిర్మించాలని భావించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆ మేరకు ప్రయత్నాలు చేశారు. అందుకు దాదాపు రూ.130 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఎట్టకేలకు 42 మార్కెట్ల నిర్మాణాలకు మాత్రం టెండర్లు పిలిచారు. దాదాపు మూడేళ్ల క్రితమే 37 మోడల్ మార్కెట్లను నిర్మించారు. అందుకు దాదాపు రూ.30 కోట్లు ఖర్చు చేశారు. వాటిలో 589 దుకాణాలుండగా.. ఇప్పటివరకు కేవలం 164 దుకాణాలను మాత్రమే ఆయా వ్యాపారాలు నిర్వహించేందుకు చిరు వ్యాపారులు వాటిని టెండర్ల ద్వారా దక్కించుకున్నారు. టెండర్ల ద్వారా పొందిన వారు సైతం అందరూ దుకాణాలు ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో మోడల్ మార్కెట్లలో కొన్ని మద్యంబాబులకు అడ్డాలుగా మారాయి. కొన్నిచోట్ల వాచ్‌మెన్‌లు నివాసముంటున్నారు. వాటిని పట్టించుకునేవారు లేకపోవడంతో చెత్తా చెదారంతో పేరుకుపోతున్నాయి. సదాశయంతో నిర్మించిన మోడల్ మార్కెట్లు వృథాగా పడి ఉండటంతో వాటిని ఇతర అవసరాలకు మళ్లించేందుకు ప్రస్తుతం సిద్ధమవుతున్నారు.

గాడి తప్పిన లక్ష్యం..

గ్రేటర్‌లోని ప్రజలకు ఎక్కడి వారికి అక్కడే చిన్నపాటి సూపర్‌మార్కెట్లలా మోడల్ మార్కెట్లు ఉపయోగపడాలనేది ప్రభుత్వ ఆలోచన. కానీ..వాటిని నిర్మించేముందే అవి నిజంగా ప్రజలకు దగ్గరలో అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది పట్టించుకోలేదు. ఎక్కడ పడితే అక్కడ నిర్మించడంతో అవి ప్రజల నివాస ప్రాంతాలు, కాలనీలకు దూరంగా ఉన్నాయి. లక్ష్యాన్ని పట్టించుకోకుండా నిర్మాణాలు జరిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక సైతం లీజుకిచ్చేందుకు నిర్ణయించిన ధరలు అధికంగా ఉండటంతో వాటిని తీసుకునేందుకు ముందుకొచ్చేవారు కరువయ్యారు. అనంతరం ధరలు తగ్గించినప్పటికీ, వాటిల్లో వ్యాపారాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు దూరంగా ఉన్నందున నడుస్తాయా.. లేదా అనే అనుమానాలతో వ్యాపారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాల్ని వృథాగా ఉంచలేక బస్తీ దవాఖానాలు, కౌన్సెలింగ్ సెంటర్లు, జిమ్ సెంటర్లు, పబ్లిక్ లైబ్రరీలు, నిరుద్యోగులకు శిక్షణ కేంద్రాలు తదితర అవసరాలకు వినియోగించేందుకు ప్రస్తుతం సిద్ధమవుతున్నారు.

ఒక్కరూ ముందుకు రాలేదు..

హయత్‌నగర్ సర్కిల్‌లోని లలితానగర్ కాలనీ, మన్సూరాబాద్ జడ్జిల కాలనీ, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీ, హస్తినాపురం, చంపాపేట, సరూర్‌నగర్, మలక్‌పేట, రక్షాపురం, చందానగర్ సర్కిల్‌లో మయూరి నగర్, హుడాకాలనీ, మూసాపేట సర్కిల్ సీబీసీఐడీ కాలనీ, 6వ ఫేజ్, కూకట్‌పల్లి పాపిరెడ్డినగర్, కుత్బుల్లాపూర్ గాయత్రి నగర్, అల్వాల్ రైల్‌నగర్, మల్కాజిగిరి, బేగంపేట పాటిగడ్డ ప్రాంతాల్లోని మోడల్ మార్కెట్లలో కనీసం ఒక్క దుకాణం కూడా ఎవరూ తీసుకోలేదంటే పరిస్థితిని అంచనా వేసుకోవచ్చు.

మసాజ్ పేరుతో వ్యభిచారం

- గుట్టు రట్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ముగ్గురు నిర్వాహకులు సహా 31 మంది అరెస్టు

బంజారాహిల్స్: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న స్పాపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ముగ్గురు నిర్వాహకులు, 10 మంది యువతులు, 18 మంది విటులను అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని కార్వీ ఎదురుగా ఓ అపార్ట్‌మెంట్‌లో పర్పుల్ నేచురల్ హెల్త్ త్రూ ఆయుర్వేద పేరుతో రాయల శృతి, రమణ, జాహెద్ ఉల్-హక్ కలిసి స్పా సెంటర్ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి యువతులను రప్పించి క్రాస్ మసాజ్, వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులు శృతి, రమణ, జాహెద్ ఉల్ హక్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. యువతులను రెస్క్యూహోంకు తరలించారు. 18 మంది విటులను కోర్టులో హాజరుపరిచారు.

డాక్టర్ కావాలనుకుని.. దారి మళ్లిన యువతి..

మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువతి శృతి చదువుల్లో రాణించింది. డాక్టర్ కావాలనుకొని ఉక్రెయిన్‌లో మెడిసిన్ సీటు సంపాదించింది. మొదటి సంవత్సరం పూర్తి చేసింది. రెండో ఏడాది ఫీజు చెల్లించలేక స్వస్థలం భద్రాచలం వచ్చేసింది. అనంతరం అమీర్‌పేట్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ కూడా తీసుకుంది. అదే సమయంలో బంజారాహిల్స్‌లోని ఓ స్టార్ హోటల్‌లో రిసెప్షనిస్ట్‌గానూ పని చేసింది. ఆ సమయంలోనే అయిదు నక్షత్రాల హోటల్ తళుకుబెళుకులను కళ్లారా చూసింది. స్టార్ హోటల్ లైఫ్‌కు పూర్తిగా అలవాటు పడింది. డాక్టర్‌గా, ఎయిర్ హోస్టెస్‌గా కలలు కని అవి సాకారం కాకపోవడంతో.. తేలికగా డబ్బు సంపాదించే మరో మార్గంలో వెళ్లాల్సిందేనని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే గతేడాది పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మసాజ్ సెంటర్ తెరిచి వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను రప్పించి వారితో వ్యభిచారం చేయిస్తూ డబ్బు సంపాదించింది. కాగా.. కొద్ది రోజుల్లోనే పంజగుట్ట పోలీసులు ఆమెను జైలుకు పంపించారు. స్పా సెంటర్ నిర్వహణలో మెలకువలు తెలుసుకున్న సదరు యువతి జైలు నుంచి బయటికి వచ్చాక మళ్లీ అదే దారి పట్టింది. ఈసారి బంజారాహిల్స్‌లో మసాజ్ సెంటర్ తెరిచింది. కొద్ది రోజుల్లోనే ఆమె మసాజ్ సెంటర్ వ్యాపారం వృద్ధి చెందింది. పోలీసులు మరోసారి స్పా సెంటర్‌పై దాడులు నిర్వహించారు. రెండోసారి ఆమె బంజారాహిల్స్ పోలీసులకు పట్టుబడి తాజాగా సోమవారం జైలుకు వెళ్లింది.

ట'మోత'

- రైతుబజార్‌లో కిలో రూ.75



సనత్‌నగర్: టమాటా ఠారెత్తిస్తోంది. కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తోన్న ధరలు ప్రస్తుతం కొండెక్కి కూర్చున్నాయి. రైతు బజార్‌లో కిలో రూ.75 ఉండగా బహిరంగ మార్కెట్లో సెంచరీ దాటేసింది. టమాటా పంట దిగుబడి భారీగా తగ్గడంతో రోజువారీగా హోల్‌సేల్ మార్కెట్‌కు రావాల్సిన దాని కంటే తగ్గిపోవడంతో ధరలు ఎగబాకుతున్నాయి. ఎర్రగడ్డ రైతుబజార్‌కు రోజువారీగా 200 క్వింటాళ్ల టమాటా వస్తోంది. నాలుగైదు రోజులుగా కేవలం 50-60 క్వింటాళ్లకు పడిపోయింది. రంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ మదనపల్లె, బెంగళూరు నుంచి ఎక్కువగా టమాటా నగరానికి దిగుమతి అవుతోంది. ప్రస్తుతం టమాటా పంట కోతలు పూర్తయ్యి కొత్త పంట వేశారు. పంట కోతకు రావడానికి మరికొంత సమయం పడుతుంది. అప్పటివరకు టమాటా ధర మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నెల 18న రైతుబజార్‌లో రూ.39 ఉన్న కిలో టమాటా ధర వారం రోజుల వ్యవధిలోనే రూ.75కు చేరడం గమనార్హం.

అంగట్లో ఇంజినీరింగ్ సీట్లు


అందరి దృష్టీ కంప్యూటర్ సైన్స్‌పైనే

- సీఎస్ఈ సీట్లకు పెరిగిన డిమాండ్
- రూ.16 లక్షల నుంచి రూ.30 లక్షలు
- ఇష్టానుసారంగా ఫీజుల పెంపు

సాక్షి, సిటీబ్యూరో: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీట్లకు డిమాండ్ పెరగడంతో అంగట్లో సరుకుగా అమ్ముడుపోతున్నాయి. రోజురోజుకూ ఫీజుల మోత మోగుతోంది. సివిల్, మెకానికల్ వంటి ఇంజినీరింగ్ కోర్సులు కాకుండా సీఎస్ఈ బ్రాంచ్ వైపే మొగ్గు చూపిస్తుండటంతో ఒకేసారి డిమాండ్ పెరిగినట్లయింది. దీంతో ఇంజినీరింగ్ కళాశాలలు సీఎస్ఈ బ్రాంచ్‌కి ఫీజులు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కౌన్సెలింగ్ షెడ్యూలు ప్రకటించడంతో సీట్ల హడావుడి ప్రారంభమైంది. సీఎస్ఈ కోర్సుపై ఆసక్తి ఉన్నవారు కౌన్సెలింగ్ కన్వీనర్ కోటాతో సంబంధం లేకుండా బి కేటగిరీలో సీట్లు దక్కించుకునేందుకు పేరొందిన ఇంజినీరింగ్ కాలేజీలకు క్యూ కడుతున్నారు. ఫలితంగా సీఎస్ఈ నాలుగేళ్ల కోర్సు కలిపి ప్రస్తుతం రూ.16.లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు ఫీజు పలుకుతోంది. మరోవైపు వసతి ఫీజు అదనంగా ఏడాదికి రూ.1.50 లక్షలు వసూలు చేయడం సర్వసాధారణంగా తయారైంది. ప్రైవేటు కళాశాలలతో పాటు ఇష్టానుసారం బాదేస్తుండగా.. స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఏకంగా డొనేషన్ల పేరిట వసూళ్లకు దిగుతున్నాయి. మరోవైపు ఏటా కొంత మొత్తం చెల్లించాలన్న షరతు పెట్టడం మరింత విస్మయానికి గురి చేస్తోంది.

సీఎస్ఈకి తాకిడి

ఇంజినీరింగ్ కాలేజీలకు సీఎస్ఈ సీట్ల తాకిడి పెరిగింది. మెరిట్‌ను బట్టి ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇంటర్మీడియట్‌లో 90% పైగా మార్కులు ఉండాలని, జేఈఈ మెయిన్లో 75% మార్కులు వచ్చి ఉండాలనే నిబంధన పెడుతున్నాయి. మెరిట్ లేకపోతే డొనేషన్లను పెంచేస్తున్నాయి. చాలా కళాశాలలు కోర్ ఇంజినీరింగ్, ఐటీ సీట్లను తగ్గించేసుకుని, సీఎస్ఈ సీట్లను పెంచేశాయి. భారీ మొత్తంలో ఫీజులను చెల్లించే ఆర్థిక స్తోమత లేని వారు ఎక్కడో చోట కన్వీనర్ కోటాలో వచ్చిన సీటులో చేరిపోదామని నిర్ణయించుకుంటున్నారు. వాస్తవంగా కోర్ ఇంజినీరింగ్ సివిల్, మెకానికల్, లాంటి వాటిలో పెద్దగా ఉద్యోగావకాశాలు లేకపోవడంతో విద్యార్థులందరూ సాఫ్ట్‌వేర్ బాటపడుతున్నట్లు తెలుస్తోంది.



ఇప్పటికే.. బి కేటగిరీ కింద సగానికిపైగా..

నగర పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో బి కేటగిరీ కింద ఇప్పటికే సగానికి పైగా సీట్లు భర్తీ అయినట్లు తెలుస్తోంది. ఏకంగా కొన్ని కళాశాలలు సీఎస్ఈ సీట్లు పూర్తయినట్లు స్పష్టం చేస్తున్నాయి. జేఎన్టీయూ పరిధిలోనే 149 కాలేజీలుండగా ప్రైవేటు కాలేజీల్లో 70 శాతం సీట్లు కన్వీనర్ కోటా (ఎ కేటగిరీ) ద్వారా.. మిగిలిన 30 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటా (బి కేటగిరీ)లో ద్వారా భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది. కన్వీనర్ కోటా పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటాను భర్తీ చేయాలని కానీ కన్వీనర్ కోటా ప్రక్రియ కంటే ముందే బీ కేటగిరి సీట్లు అంగట్లో సరుకుగా అమ్ముడుపోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

మాజీ ఐఆర్ఎస్ అధికారి ఇంట్లో చోరీ కేసులో ఖాకీ!

- బాధితుడు రిటైర్డ్ ఆదాయపన్ను శాఖ కమిషనర్
- భూమి కొంటానంటూ పరిచయమైన నిందితుడు
- కొన్నాళ్ల పాటు నమ్మకంగా ఇంటికి రాకపోకలు
- ఆపై మత్తు మందు ఇచ్చి ఇల్లు గుల్ల చేసిన వైనం
- ఓ ఎస్సై ప్రమేయంపై పోలీసుల అనుమానాలు
- లోతుగా దర్యాప్తు చేస్తున్న హైదరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: గాంధీనగర్‌లో నివసించే మాజీ ఐఆర్ఎస్ అధికారి శామ్యూల్ ప్రసాద్ సరెళ్ల ఇంట్లో జరిగిన భారీ చోరీ కేసులో నగర శివార్లలో పని చేసే ఓ ఎస్సై అనుమానితుడిగా మారాడు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని అరెస్టు చేసిన ముషీరాబాద్ పోలీసులు సదరు ఖాకీ పాత్రపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. భూమి కొనుగోలు చేస్తానంటూ బాధితుడికి పరిచయమైన నిందితుడు సురేందర్ నమ్మకంగా ఉంటూ నిండా ముంచాడు. శామ్యూల్‌కు మత్తు మందు ఇచ్చి ఇంట్లో ఉన్న బంగారం, నగదుతో పాటు విలువైన పత్రాలు తస్కరించాడు. పోలీసులు ఈ కేసు వివరాలను గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

విశాఖపట్నంలోని భూమి కొంటానంటూ...

ఆదాయపు పన్ను శాఖలో కమిషనర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన ఐఆర్ఎస్ అధికారి శామ్యూల్ ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నారు. విశాఖపట్నంలో ఆయన సోదరికి చెందిన ఐదెకరాల భూమి కొంటానంటూ నిజాంపేటకు చెందిన సురేందర్ అతడిని సంప్రదించాడు. తనకు అనేక స్థిరాస్తులు ఉన్నాయని, ఇటీవలే నర్సాపూర్‌లో ఐదెకరాల భూమి విక్రయించినట్లు చెప్పాడు. ఆ నగదుతోనే విశాఖలో భూమి ఖరీదు చేస్తానని నమ్మబలికాడు. ఈ నేపథ్యంలో శామ్యూల్ గత నెల 19న రాజమండ్రిలో ఉంటున్న సోదరి వద్దకు వెళ్లి ఒరిజినల్ సేల్ డీడ్ తీసుకువచ్చి సురేందర్‌కు చూపాడు. దాదాపు 15 రోజుల పాటు సురేందర్ ప్రతి రోజూ శామ్యూల్ ఇంటికి రాకపోకలు సాగించి నమ్మకం పెంచుకున్నాడు.

అదును చూసుకుని పంజా...

శామ్యూల్ ఇంట్లో మెదక్ జిల్లాకు చెందిన మహిళ పని చేసేది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె తన స్వస్థలానికి వెళ్లింది. ఈ విషయం గుర్తించిన సురేందర్ గత నెల 30న తన పథకాన్ని అమలు చేశాడు. ఆ సమయంలో శామ్యూల్ ఇంటికి వెళ్లిన ఇతగాడు మరోసారి ఒరిజినల్ సేల్ డీడ్ చూపించమన్నాడు. దీంతో ఆయన తన అల్మారా తాళం తీసి వాటిని బయటికి తీసుకువచ్చాడు. హాల్‌లో కూర్చున్న శామ్యూల్‌కు సురేందర్ తాను తీసుకువచ్చిన టిఫిన్, కొబ్బరినీళ్లు ఇచ్చాడు. కొబ్బరినీళ్ళు తాగిన కొద్దిసేపటికే శామ్యూల్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అదే అదునుగా భావించిన సురేందర్ అల్మారాలో ఉన్న రూ.5 లక్షల నగదు, 30 తులాల బంగారు నగలు, 970 గ్రాముల వెండి సామాన్లతో పాటు వివిధ స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు తస్కరించాడు. దాదాపు 15 గంటల పాటు ఇంట్లోనే పడి ఉన్న శామ్యూల్ నగరంలో ఉన్న తన మరో సోదరి ఫోన్లకు స్పందించలేదు. దీంతో 31న ఈయన ఇంటికి వచ్చిన ఆమె ఆస్పత్రికి తరలించారు.

ఆధారాలు చూపాలన్న సదరు ఎస్సై...

ఈ నెల 7వ తేదీ వరకు ఆస్పత్రిలో చికిత్స పొందిన శామ్యూల్ కోలుకున్నాడు. ఆపై ఇంటికి వెళ్లి తన అల్మారాలో చూడగా... సురేందర్ చోరీ చేసినట్లు గుర్తించి ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 14న కేసు నమోదైంది. గతంలో అతడితో కలిసి రాజమండ్రి వెళ్లినప్పుడూ తనకు మత్తు ఇచ్చి రూ.60 వేలు తస్కరించాడని, 20 ఏళ్లుగా ఫార్మారంగంలో పని చేస్తున్న సురేందర్‌కు మత్తు మందులపై పట్టు ఉందని శామ్యూల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు సురేందర్‌ను అరెస్టు చేశారు. అతడి విచారణలో నగర శివార్లలోని ఓ ఠాణాలో పని చేస్తున్న ఎస్సై ఆలోచన మేరకే తాను ఈ నేరం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు సదరు ఎస్సైని ప్రశ్నించాలని భావించారు. అయితే ఓ దొంగ చెప్పిన విషయాలు ఎలా నమ్ముతారని, తన ప్రమేయంపై ఆధారాలు చూపాలని సదరు ఎస్సై ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఈ విషయం గోప్యంగా ఉంచిన పోలీసులు ఎస్సై ప్రమేయాన్ని నిర్ధారించడానికి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌బీఐ ఖాతాదారులే టార్గెట్

- ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న ముఠా
- ఐదుగురి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు

సాక్షి, సిటీబ్యూరో: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఖాతాదారులను టార్గెట్ చేసుకుని వివిధ రకాలైన మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఏడుగురితో కూడిన ఈ గ్యాంగ్‌లో ఐదుగురిని అరెస్టు చేశామని, వీరిపై దేశ వ్యాప్తంగా 1502 కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరు బ్యాంకు ఖాతాదారులను మోసం చేసేందుకు కాల్ స్పూఫింగ్‌కు సైతం పాల్పడినట్లు పేర్కొన్నారు. సోమవారం సైబర్ క్రైం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఢిల్లీలోని డబ్రీ ప్రాంతానికి చెందిన నిహాల్, అమన్ ఖాన్, ఆషిక్ అలీ, అష్రఫ్ జావేద్, శుభం కుమార్, అభిషేక్ భరద్వాజ్‌తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. నిహాల్ ఎస్బీఐ ఖాతాదారులకు సంబంధించిన పేర్లతో పాటు ఫోన్, పాన్ నెంబర్లు, వారి వృత్తి తదితరాలతో కూడిన డేటాను సేకరించి వారికి అందించేవాడు. రెండు బృందాలుగా విడిపోయిన వీరు ప్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలను కూడా నిహాల్ నుంచే తీసుకుంటున్నారు. ఇంటర్నెట్ నుంచి ఓ డైలర్ అప్లికేషన్ ఖరీదు చేసిన ఈ ఐదుగురూ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కస్టమర్ కేర్‌కు సంబంధించిన టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా స్పూఫ్ చేస్తున్నారు. ఈ అప్లికేషన్ ద్వారా కాల్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ నుంచే ఫోన్ వచ్చినట్లు రిసీవ్ చేసుకున్న వారికి కనిపిస్తుంది. ఇలా ఎస్‌బీఐ కస్టమర్లకు ఫోన్లు చేస్తున్న వీరు రివార్డు పాయింట్ల రీడీమ్, క్రెడిట్‌కార్డుపై ఇన్సూరెన్స్ పేర్లతో వారి కార్డు, సీవీ నెంబర్లు, ఎక్స్‌పైరీ డేట్‌తో పాటు ఓటీపీలు సంగ్రహిస్తున్నారు. అంతేగాక వీరు తమ ఫోన్ నెంబర్లు ఎస్‌బీఐ కస్టమర్ కేర్ అంటూ గూగుల్‌లో పొందుపరిచారు. దీనికి ఎవరైనా కాల్ చేస్తే జవాబు ఇవ్వకుండా కొద్దిసేపటి తర్వాత మరో నెంబర్ నుంచి వారికి కాల్ చేసి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌లా మాట్లాడేవారు. వారి ఫోన్లలో ఎనీ డెస్క్ యాప్ ఇన్‌స్టాల్ చేయించి వారి వ్యక్తిగత సమాచారం, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు వివరాలు సంగ్రహిస్తున్నారు. ఇలా కస్టమర్ల నుంచి స్వాహా చేసిన మొత్తం వెచ్చించి తొలినాళ్లలో హౌసింగ్.కామ్, నోబ్రోకర్.కామ్‌ల్లో లావాదేవీలు చేసే వాళ్లు. ఆపై వివిధ సంస్థల నుంచి ఆన్‌లైన్‌లో గిఫ్ట్ ఓచర్లు ఖరీదు చేస్తున్నారు. వీటితో ఆయా వస్తువులు కొని వాటిని నేరుగా డెలివరీ బాయ్ వద్దకు వెళ్లి తీసుకునేవారు. అనంతరం వాటిని హిమాన్షు అనే వ్యక్తికి 55 శాతం ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొత్తూర్‌కు చెందిన ఓ ఉద్యోగి ఇటీవల కస్టమర్ కేర్ నెంబర్ కోసం నెట్‌లో సెర్చ్ చేసి వీరి వల్లో పడ్డాడు. నిందితులు అతడి క్రెడిట్‌కార్డు నుంచి రూ.2300, బ్యాంకు ఖాతా నుంచి రూ.13,545 కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో నమోదైన కేసుపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో ఢిల్లీ వెళ్లిన పోలీసులు నిహాల్, హిమాన్షు మినహా ఐదుగురిని అరెస్టు చేసి తీసుకువచ్చారు. వీరిపై సైబరాబాద్‌లో 23, రాష్ట్రంలో 187, దేశవ్యాప్తంగా 1502 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు.



యాక్సిస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌ల పేరుతో..!

ఖాతాదారులకు ఫోన్లు చేస్తున్న ఢిల్లీ ముఠా

- వ్యక్తిగత సమాచారం సంగ్రహించి దుర్వినియోగం
- ముగ్గురి అరెస్టు, పరారీలో ఉన్న వారి కోసం గాలింపు

సాక్షి, సిటీబ్యూరో: యాక్సిస్ బ్యాంక్ కస్టమర్లకు ఫోన్లు చేసి, వారి నుంచి ఖాతాలు, క్రెడిట్ కార్డులకు సంబంధించిన వివరాలు సంగ్రహించి, వీటి ఆధారంగా వారి రిజిస్టర్డ్ ఈ-మెయిల్ ఐడీలను మార్చేసి ప్రీ-అప్రూవ్డ్ లోన్ల రూపంలో అందినకాడికి దండుకుంటున్న ఢిల్లీ ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. కస్టమర్ల డేటా ఈ నేరగాళ్లకు బ్యాంకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచే వస్తున్నట్లు గుర్తించామని సోమవారం ప్రకటించారు. ఢిల్లీలోని నజఫ్‌ఘర్, ఉత్తమ్‌నగర్ ప్రాంతాలకు చెందిన భూపేందర్, హిమాన్షు, సోను ఓ ముఠాగా ఏర్పడ్డారు. యాక్సిస్ బ్యాంక్ కస్టమర్లకు సంబంధించిన డేటాను అక్రమంగా సంగ్రహిస్తున్న వీరు బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌ల పేరుతో వారికి ఫోన్లు చేస్తున్నారు. క్రెడిట్ కార్డులకు సంబంధించిన రీడీమ్ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలంటూ వినియోగదారుల వివరాలతో పాటు రిజిస్టర్డ్ ఈ-మెయిల్ ఐడీలు తీసుకుంటున్నారు. వీటితో పాటు వ్యక్తిగత, ఖాతా వివరాలతో పాటు ఓటీపీలు సేకరిస్తున్నారు. దీంతో పాటు తాజాగా యాక్టివేట్ అవుతున్న క్రెడిట్‌కార్డ్స్ డేటాను సేకరించి వినియోగదారులకూ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఫోన్లు చేసి వివరాలు తీసుకుంటున్నారు. ఆపై ఫర్‌గెట్ ఆప్షన్ ద్వారా వాళ్ల నెట్ బ్యాంకింగ్ ఖాతాలోకి ఎంటర్ అవుతున్నారు. అందుకు అవసరమైన ఓటీపీలను కస్టమర్లతోనే చెప్పిస్తున్నారు. అక్కడ వినియోగదారుడి ఈ-మెయిల్ ఐడీకి బదులుగా తమది అప్‌డేట్ చేస్తున్నారు. ఇలా చేయడంతో ఓటీపీలు ఈ ఐడీకే వస్తున్నాయి. ఆపై ఖాతాదారుల పేరుతో ప్రీ అప్రూవ్డ్ లోన్లు తీసుకుని ఆ మొత్తాలు తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. ఈ మొత్తంతో ఆన్‌లైన్‌లో సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం ఖరీదు చేస్తున్నారు. వీటిని డెలివరీ బాయ్స్‌కు నకిలీ గుర్తింపు కార్డులు చూపి తీసుకుంటున్నారు. తమకు పరిచయస్తులైన రితేష్ కుమార్, రోహిత్, సన్నీలకు బంగారాన్ని 65 శాతం, ఆభరణాలకు 60 శాతం, యాపిల్ ఫోన్లను 55 శాతం, ఆండ్రాయిడ్ ఫోన్లను రూ.50 శాతం రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ ముగ్గురు నేరగాళ్లు తమ ఉనికి బయట పడకుండా ఢిల్లీ నుంచి డెహ్రాడూన్, హరిద్వార్ తదితర ప్రాంతాలకు వెళ్లి యాక్సిస్ బ్యాంకు కస్టమర్లకు ఫోన్లు చేస్తున్నారు. రూ.4.71 లక్షలు కోల్పోయిన సైబరాబాద్ వాసి ఫిర్యాదుతో సైబర్ ఠాణాలో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన అధికారులు ఢిల్లీలో భూపేందర్, హిమాన్షు, సోనులను అరెస్టు చేసి తీసుకువచ్చారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ముఠాపై సైబరాబాద్‌లో 23, తెలంగాణలో 37, దేశ వ్యాప్తంగా 1292 కేసులు ఉన్నట్లు గుర్తించారు.

ఉద్యోగాలు ఇచ్చి..ఊడ్చేశారు

- పర్సనల్ లోన్ల కోసం బోగస్ పేర్లతో ఉద్యోగాలు
- తెలుగు రాష్ట్రాల్లోని సామాన్యుల పేర్లతో గుర్తింపులు
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పలు సంస్థలతో ఒప్పందం
- ఒక నెల మాత్రమే అనుమతించిన ఆయా సంస్థలు
- వీరి పేర్లతో వ్యక్తిగత రుణాలు తీసుకుని టోకరా
- 10 మంది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా బోగస్ సంస్థలు తెరిచి, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన సామాన్యులను తమ ఉద్యోగులుగా చూపించి, ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని, వీరి పేర్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.4.38 కోట్లు రుణం తీసుకుని మోసం చేసిన ముఠా గుట్టును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు సూత్రధారులతో సహా పది మందిని అరెస్టు చేశారు. నగరానికి చెందిన దీపక్‌రెడ్డి, రాజ్‌కుమార్ రెండు మ్యాన్‌పవర్ సంస్థల్ని ఏర్పాటు చేశారు. తమ సంస్థల్లో పని చేస్తున్నట్లు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన 59 మందిని చూపించారు. తొమ్మిది మంది దళారుల ద్వారా వారి వివరాలు, గుర్తింపుకార్డులను సేకరించారు. వీటి ఆధారంగా వారంతా తమ సంస్థల్లో ఉద్యోగులుగా దీపక్, రాజ్‌కుమార్ రికార్డులు సృష్టించారు. వీటి ఆధారంగా నగరానికి చెందిన మూడు ప్రముఖ సంస్థలకు వీరిని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మారుస్తూ, తమ ఆధీనంలోనే పని చేస్తారని ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో వీరు ఆయా సంస్థల పేరోల్స్‌లోకి చేరారు. వీరి కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో శాలరీ ఖాతాలు కూడా తెరిచారు. అయితే నిబంధనల ప్రకారం వీరి గత ఉద్యోగ వివరాలను మూడు సంస్థలకు అందించడంలో వారు విఫలం కావడంతో వీరితో ఒప్పందాన్ని ఆయా సంస్థలు రద్దు చేసుకున్నాయి. ఈ విషయంపై బ్యాంకుకు సమాచారం ఇవ్వకపోవడంతో అప్పటికే వీరికి సంబంధించిన ఒక నెల జీతం వారి శాలరీ అకౌంట్లలో పడటంతో పాటు పే స్లిప్స్ కూడా దీపక్, రాజ్‌కుమార్‌లకు చేరాయి. ఈ బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన ఏటీఎం కార్డులు, నెట్ బ్యాంకింగ్ వివరాలు ఈ ద్వయం తమ ఆధీనంలోనే ఉంచుకుంది. నెట్ బ్యాంకింగ్ వివరాలను వినియోగించిన దీపక్, రాజ్‌కుమార్ ఆ ఉద్యోగుల పేర్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి వ్యక్తిగత రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఈ-కేవైసీ వివరాలు, ఒక నెల పే స్లిప్స్ సైతం అందించారు. వీటిని చూసిన బ్యాంక్ సంతృప్తి చెంది ఒక్కొక్కరికీ రూ.38 లక్షల నుంచి రూ.49.5 లక్షల వరకు రుణం మంజూరు చేసింది. ఆ సందర్భంగా బ్యాంకు నుంచి వచ్చే ఓటీపీలు, వెరిఫికేషన్ కాల్స్‌కు స్పందించడానికి ఈ బ్యాంకు ఖాతాలతో అనుసంధానించి ఉన్న ఫోన్ నెంబర్లను దీపక్, రాజ్‌కుమార్ తమ వద్దే ఉంచుకున్నారు. ఇలా వారి బ్యాంకు ఖాతాల్లో పడిన వ్యక్తిగత రుణాల్లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖాతాదారులకు ఇచ్చారు. మిగిలింది వీళ్లే స్వాహా చేసి బ్యాంకు వాయిదాలు తామే చెల్లిస్తామని నమ్మించారు. అయితే బ్యాంక్‌కు వాయిదాలు చెల్లించకుండా మోసం చేశారు. ఇదే తరహాలో వీరు వివిధ బ్యాంకుల నుంచి రూ.20 కోట్ల వరకు తీసుకున్నట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు చేసి దీపక్, రాజ్‌కుమార్ సహా పది మందిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

పాఠశాల కిటికీ అద్దాలు ధ్వంసం

16 మంది ఏబీవీపీ కార్యకర్తలపై కేసు నమోదు

హఫీజ్‌పేట్ : రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ బంద్‌కు పిలుపునిచ్చిన సందర్భంగా సోమవారం ఏబీవీపీ కార్యకర్తలు చందానగర్, శేరిలింగంపల్లి పరిధిలోని పాఠశాలలు మూసి వేయించారు. ఈ నేపథ్యంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని శాంటా మారియా ఇంటర్నేషనల్ పాఠశాల తెరిచి ఉన్నట్లు తెలియడంతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. స్కూల్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ గార్డులతో వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. దీంతో ఆగ్రహానికి లోనైన వారు పాఠశాల భవనం అద్దాలు ధ్వంసం చేశారు. చందానగర్ పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 16 మంది ఏబీవీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శాంటా మారియా ఇంటర్నేషనల్ పాఠశాలలో ధ్వంసమైన అద్దాలు

‘తుక్కు’ డబ్బుల గొడవతోనే..

గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ

శంషాబాద్: తుక్కు సామాన్లు విక్రయించిన డబ్బుల పంపకంలో జరిగిన గొడవే కొత్తూరులో చోటు చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి(55) హత్యకు కారణంగా తేలింది. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, రాయచూర్‌కు చెందిన తెలుగు నాగప్ప ఇరవై రోజుల కిందట కాచిగూడకు వచ్చి అక్కడే నివాసముంటున్నాడు. ఇనుప సామాన్లు, తక్కు ఏరుకుని వాటిని విక్రయించేవాడు. ఈ నెల 23న రాత్రి అతడికి కొత్తూరులో గుర్తు తెలియని వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి చేగూరు సమీపంలోని స్క్రాప్ దుకాణంలో తాము సేకరించిన తుక్కును విక్రయించారు. డబ్బుల పంపకం విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. అప్పటికే ఇద్దరు మద్యం మత్తులో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి నాగప్పను కట్టెతో కొట్టడమేగాక డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరించాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత కొత్తూరు సమీపంలోని మెగాఫ్లోర్ మిల్ వద్ద అతను మరోమారు నాగప్పపై కర్రతో దాడి చేశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన నాగప్ప అతడి వద్ద ఉన్న కర్ర లాక్కుని చితకబాదాడు. అనంతరం తలపై రాయితో మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శంషాబాద్ ఏసీపీ భాస్కర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు ఆదివారం రాత్రి శంషాబాద్ పాలమాకుల వద్ద అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా మృతుడి వివరాలు గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు

డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగినందుకే..

- వ్యక్తి కిడ్నాప్‌నకు యత్నం
- నిందితుల అరెస్ట్

ఘట్‌కేసర్: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో డబ్బులిచ్చిన వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన కేసులో నింధితులను ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ పీఎస్‌లో మల్కాజ్‌గిరి డీసీపీ జానకీ, ఏసీపీ నరేశ్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. మేడిపల్లి, బుద్ధానగర్‌కు చెందిన అవినాశ్‌రెడ్డికి అదే ప్రాంతంలో ఉంటున్న అరోషికారెడ్డితో 2015 నుంచి పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో పలుమార్లు ఆమె అతడి నుంచి డబ్బులు అప్పుగా తీసుకుంది. డబ్బులు తిరిగి ఇవ్వాలని అవినాశ్‌రెడ్డి కోరగా పెళ్లి చేసుకుంటానని చెప్పిన అరోషికారెడ్డి ఈ విషయమై అతడి కుటుంబ సభ్యులతో కూడా చర్చించింది. అయితే 2018లో ఆమె పొరుగున ఉన్న చక్రధర్‌గౌడ్‌ను పెళ్లి చేసుకుంది. పెళ్లికి ముందే అవినాశ్‌రెడ్డి వద్ద రూ. 25 లక్షలు చేతిరుణం తీసుకున్న ఆమె 2023లో రూ. 9 లక్షలు తిరిగి ఇచ్చేసింది. 20 రోజులుగా మిగిలిన మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని అవినాశ్‌రెడ్డి ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో తన భార్య తీసుకున్న డబ్బును ఇచ్చేస్తానని చక్రధర్‌గౌడ్ అవినాశ్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పాడు. ఆదివారం ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో జాతీయ రహదారి సమీపంలోని వందన హోటల్ వద్దకు రావాలని సూచించాడు. మేడ్చల్ ఇందిరానగర్‌కు చెందిన ఎలిగేటి నర్సింగ్‌రావ్, సికింద్రాబాద్‌కు చెందిన బౌత్ వినోద్, అడిక్‌మెట్‌కు చెందిన మామిళ్ల గౌతమ్ రాజ్ కూడా అక్కడికి వచ్చారు. చక్రధర్ గౌడ్, అవినాశ్‌రెడ్డి కారులో కూర్చుని మాట్లాడుకుంటుండగా కారులోకి వచ్చిన మిగతా ముగ్గురు అవినాశ్‌రెడ్డిపై దాడి చేసి అతడి మొబైల్ లాక్కొని కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. వారి నుంచి తప్పించుకున్న అవినాశ్‌రెడ్డి ఘట్‌కేస్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ప్రధాన నిందితుడు చక్రధర్‌గౌడ్‌కు చెర్లపల్లి జైలులో నర్సింగరావుతో పరిచయం ఏర్పడింది. నర్సింగరావును బెయిల్‌పై బయటికి తీసుకువచ్చేందుకు చక్రధర్ సహకరించినట్లు పోలీసులు తెలిపారు. చక్రధర్‌గౌడ్‌పై సైబరాబాద్, హైదరాబాద్ కమిషనేరేట్లలో 9 కేసులు ఉండగా, నర్సింగ్‌రావు ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. గంటల వ్యవధిలో కేసును చేధించిన సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు సుధాకర్, అశోక్, శ్రీకాంత్, ఇతర సిబ్బందిని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకీ, ఏసీపీ నరేశ్‌రెడ్డి, చిత్రంలో నిందితులు

ఆదాయానికి గండి కొడుతున్నాడని..

- లిఫ్ట్ మెకానిక్‌ను హత్య చేసిన యజమాని
- ఈ నెల 21న అదృశ్యం...
- 24న కుషాయిగూడ పీఎస్‌లో ఫిర్యాదు..
- 26న మూసీలో మృతదేహం గుర్తింపు

కుషాయిగూడ: ఐదు రోజుల క్రితం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన లిఫ్ట్ మెకానిక్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శవమై తేలాడు. తనను మోసం చేస్తున్నాడన్న కోపంతో సంస్థ యజమానే అతడిని హత్య చేసి మూసీలో పారవేసినట్లు వెల్లడైంది. వివరాల్లోకి వెలితే.. మహారాష్ట్రకు చెందిన షేక్ మోసిన్‌పటేల్ (30) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేసేవాడు. నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చిన అతను ఏఎస్‌రావునగర్‌లోని సెరా లిఫ్ట్ రేస్‌బోవ్ కంపెనీలో మెకానిక్‌గా పనిలో చేరాడు. లిఫ్టులు రిపేరు చేసేందుకు వెళ్లే సమయంలో పరిచయమైన కస్టమర్లకు టచ్‌లో ఉంటూ కంపెనీతో సంబంధం లేకుండా నేరుగా ఆర్డర్లు తీసుకునేవాడు. ఈ విషయం తెలియడంతో కంపెనీ యజమాని రవి అతడిపై కోపం పెంచుకున్నాడు. పలుమార్లు వార్నింగ్ ఇచ్చినా అతను తన వైఖరి మార్చుకోలేదు. దీంతో తనను ఆర్థికంగా దెబ్బతీస్తున్న పటేల్ అడ్డు తొలగించుకోవాలని భావించిన రవి ఈ నెల 21న మరో ఇద్దరితో కలిసి అతడిని కారులో తీసుకెళ్లి మద్యం తాగించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం పటేల్‌తో గొడవ పెట్టుకున్న రవి, మరో వ్యక్తితో కలిసి అతడిపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం కారులో శవాన్ని తీసుకెళ్లి ఘట్‌కేసర్ వద్ద మూసీలో పారవేశారు. కాగా కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఈ నెల 24న అతడి తండ్రి గఫర్ పటేల్ కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసీ నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కుషాయిగూడ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి వెళ్లి పరిశీలించి మృతుడిని పాటిల్‌గా గుర్తించారు. నిందితులు స్వయంగా పోలీసులకు లొంగిపోవడంతోనే హత్య విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.



షేక్ మోసిన్ పటేల్ (ఫైల్)

భారీగా గంజాయి పట్టివేత

కుత్బుల్లాపూర్: కారులో తరలిస్తున్న 250 కేజీల గంజాయిని శంషాబాద్ ఎస్ఓటీ, మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, సీఐ రాజశేఖర్ రెడ్డి, సత్యనారాయణతో కలిసి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు... నల్లగొండ జిల్లాకు చెందిన రామావత్ మాత్యనాయక్ గంజాయిని సాగు చేస్తున్నాడు. అక్రమ మార్గంలో దానిని వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒడిసాకు చెందిన సీతారామ్, మహారాష్ట్రకు చెందిన శివలతో బేరం కుదుర్చుకున్న అతను ఎల్బీనగర్‌కు చెందిన డ్రైవర్ జె.తిరుపతి సహకారంతో 210 కిలోల గంజాయిని మహారాష్ట్రకు తరలించేందుకు సన్నాహాలు చేసుకున్నాడు. మేడ్చల్ చెక్ పోస్ట్ మీదుగా గుండ్ల పోచంపల్లి నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో శంషాబాద్ ఎస్ఓటీ, మేడ్చల్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కీలో గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్ తిరుపతిని అదుపులోకి తీసుకుని విచారించగా సీతారామ్, మాత్యనాయక్, శివ పేర్లు వెల్లడించాడు. ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను పట్టుకునేందుకు ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు.. కాగా ప్రధాన నిందితుడు రామావత్ నాయక్ పై ఇప్పటికే రాచకొండ , హైదరాబాద్, నల్లగొండ జిల్లాలో ఆరు కేసులు నమోదయ్యాయని, త్వరలోనే అతని అరెస్టు చేసి మరిన్ని వివరాలను రాబడతామని తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్ఓటీ సిబ్బంది, ఎస్ఐలు మురళి, రాజేశ్వర్ రెడ్డిలను డీసీపీ అభినందించారు.



నిందితుడు తిరుపతి



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె..

క్లుప్తంగా...

జూబ్లీహిల్స్ క్లబ్‌లో గొడవ

ఒకరిపై కేసు నమోదు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జూబ్లీహిల్స్ క్లబ్) సర్వసభ్య సమావేశంలో గొడవకు దిగిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ అధ్యక్షుడు సీవీ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటేశ్వర్లు అనే క్లబ్ సభ్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాలివీ... ఈ నెల 25వ తేదీన క్లబ్ హాల్‌లో సర్వసభ్య సమావేశం జరుగుతుండగా వెంకటేశ్వర్లు అనే సభ్యుడు సమావేశాన్ని సజావుగా సాగనివ్వకుండా అడ్డుకున్నాడు. ఇదేమిటని అడిగినందుకు క్లబ్ ఉద్యోగి వెంకయ్యపై చెయ్యి చేసుకున్నాడు. క్లబ్ సెక్రటరీ హన్మంతరావును బెదిరించడమే కాకుండా దుర్భాషలాడాడు. క్లబ్ సమావేశం ముందుకు సాగకుండా దూషణలకు దిగుతూ సమస్యగా మారాడు. ఎక్కడికక్కడ మీటింగ్‌ను అడ్డుకోవడమే కాకుండా అరగంట పాటు ప్రొసిడింగ్స్ ముందుకు సాగకుండా ఇబ్బందులకు గురి చేశాడు. దీంతో సీవీ రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వర్లుపై ఐపీసీ సెక్షన్ 341, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ చొరవతో వీధి దీపాల ఏర్పాటు


ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు చెబుతున్న జహంగీర్

రహమత్‌నగర్: ఎంఐఎం ఎమ్మెల్సీ చొరవతో తమ బస్తీలో వీధి దీపాలు ఏర్పాటు కావడంపై ఆశయ్యనగర్ బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోనాలు, బక్రీద్ పండగల నేపథ్యంలో ఎంఐఎం నాయకుడు షేక్ జహంగీర్ తదితరులు ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జారియాజ్‌హసన్‌కు కలిసి తమ బస్తీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులు లేఖ రాశారు. దీంతో విద్యుత్ సిబ్బంది బస్తీలోని వీధి దీపాలు ఏర్పాటు చేశారు. బస్తీ నాయకులు ఖాజామొహిద్దీన్, అబ్దుల్ నబీ, నాగేష్, రాజ్‌కుమార్‌లతో ఎమ్మెల్సీ మీర్జా రియాజ్‌హసన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చింతల కిశోర్‌కుమార్ కోరారు. జూన్ 1వ తేదీ నుంచే కళాశాలల తరగతులు ప్రారంభం అయ్యాయని పాఠాలు బోధించేందుకు అధ్యాపకుల సర్వీసులను రెన్యువల్ చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన శాంతాకుమార్

బంజారాహిల్స్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... కర్ణాటక బీదర్ జిల్లా బాల్కి శివాజీ చౌక్ ప్రాంతానికి చెందిన శాంతాకుమార్(28) ఉపాధి కోసం నగరానికి వచ్చి టోలిచౌకి రాహుల్ కాలనీలో ఎంఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం శాంతాకుమార్ బృందావన్ కాలనీ మోరెన్ కేఫ్ బేకరీ వద్ద రోడ్డు దాటుతుండగా టీఎస్ఆర్టీసీ ఏపీ 29 జడ్ 2798 నెంబర్ బస్సు నిర్లక్ష్యంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో శాంతాకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. బర్కత్‌పుర డిపోకు చెందిన బస్సు డ్రైవర్ ఇ. జగ్గరాజు నిర్లక్ష్యంతోనే ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుందని బాధితుడి స్నేహితుడు విష్ణుజాదవ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలమండలి సేవలు భేష్



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి విచ్చేసిన లక్షలాది మందికి మంచినీరు సరఫరా చేయడంలో జలమండలి అధికారులు ఎంతో శ్రమించారని రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ అన్నారు. సోమవారం చీఫ్ మేనేజర్ ప్రభు, జీఎం హరిశంకర్, మేనేజర్లు మౌనిక, హర్షిణి, కృపాకర్‌తో పాటు ఇతర సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం చుట్టూ 10 గుడారాలను ఏర్పాటు చేసి దర్శనానికి వచ్చిన వారికి మినరల్ నీటిని పంపిణీ చేశారని తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు చల్లని వాటర్ బాటిళ్లను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమరేశ్వరి, విజయశ్రీ, అమరావతి, నాగేంద్రమ్మ, లీలావతి, నాగరాజు పాల్గొన్నారు.

మేం చూస్కుంటాం.. మీరు చేసేస్కోండి!


ఇందిరానగర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం గల్లీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు (ఫైల్)

కొంతమంది నాయకుల తీరుతో బస్తీల్లో నివసించే పేద, మధ్య తరగతి ప్రజలు నిండా మునుగుతున్నారు. ఈ లీడర్ల వల్ల కొన్ని చోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా, మరికొన్ని చోట్ల బడుగులు నిండా మునిగి న్యాయం కావాలంటూ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

- ప్రభుత్వ పథకాల్లో లబ్ధి చేకూరుస్తామంటూ పేదలకు ఎర
- డబ్బులు చెల్లించి నష్టపోతున్న బడుగులు
- అధికారులనూ అడ్డదారులు తొక్కిస్తున్న లీడర్లు

బంజారాహిల్స్: డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తామని కొందరు, దళిత బంధు ఇప్పిస్తామని కొందరు, అక్రమ నల్లా కనెక్షన్లు ఇప్పిస్తామని కొందరు, తాజాగా బీసీ బంధు, రేకుల నివాసాలకు రూ. 3 లక్షల ఆర్థిక సాయం ఇప్పిస్తామని బడుగుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. బాధితులు బయటికి చెప్పుకోలేక, చెప్పుకుంటే పరువు పోతుందనే భయంతో న్యాయం జరగక దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లుతున్నారు. ఒక వైపు బస్తీవాసులు వీరి అరాచకాలతో ఇబ్బంది పడుతుంటే మరో వైపు వీరి వల్ల ఆయా పార్టీల నాయకత్వానికి కూడా తలనొప్పిగా మారింది. ప్రజాప్రతినిధులు పలు సందర్భాల్లో మైకులు పట్టుకొని మరీ ఎవ్వరికీ రూపాయి లంచం ఇవ్వొద్దని చెబుతున్నా కొంతమంది ఇవేవి వినిపించుకోకుండా నష్టపోతున్నారు.

సీసీ రోడ్డు వేస్తే పండగే...

ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ సీసీ రోడ్డు వేసినా స్థానికంగా ఉన్న లీడర్ల జేబులు పుష్కలంగా నిండుతున్నాయి. ఒక వైపు మంచి ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు వేయిస్తుంటే స్థానికంగా ఉండే బస్తీ లీడర్లు మాత్రం ఇటు కాంట్రాక్టర్లను, అటు స్థానికంగా ఉండే నివాసితుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు.

- తాజాగా బంజారాహిల్స్ రోడ్‌నెం. 2లోని ఇందిరానగర్‌లో ఉన్న చాలా వీధుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. దీంతో ఇదే రోడ్డులో చాలా కాలంగా నివాసం ఉంటున్న వారికి పాత ఆఫ్ ఇంచ్ నల్లా కనెక్షన్ స్థానంలో పెద్ద సైజు పైపు వేయిస్తామని కొందరు, ఒక కనెక్షన్ ఉన్నవారికి రెండో కనెక్షన్ ఇప్పిస్తూ కొందరు ఇష్టారాజ్యంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.
- క్షేత్ర స్థాయిలో ఉన్న జలమండలి సిబ్బందికి సైతం ఆశజూపి వారి యథేచ్ఛగా పనులు చేసుకుంటున్నారు.
- ఏమైనా అంటే మేం చూస్కుంటాం.. మీరు పని చేస్కోండి అంటూ దగ్గరుండి మరీ పనులు చేయిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది.
- ఒక్కో వాటర్ లైన్‌కు రూ. 45 వేల నుంచి 60 వేలకుగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.
- ఇందిరానగర్‌లో కొంత కాలంగా ఈ తంతు జరుగుతున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారు. కొన్ని డివిజన్లలో పనులు చేయాలంటేనే లీడర్ల ధాటికి మా వల్ల కాదు బాబోయ్ అంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు.

కాంట్రాక్టర్‌నూ వదలని వైనం...

ఇందిరానగర్‌లో తాజాగా సీసీ రోడ్డు వేస్తున్న క్రమంలో ఓ స్తంభం విరిగిపడేందుకు సిద్ధంగా ఉంది. గుర్తించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి స్తంభాన్ని మార్పించారు. అయితే కొంత మంది లీడర్లు సీసీ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్‌ను ఈ స్తంభాన్ని మార్చేందుకు రూ. 15 వేలు ఖర్చు అయ్యిందంటూ వసూలు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే సీసీ రోడ్డు వేసే పరిస్థితి ఉండదని, బిల్లులు త్వరగా రావని భావించిన కాంట్రాక్టర్ వారికి రూ. 15 వేలు ఇచ్చి తన పని తాను చేసుకున్నాడు.

డబుల్ బెడ్‌రూమ్‌లు ఇప్పిస్తామంటూ...

బంజారాహిల్స్ రోడ్‌నెం. 2 ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళను నమ్మి అదే బస్తీలో నివసించే ఎనిమిది మందికి పైగా మహిళలు నిండా మునిగారు.

- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పిస్తామని మభ్యపెట్టడంతో వారు ఒక్కొక్కరు సుమారు రూ. 8 లక్షలకుగాపై చెల్లించారు. తీరా డబుల్ బెడ్‌రూమ్ నివాసాల ప్రారంభోత్సవం రోజున తాము మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ఇంత వరకు న్యాయం జరగలేదు. లీడర్లను నమ్ముకొని తాము నిండా మునిగామని లబోదిబోమంటున్నారు. సదరు మహిళా లీడర్ మాత్రం తనకేమీ సంబంధం లేదని తాను మధ్యవర్తిగా మాత్రమే ఉన్నానని తనకు ఏపాపం తెలియదని తప్పించుకోవడం గమనార్హం.

మూడు నాకు.. ఏడు నీకు...

దళిత బంధు పథకంలో సైతం లీడర్లు గద్దల్లా వాలిపోయి ఒక్కో లబ్ధిదారుడి వద్ద రూ. 3 లక్షలకుపైగా తీసుకున్నట్లు సమాచారం. ఒక్క ఫిలింనగర్‌లోని ఎనిమిది మంది వరకు రూ. 3 లక్షలు చెల్లిస్తేగానీ దళితబంధు పథకానికి అర్హులుగా చేయలేదని బాధితులు వాపోయారు. బస్తీల్లో ఉండే నిజమైన లబ్ధిదారులు నేరుగా ఎమ్మెల్యే వద్దకు, అధికారులకు వద్దకు వెళ్లలేని వారిని గుర్తించి ఈ లీడర్లు వారి వద్దకు తీసుకెళ్లి ఇలా అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. మరో గమ్మత్తైన విషయం ఏంటంటే పక్క నియోజకవర్గానికి చెందిన యువకుడికి దళిత బంధు పథకాన్ని ఇప్పించి ఔరా అనిపించం కొసమెరుపు.

మత్తు.. యువత భవిత చిత్తు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉమాశంకర్ తదితరులు


సంతకాలు సేకరిస్తున్న ఎంజీఎం స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: డ్రగ్స్, మత్తు పదార్థాలను వాడకూడదని, వాటికి బానిసలైతే యువత ఉజ్వల భవిష్యత్ బుగ్గిపాలవుతుందని ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయ సూపరింటెండెంట్, డీటీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమాశంకర్ పేర్కొన్నారు. సోమవారం ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యసనం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మత్తుపదార్థాల బాధితుల పట్ల వివక్ష కాకుండా వాటి నుంచి ఎలా బయటపడాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఓ స్టాల్‌ను ఏర్పాటు చేసి మత్తుపదార్థాల నష్టాల పట్ల అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలను బానిసలు కావొద్దని, జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. డాక్టర్ పీసీబీ గుప్తా, డాక్టర్ శిరీష, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఉష, డాక్టర్ అనిత, డాక్టర్ సింధూరి, డాక్టర్ రఘువీర్, డాక్టర్ మధులిక, డాక్టర్ విశ్వాస్, డాక్టర్ ఫణికాంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ

వెంగళరావునగర్: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత పెడదోవ పడుతోందని ఎంజీఎం స్కూల్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యూసుఫ్‌గూడలోని ఎంజీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్, యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ కళాశాలతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి సంతకాలను సేకరించారు. మాదక ద్రవ్యాలు వాడకండి, జీవితాలను అర్థాంతరంగా ముగించుకోకండి, విలువైన జీవితాలను నాశనం చేసుకోకండి, సమాజానికి పునాదులైన యువతీ యువకులు మేల్కోండి అంటూ నినాదాలు చేశారు. టీచర్లు సబిత, ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అన్నిరంగాల్లో అభివృద్ధి


బీఎస్ మక్తాలో పర్యటిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

పంజగుట్ట: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ నగరం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఖైరతాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం సోమాజిగూడ డివిజన్ బీఎస్ మక్తాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మక్తాలోని పోచమ్మ ఆలయాయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీఎస్ మక్తావాసులు అక్కడ అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. స్పందించిన ఆయన తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పండగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రహమత్‌నగర్(బోరబండ): పండగలను ప్రశాంత వాతవరణంలో ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకోవాలని బోరబండ ఇన్‌స్పెక్టర్ కామల్ల రవి కుమార్ సూచించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి పీఎస్‌లో ముస్లిం మొహల్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బక్రీద్ పండగప్పుడు మాంసం వ్యర్థాలను రోడ్లపై పడవేయకుండా ప్లాస్టిక్ కవర్లలో వేసి జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య ఆటోల్లో వేయాలన్నారు. ఇతర మతాలను కించపరిచేలా ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. సెక్టార్ ఎస్ఐలు మహేష్, సప్నారెడ్డి, తుల్జారాం, డీఐ సర్దార్‌జమాల్, ముస్లిం నాయకులు, బస్తీ అధ్యక్షులు, మత పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

బాల గాన గంధర్వులు సీజన్–3 విజేతగా కీర్తన


విజేతలతో సింగర్ రేవంత్

బంజారాహిల్స్: ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంకు నివాళిగా నగరంలోని మొట్టమొదటి మ్యూజిక్ రేడియో స్టేషన్ మ్యూజిక్ 106.4 ఎఫ్ఎం ఆధ్వర్యంలో బాల గాన గాంధర్వులు సీజన్–3 పోటీలు నిర్వహించారు. కొండాపూర్‌లోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్ వేదికగా జరిగిన ఈ పోటీ గ్రాండ్ ఫినాలే అద్భుతంగా వీనుల విందుగా కొనసాగింది. ఇండియన్ ఐడోల్–9 విన్నర్ ప్రముఖ గాయకుడు రేవంత్, సాహితీ చాగంటి, ధనుంజయ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బాలూ జయంతి రోజు ప్రారంభించిన ఈ సంగీత పోటీల్లో వందల మంది ఔత్సాహిక బాల బాలికలు పాల్గొని తమ ప్రతిభనుచాటుకున్నారు. 15 ఏళ్లలోపు బాల బాలికలు పోటీ పడగా వారిలో టాప్–5 సింగర్స్‌ను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. చిన్నారులంతా బాలూ పాటలతో ఆద్యంతం ఆనందపరిచారు. ఈ పోటీల్లో కీర్తన విన్నర్‌గా నిలవగా ఉజ్వల్, సాహితీ రెండో రన్నరప్‌గా నిలిచారు. కార్యక్రమానికి ఆర్‌జే నాని, ఆర్‌జే రవళి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వెంగళరావునగర్: భార్యాభర్తల గొడవల మధ్య తప్పిపోయిన బాలుడు తిరిగి పోలీసుల సాయంతో తల్లిదండ్రులకు చేరిన ఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్ బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో నివసించే సంధ్య, సంజీవలు భార్యాభర్తలు. వీరు తరచూ ఇంట్లో గొడవ పడుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. చుట్టుపక్కల వారు దాదాపు గంట తర్వాత చుట్టుపక్కల వారు వారి గొడవను సర్ది చెప్పారు. ఈ వ్యవధిలో వారి కుమారుడు క్రాంతి కుమార్(3) తప్పిపోయాడు. ఏడుస్తూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఎలా తప్పిపోయాడో తెలియక తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు, బంధువులు రాత్రంతా వెదికారు. ఈ విషయాన్ని మధురానగర్ పోలీసులకు తెలియజేశారు. సోమవారం రహమత్‌నగర్‌లోనే మరో ప్రాంతానికి చెందిన బంగార్రాజు, అనిల్‌కుమార్ అనే వ్యక్తులు ఆ బాబును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ బాల్‌రాజు బాలుడి తల్లిదండ్రులను పిలిపించి.. మందలించి వారి కుమారుడిని వారికి అప్పగించారు. తప్పిపోయిన బాబును తిరిగి ఇచ్చిన పోలీసులకు, స్థానికులకు ఆ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇందిరానగర్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల పర్యటన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని ఇందిరానగర్‌లో సోమవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. బూత్ నెంబర్ 134లో ఇంటింటికీ వెళ్లి తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి: సీపీఎం

వెంగళరావునగర్: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని సీపీఎం జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుల ఆర్. అశోక్ డిమాండ్ చేశారు. మధురానగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదన్నారు. ఇప్పటికే ఇళ్ల కోసం పెట్టుకున్న దరఖాస్తులన్నింటినీ పరిశీలించాలని, కొత్తవారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. డబుల్ ఇళ్ల కోసం జూలై 3న ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్ వద్ద నున్న జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇల్లులేని నిరుపేదలందరూ ఆందోళనలో పాల్గొనాలని ఆయన కోరారు.

అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

లిబర్టీ: తెలంగాణ రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ వెల్లడించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దళిత బహుజన పార్టీకి ఎన్నికల గుర్తుగా కప్పు సాసర్ కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు విన్నవించామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి దళిత బహుజన అభ్యర్థులను చట్ట సభల్లోకి పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అప్పుడే దళిత బహుజనులకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర ముఖ్య సలహాదారులు డాక్టర్ వి.ఎల్.రాజు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు వసంతపాటిల్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న దిడ్డి సుధాకర్

ఆప్‌లో పలువురికి చేరిక

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పేదల పక్షాన లేదని కార్పొరేట్ వర్గాల పక్షాన ఉందని విమర్శించారు. సోమవారం లిబర్టీ వద్ద ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, అనుబంధ ఆటో కార్మిక నాయకులు, కార్యకర్తలు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సుధాకర్ ఆహ్వానించారు. ఆప్ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ సల్మాన్, రాజు, ఆప్ తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్ష మల్లేష్, ఫారూఖ్, ప్రవీణ్‌యాదవ్, రాకేష్‌సింగ్, హైదర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నేతలు


పార్టీలో చేరిన వారితో విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 4లోని సుఖ్‌దేవ్‌నగర్ బస్తీకి చెందిన బీజేపీ నాయకులు విజయ్, మురళి, వంశీతో పాటు పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం విజయారెడ్డి మాట్లాడుతూ... రోజురోజుకు కాంగ్రెస్ పార్టీ పట్ల యువత పెద్దగా ఆకర్షితులవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

పంజగుట్ట: అనుమతులు లేకుండానే యూనివర్సిటీల పేరుతో బోర్డులు పెట్టి అడ్మిషన్లు తీసుకుని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న గురునానక్, శ్రీనిధి, కావేరి, నిక్‌మార్ లాంటి ఇంజినీరింగ్ కాలేజీల నిర్వాహకులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ జన సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇలాంటి కాలేజీల ఫీజుల దాహానికి విద్యార్థులు బలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకున్నా యూనివర్సిటీల పేరుతో కాలేజీలు నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖామంత్రి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో ప్రభుత్వం ఇప్పటికీ మౌళికవసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించక విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వెంటనే పెండిగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. కార్పొరేట్ కాలేజీలు ఫీజులు దండుకుంటున్నాయని ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, నరహరి గౌడ్, బోలానాధ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ స్థలం కబ్జా యత్నాన్ని అడ్డుకోండి


బస్తీ కమ్యూనిటీ హాల్ స్థలం వద్ద మాట్లాడుతున్న బస్తీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: బస్తీకి సంబంధించిన భూమిని కొందరు అధికారులతో మ్యూటేషన్‌ను చేయించుకొని ఆ స్థలాన్ని కబ్జాచేసేందుకు కుట్ర చేస్తున్నారని ఎల్లారెడ్డిగూడ సంజయ్‌గాంధీనగర్ వెల్ఫేర్ అసోషియేషన్ నేతలు గొంటి శ్రీనివాసయాదవ్, కుమార్ చౌదరి యాదవ్, కిరణ్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం సంజయ్‌గాంధీనగర్ అంగన్‌వాడీ, కమ్యునిటీ హాల్ స్థలం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... 1975లో దివంగత పి.జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో నిర్మాణాన్ని చేపట్టారని, లే అవుట్‌లో కూడా కమ్యూనిటీ హాల్ స్థలంగానే ఉందన్నారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని, ఇది బస్తీ స్థలమని, అయితే కొందరు తమ స్థలమని అక్రమంగా అక్రమించుకొనేందుకు అధికారులతో కలిసి కొన్ని పత్రాలు సృష్టించారని తెలిపారు. బస్తీవాసులమైన తమపై అక్రమ కేసులు వేశారని, ఈ స్థల విషయాన్ని కోర్టులో తమ వాదనను సమర్పించామని చెప్పారు. ఈ విషయమై తమ వద్ద ఉన్న ఆధారాలను మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తోపాటు రెవెన్యూ అధికారులు, సీఎం క్యాంప్ ఆఫీస్‌కు విన్నవించామని తెలిపారు. కోర్టులో కేసే తేలేవరకు స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బస్తీ పెద్దలు లక్ష్మణ్, సాయినాథ్‌యాదవ్, కుందన్ యాదవ్, నాగరాజు, హరీష్‌యాదవ్ పాల్గొన్నారు.

కోర్టు సమయం ముగిసేదాకా నిల్చోవాలి

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 8 మందికి న్యాయస్థానం జరిమానాలు విధించింది. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు వివరాలు వెల్లడించారు... ఇటీవల బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 8 మందిని సోమవారం నాంపల్లిలోని 6వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపర్చారు. వీరందరికీ రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. కాగా చార్మినార్‌కు చెందిన ఆటో డ్రైవర్ అక్బర్‌ఖాన్(30)కి బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో 198 బీఏసీ పాయింట్లు రావడంతో అతడికి కోర్టు సమయం ముగిసేదాకా కోర్టు హాల్‌లో నిల్చోవాలంటూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

ఆకతాయిల ఆటకట్టు

పలు ప్రాంతాల్లో న్యూసెన్స్ చేస్తున్న 39 మందిపై కేసుల నమోదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బస్తీల్లో న్యూసెన్స్‌కు పాల్పడటంతో పాటు రోడ్లపై మద్యం సేవించడం, గంజాయి తాగడం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 39 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్‌నెం 14లోని నందినగర్, వెంకటేశ్వర నగర్, ఉదయ్‌నగర్, జహీరానగర్, సింగాడకుంట తదితర బస్తీలలో రాత్రయితే చాలు పెద్ద సంఖ్యలో ఆకతాయిలు రోడ్డు పక్కన గుంపులుగా చేరి మద్యం సేవించడం, గంజాయి తాగుతూ రోడ్డుపై వెళ్తున్న వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. పలు మార్లు ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులపై దాడులకు సైతం వెనకాడటం లేదు. ఇలాంటి వారిని కట్టడి చేసేందుకు బంజారాహిల్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ముగ్గురు ఎస్ఐలు కరుణాకర్‌రెడ్డి, నవీన్ రెడ్డి, రవీందర్‌లు ప్రత్యేకంగా రంగంలోకి దిగి ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు వీధులు, బస్తీల్లో అవారాగా తిరుగుతున్న 39 మంది ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. రెండోసారి రోడ్లపై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

క్లుప్తంగా...

ఈపీఎఫ్‌ఓ అధిక పెన్షన్ దరఖాస్తు గడువు పొడిగింపు

- చందాదారుల విజ్ఞప్తులతో మరో 15 రోజులు అవకాశం
- జూలై 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఉమ్మడి ఆప్షన్ ఇచ్చే వెసులుబాటు

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్ కోసం ఉమ్మడి ఆప్షన్ సమర్పణకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) మరో అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో జాయింట్ ఆప్షన్ సమర్పణ గడువును వచ్చే నెల 11వ తేదీ వరకు పొడిగించింది. ఈపీఎఫ్‌ఓ సర్వర్ సమస్యలు, ఇతర సాంకేతిక ఇబ్బందులతో జాయింట్ ఆప్షన్ ఇవ్వలేకపోయామంటూ క్షేత్రస్థాయి నుంచి పెద్ద సంఖ్యలో చందాదారులు ఫిర్యాదు చేశారు. వీటికి తోడు అధిక పెన్షన్ అంశంలో ఈపీఎఫ్‌ఓ కొన్ని సవరణలు చేసింది. ఈ క్రమంలో దరఖాస్తు కోసం మరింత ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. దీనితో క్షేత్రస్థాయి డిమాండ్‌కు అనుగుణంగా ఈపీఎఫ్‌ఓ ఉమ్మడి దరఖాస్తుకు మరో అవకాశం ఇచ్చింది. వాస్తవానికి తొలుత మే 3వ తేదీ వరకే గడువు ఇవ్వగా.. తర్వాత జూన్ 26వ తేదీ వరకు, తాజాగా జూలై 11 వరకు పొడిగించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారంతా ఈ పక్షం రోజుల్లో దరఖాస్తు సమర్పిస్తే సరిపోతుంది.

ప్రపంచానికి ‘యోగి’లను అందిస్తాం: రాందేవ్



హరిద్వార్: యోగాతో ప్రపంచానికి మరింత ఆరోగ్యాన్ని అందించేందుకు పతంజలి యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్‌లో ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి యూనివర్సిటీలకు వెళ్తారని స్వామి రాందేవ్‌బాబా అన్నారు. అన్ని హద్దులను చెరిపేసి ఇప్పుడు హిందూ, ముస్లిం, సిక్కు, క్రిస్టియన్, జైన్, బుద్ధిస్టులందరూ దేశమంతటా యోగా చేస్తున్నారని తెలిపారు. యోగావల్ల దేశప్రతిష్ట ఇప్పుడు విశ్వవ్యాప్తిమయ్యిందన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి వెల్‌నెస్ సెంటర్‌లోని పతంజలి యోగాపీఠ్ మైదానంలో యోగా సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందేవ్.. పలువురు యోగా సాధకులను ఉద్దేశించి ప్రసంగించారు.

గూడు చెదిరి.. గుండెలవిసి!

అంతర్గాంలోని బర్మా, శ్రీలంక కాందిశీకుల దీనావస్థ

1971 నాటికి 1,000 కుటుంబాలకు ఇక్కడ పునరావాసం

1989లో దేశవ్యాప్తంగా నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాల పంపిణీ

అంతర్గాంలో 502 ఎకరాలు కేటాయించినా సొంతింటికి నోచుకోని వైనం

వెయ్యికిగాను ఇప్పుడు మిగిలింది 374 కుటుంబాలే..

తమకైనా కనీసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని వినతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్

ప్రాణభయంతో ఓ దేశం నుంచి మరో దేశానికి వలస వెళ్లే వారిని కాందిశీకులు అంటారు. ఇలాంటి వారికి పరాయిగడ్డపై ఆశ్రయం దొరకడమే గగనం. దొరికినా వారికి పెద్దగా హక్కులు ఉండవు. కానీ బ్రిటిష్ పాలనలో పని కోసం మన దేశం నుంచి పొరుగున ఉన్న బర్మా (మయన్మార్), శ్రీలంకలకు వలసవెళ్లి అక్కడ సైనిక నియంతల హెచ్చరికలు, అంతర్యుద్ధాల కారణంగా తిరిగి భారతదేశానికి వచ్చిన కాందిశీకులది మరో కథ. వెళ్లిన కొన్నేళ్ల తర్వాత మాతృ దేశంలో బిక్కుబిక్కుమంటూ అడుగుపెట్టిన వారిని భారత్ తల్లిలా అక్కున చేర్చుకుంది. వారికి పునరావాసం కల్పించింది. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం అంతర్గాంలో వెలసిన శరణార్థుల కాలనీలో తెలుగు వారికి కేంద్రం పునరావాసం కల్పించింది. ఇలాంటి వారందరికీ దేశవ్యాప్తంగా..ఇళ్లు, వ్యవసాయ స్థలాలు పంపిణీ చేసినా అంతర్గాంలో మాత్రం ఇంకా ప్రభుత్వ హామీలు నెరవేరలేదు. తమకు కనీసం ఇళ్లైనా మంజూరు చేయాలని వారు దీనంగా వేడుకుంటున్నారు.

అసలు ఏం జరిగింది?



లాల్ బహదూర్ శాస్త్రి-సిరిమావో బండారు నాయకేల ఇండో, శ్రీలంక ఒప్పందం 1964 (ఫైల్)

19వ శతాబ్దంలో దేశంలో విపరీతమైన కరువు వచ్చింది. ఈ కరువును ఎదుర్కొనే ప్రయత్నాలు చేయకుండా మన దేశంలోని పేదలను బర్మా, శ్రీలంక, మలేసియా తదితర దేశాల్లో తోటల్లో పనిచేసేందుకు కూలీలుగా పంపారు. అలా గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర నుంచి వేలాదిమంది బర్మాకు వలస వెళ్లారు. అక్కడ వ్యాపారాలు, పనులు చేసి రూ.కోట్లు గడించారు. అయితే 1962లో బర్మాలో సైనిక నియంత నె విన్ తిరుగుబాటుతో ప్రభుత్వం కుప్పకూలింది. పగ్గాలు చేపట్టిన నె విన్ విదేశీయులు కట్టుబట్టలతో దేశం విడిచి వెళ్లాలంటూ హుకూం జారీ చేశాడు. సైనికులు భారతీయుల ఇళ్లను దోచుకున్నారు. కనీసం మెడలో తాళిబొట్టును కూడా అనుమతించలేదు. అయితే అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆధ్వర్యంలో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు భారత సంతతి ప్రజలను దేశానికి తీసుకొచ్చి దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. ఈ తరలింపు లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ హయాం వరకు పలు దఫాలుగా సాగింది. వీరితో పాటే శ్రీలంకలో జాతుల మధ్య పోరు వల్ల ఇండియాకు వచ్చిన తమిళులకూ చోటు ఇచ్చారు. ఇలా 1971 నాటికి అంతర్గాంలో దాదాపు 1,000 బర్మా, శ్రీలంక కుటుంబాలు ఆశ్రయం పొందాయి. 1989లో దేశవ్యాప్తంగా ఇలాంటి వారికి నాలుగెకరాల భూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇదే క్రమంలో అంతర్గాం కాందిశీకులకు కేంద్రం 502 ఎకరాల భూమి కేటాయించింది. ప్రత్యేకంగా వీవింగ్ సొసైటీని ఏర్పాటు చేసి జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు తెరిచి ఉపాధి కల్పించింది. అప్పట్లో తెరిచిన మిల్లులు అధికారుల అవినీతి కారణంగా 1990వ దశకంలో మూతబడ్డాయి. కార్మికులకు కనీసం వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా రాలేదు. ఉపాధి కోల్పోవడంతో ఆకలి మరణాలు సైతం సంభవించాయి. కొన్ని కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా.. ప్రస్తుతం ఇక్కడ 374 కుటుంబాలు మాత్రమే మిగిలాయి. కానీ ఇప్పటికీ భూమి, ఇళ్ల స్థలాలకు సంబంధించిన హామీ మాత్రం నెరవేరలేదు.

తమ సంక్షేమానికి కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లులు మూతబడ్డాయని, కేటాయించిన 502 ఎకరాల్లో 250 ఎకరాలైనా తమ కుటుంబాలకు కేటాయించాలని అంతర్గాంలో ఉన్న కాందిశీకులు కోరుతున్నారు. వాస్తవానికి 2009 సెప్టెంబర్ 1న ఇళ్ల స్థలాల విషయమై అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వీరు కలిశారు. దీంతో వెంటనే అందరికీ పట్టాలు ఇవ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆ మరునాడే వైఎస్ హెలీకాప్టర్ ప్రమాదంలో మరణించడంతో, ఇప్పటివరకు వీరి గోడు పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దాదాపు 100 ఎకరాలు ఇండస్ట్రియల్ పార్కు కోసం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు కేటాయించిన భూములు కబ్జాలకు గురవుతున్నాయని, తొలుత తమకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి పదిగుంటల నివాస స్థలం ఇచ్చాకే, పరిశ్రమలు స్థాపించాలని శరణార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ స్థాపించబోయే పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనలో బర్మా, శ్రీలంక శరణార్థుల కుటుంబాలకే తొలి ప్రాధాన్యం కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు అప్పట్లో పునరావాసం కోసం ఏర్పాటు చేసిన క్వార్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతు చేసుకుందామంటే స్థానిక అధికారులు అంగీకరించడం లేదు. కనీసం ఉన్న గూడుకు మరమ్మతులు చేసుకునే అవకాశం కల్పిస్తే..శరణార్థుల కుటుంబాలు తలదాచుకునేందుకు అవకాశం ఉంటుందని శ్రీలంక, బర్మా శరణార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జమ్ముల రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇండస్ట్రియల్ పార్కులో కొలువులివ్వండి..



‘మార్గదర్శి’లాంటి స్కాం ఇప్పటివరకు జరగలేదు

- మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదే
- విచారణ వివరాలు తెలుసుకునే హక్కు వారికి ఉంది
- తెలంగాణ హైకోర్టుకు తెలిపిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లాంటి కుంభకోణం ఇప్పటివరకు జరగలేదు, ఇకపై జరగబోదని ఏపీ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు తెలిపింది. ‘మార్గదర్శి’కి సంబంధించిన కేసులపై సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని వెల్లడించింది. మార్గదర్శి కేసు దర్యాప్తు వివరాలను సీఐడీ అధికారులు మీడియాకు వెల్లడిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరుతూ చెరుకూరి రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రై. లిమిటెడ్ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి అక్రమ మార్గాల్లో తరలించిన సొమ్మంతా ఖాతాదారులదేనని చెప్పారు. ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం విచారణ వివరాలు తెలుసుకునే ప్రాథమిక హక్కు వారికి ఉందన్నారు. ఈ రకమైన ఓ కుంభకోణం జరగడం ఇదే తొలిసారిని చెప్పారు. ఇదే విజ్ఞప్తిపై గతంలోనూ ఇదే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అప్పుడు పిటిషనర్‌కు అనుకూలంగా ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ పిటిషన్‌ను కూడా కొట్టివేయాలని కోరారు. అసలు మార్గదర్శి వేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు ఉందా అన్న అంశంపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పిటిషన్ జూలై 18న విచారణకు రానుందని, అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను జూలై 20కి వాయిదా వేసింది.

ఐటీ ఎగుమతుల్లో బూమ్

ఏపీలో నాలుగేళ్లలో 34 శాతం పెరిగిన ఎగుమతులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు గత నాలుగేళ్లుగా వేగంగా విస్తరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో పలు ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభిస్తుండటంతో ఐటీ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి నమోదవుతోంది. స్టాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), వీసెజ్‌ల్లో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా 2022–23లో రాష్ట్రంలో రూ.1,649.25 కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు జరిగినట్లు ఐటీ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇందులో ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ కంపెనీల ద్వారా రూ.972.43 కోట్ల ఎగుమతులు జరగగా వీసెజ్ కంపెనీల ద్వారా రూ.676.82 కోట్ల ఎగుమతులు జరిగాయి.

రూ.5,000 కోట్లపైనే!

2019–20లో ఏపీ నుంచి రూ.1,087.4 కోట్ల ఐటీ ఎగుమతులు నమోదు కాగా నాలుగేళ్లలో 34% పెరిగాయి. నాలుగేళ్లలో ఎస్‌టీపీఐ కంపెనీల ద్వారా ఎగుమతులు రూ.846.77 కోట్ల నుంచి రూ.972.43 కోట్లకు పెరిగితే వీసెజ్ ద్వారా ఎగుమతులు రూ.240.63 కోట్ల నుంచి 676.82 కోట్లకు చేరుకున్నాయి. ఇంకా పలు ఐటీ కంపెనీల ఆడిటింగ్ పూర్తికాలేదని, ప్రాథమిక సమాచారం మేరకు 2022–23 ఐటీ ఎగుమతుల అంచనాలను రూపొందించినట్లు ఐటీ శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రం నుంచి భారీగా ఎగుమతులు జరుగుతున్నా వాటి ప్రధాన కార్యాలయాలు ఇక్కడ లేకపోవడంతో రాష్ట్ర పరిధిలోకి రావడం లేదని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) ప్రెసిడెంట్ శ్రీధర్ కోసరాజు పేర్కొన్నారు.

ఆర్నెల్లలో వరుసగా..

ప్రభుత్వ ప్రోత్సాహంతో పలు ఐటీ కంపెనీలు విశాఖతోపాటు పలు ద్వితీయ శ్రేణి పట్టణాల్లో తమ కార్యాలయాలను ప్రారంభిస్తున్నాయి. 2019కి ముందు రాష్ట్రంలో ఐటీ కంపెనీల సంఖ్య 178 కాగా ఇప్పుడు 372కి చేరుకోవడం గమనార్హం. కొత్తగా ఏర్పాటైన కంపెనీల ద్వారా అదనంగా 20,000కి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు ‘అపిటా’ గ్రూపు సీఈవో ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి చెప్పారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం: సోము వీర్రాజు

చిల్లకూరు(తిరుపతి జిల్లా)/చిత్తూరు కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో అందరూ అనుకున్నట్లు టీడీపీతో పొత్తు పెట్టుకునేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని పారిచెర్లవారిపాళెంలో సోమవారం కేంద్ర ఐటీ సహాయ మంత్రి దేవూసిన్హ్ చౌహాన్‌తో కలసి ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పొత్తులతో అధికారంలోకి రాదని, అందుకే రాష్ట్రంలో టీడీపీతో ఎలాంటి పరిస్థితుల్లో పొత్తు పెట్టుకోకూడదని అనుకుంటున్నట్లు తెలిపారు. అయి తే జనసేనతో మాత్రం కలసి నడుస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వద్దు ప్యాకేజీ చాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారని సోమువీర్రాజు స్పష్టం చేశారు. చంద్రబాబు అమరావతిలో తాత్కాలిక రాజధాని నిర్మించారని ఆరోపించారు. బాబు పాలనలో సోమవారం పోలవరం అని కాలక్షేపం చేశారన్నారు.

నగర వార్తలు

వైఈఏ నూతన కార్యవర్గం



వైఈఏ నూతన కార్యవర్గ సభ్యులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో ఒక దశాబ్దాన్ని పూర్తి చేసుకున్న యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (వైఈఏ) నూతన బోర్డు సభ్యులను ఎన్నుకుంది. 2023–24 సంవత్సరానికి నాయకత్వం వహించే సభ్యుల్లో అధ్యక్షుడిగా సుభాకర్ ఆలపాటి, జనరల్ సెక్రటరీగా సత్యజిత్‌రెడ్డి, యశ్వంత్ నాగ్, అమన్ చైనాని, ఆర్.సి.రాహుల్, ఆశిష్ కపూర్, చేతన్ అగర్వాల్ ఉన్నారు. ఈ లైనప్ అంతా విజయవంతమైన స్టార్టప్ ఆవిష్కరణల సంపదను వైఈఏ అభివృద్ధి ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సుభాకర్ ఆలపాటి మాట్లాడుతూ... యువ పారిశ్రామికవేత్తలకు ఇదొక మంచి వేదిక అన్నారు. కొత్త బోర్డు సభ్యులను ఆహ్వానిస్తూ ఈ ఏడాది ఇటలీకి అంతర్జాతీయ రెట్రీస్ కోసం సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ ఏడాది కూడా బహుళ ఈవెంట్లు నిర్వహించబోతున్నామని అన్నారు. అంతర్జాతీయ ఈవెంట్లను నిర్వహించడం ద్వారా తిరుగులేని శక్తిగా రూపొందుతామని స్పష్టం చేశారు.

విద్యార్థులు సమ సమాజ స్థాపనకు పోరాడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



కూనంనేనికి జ్ఞాపికను అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

బోడుప్పల్: విద్యార్థులు తమ తరగతి పుస్తకాలతో పాటు సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బోడుప్పల్ ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ... విద్యార్థులు సమాజాన్ని కూడా చదివి అనేక రుగ్మతలపై పోరాడాలన్నారు. స్వాతంత్ర పోరాటంలో విద్యార్థులు, యువకులను ఏకం చేసి తెల్లదొరలను తరిమిన చరిత్ర ఏఐఎస్‌ఎఫ్‌కు ఉందన్నారు. ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. ప్రజల కోసం పోరాడే కవులు, కళాకారులు, రచయితలపై ఉపా కేసులు పెట్టి వేధిస్తుందన్నారు. అనంతరం మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి మాట్లాడుతూ... విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్.బాలమల్లేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు అశోక్ స్టాలిన్, రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఆఫీస్ బేరర్స్ రామకృష్ణ, రెహమాన్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

- తెలుగు అకాడమీ వద్ద ఖాళీగా ఉన్న 250 గజాల ప్రభుత్వ భూమి
- షెడ్డు వేసి ఆక్రమణకు పాల్పడ్డ వైనం
- ఇద్దరిపై నారాయణగూడ పీఎస్‌లో తహసీల్దార్ ఫిర్యాదు

హిమాయత్‌నగర్: నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ భూమిపై ఇద్దరు వ్యక్తులు కన్నేశారు. కొంతకాలంగా ఖాళీగా ఉంటోందని, కోర్టులో కేసు నడుస్తుందనే పొంతన లేని సమాధానాలు చెబుతూ వారు ఓ షెడ్డును నిర్మించారు. ఈ నేపథ్యంలో దాదాపు రూ. 5 కోట్ల విలువైన ఆ స్థలం కబ్జాకు గురవుతోందని గమనించిన స్థానికులు హిమాయత్‌నగర్ తహసీల్దార్ మల్లేష్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన తహసీల్దార్ ప్రభుత్వ భూమిని ఇద్దరు వ్యక్తులు కబ్జాకు పాల్పడ్డారంటూ రెండు రోజుల క్రితం నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షెడ్డు నిర్మించి ఆక్రమణకు...

హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమీ సమీపంలో సుమారు 250 గజాల స్థలం ప్రభుత్వానికి చెందిందని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ‘దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టూ గవర్నమెంట్’ అనే బోర్డును సైతం హిమాయత్‌నగర్ రెవెన్యూ యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఈ స్థలంలో చెత్తాచెదారం ఉండటంతో పాటు చాలాకాలంగా ఖాళీగా ఉందని గ్రహించిన సత్యనారాయణ, రఘులు దీనిపై కన్నేశారు. వినాయకుడి విగ్రహాలను ఈ స్థలంలో తయారు చేయొచ్చనే ఆలోచనతో ఇక్కడ ఓ షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. స్థానికులు, ఉన్నతాధికారుల నుంచి సమాచారం తెలుసుకున్న హిమాయత్‌నగర్ తహసీల్దార్ మల్లేష్ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు విఠల్‌వాడీకి చెందిన సత్యనారాయణ, రఘు అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

కొనసాగుతున్న మామిడి సీజన్

బాటసింగారం మార్కెట్‌కు నిత్యం 8 వేల క్వింటాళ్ల మామిడి

- జూలై ఆఖరి వరకూ రానున్న పంట
- క్వింటాలు రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు ధర పలుకుతున్న వైనం
- సీజన్ ఆఖరిలోనూ ధర పిరిమే...



సాక్షి, సిటీబ్యూరో: మామిడి సీజన్ కొనసాగుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఈ నెల 26వ తేదీ వరకూ నిత్యం బాటసింగారం మార్కెట్‌కు రోజు 8 క్వింటాళ్ల నుంచి 10 వేల క్వింటాళ్ల మామిడి పంట దిగుమతి అవుతున్నట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. గతేడాది జూన్ చివరి వారం నుంచి మామిడి దిగుమతులు చాలా తగ్గాయి. అయితే ఈ ఏడాది ఇప్పటికీ కర్ణాటక, తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి బంగినపల్లి రకం మామిడి దిగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా ఏటా ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్కెట్‌కు మామిడి రాక ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది మార్చి మూడవ వారం వరకు కూడా పూర్తి స్థాయిలో మామిడి సీజన్ ప్రారంభం కాలేదు. మామిడి కాపు సమయానికి రాకపోవడంతో ఈ సారి సీజన్ నెల రోజులు ఆలస్యమైంది. ఏప్రిల్ ప్రారంభం నుంచి మామిడి సీజన్ పూర్తి స్థాయిలో ప్రారంభం అయిందని వ్యాపారులు తెలిపారు. మరోవైపు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ లలో ఆకాల, వడగళ్ల వర్షాల ప్రభావం మామిడి సీజన్‌పై పడింది. దీంతో తొలుత మామిడి దిగుమతులు తక్కువగా వచ్చినా తర్వాత పెరిగినట్లు కమీషన్ ఏజెంట్లు అంటున్నారు. జూన్‌లో దిగుమతులు చూస్తుంటే ఈ ఏడాది జూలై ఆఖరి వరకు కూడా కొనసాగే అవకాశం ఉని మార్కెట్ వర్గాల అంచనా. సీజన్ చివరి దశలో కూడా ధరలు మాత్రం అధికంగానే ఉంటున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో మామిడి క్వింటాలు రూ. 4 వేల నుంచి రూ. 5 వేల ధర వరకు పలుతోంది. జూలై 15 తర్వాత కూడా మామిడి ఇలాగే మార్కెట్‌కు దిగుమతి అయ్యే అవకాలు కన్పిస్తున్నాయని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్థిక సంస్కరణలతో పీవీ ఆదర్శం

చిక్కడపల్లి: ఆర్థిక సంస్కరణలతో సంక్షోభాన్ని నివారించిన దార్శనికుడు దివంగత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు అని... అంతరాలు, అసమానతలు లేని సమాజం కోసం ఏ పదవిలో ఉన్నా కృషి చేసి పాలనారంగాల వారికి ఆదర్శప్రాయంగా నిలిచారని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి.దేవీప్రసాద్‌రావు అన్నారు. త్యాగారాయ గానసభ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ... మౌనసముద్రంతోనే పలు సమస్యలను పరిష్కరించిన మేధావి పీవీ అని కొనియాడారు. బహుభాషా పండితులు అయినా తెలుగుదనం ఉట్టిపడేలా పంచకట్టుతో దేశాన్ని ఇదేళ్లపాటు నిరాటకంగా నడిపించిన ఆయన గురుకుల విశ్వవిద్యాలయాలు, బడుగు బలహీన వర్గాలకు కమిషన్ ఏర్పాటు... ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూసంస్కరణలు వంటి విప్లవాత్మక నిర్ణయాల ఫలితాలు నేటికీ అనుభవంలో ఉన్నాయని వివరించారు. విశ్రాంత జిల్లా జడ్జి కాశీ విశ్వేశ్వరరావు, ధర్మపురి సంస్కృతి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సంగసభట్ల నరసయ్య, బీఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవీప్రసాద్

కస్తూర్బా టీచర్లను కొనసాగించాలి: ఆర్.కృష్ణయ్య

ఖైరతాబాద్: కస్తూర్బా పాఠశాలలో పనిచేసే 937 మంది టీచర్లను తొలగించడం అన్యాయమని, వీరిని హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాని డిమాండ్ చేస్తూ సోమవారం టీచర్లతో కలిసి పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముట్టడించారు. నిరుద్యోగ జాక్ చైర్మన్ నీల వెంకటేష్ నాయకత్వంలో నిర్వహించిన ముట్టడి కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... 2021లో కస్తూర్బా పాఠశాలలో పనిచేసేందుకు 937 మంది కాంట్రాక్ట్ టీచర్లను నియమించారన్నారు. వీరు రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నాన్నారు. వీరిని ఏటా తొలగించి తిరిగి కొత్తగా నియమిస్తే సుప్రీం కోర్టు తీర్పును ధిక్కరించడమే అవుతుందన్నారు. గత నవంబర్ నుంచి పనిచేస్తున్న 937 మంది టీచర్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ పోస్టుల్లో కొత్తవారిని నియమించడం నిబంధనలకు విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాత వారినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి మన ఊరు, మన బడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, విద్యా ప్రమాణాలు పెంచడానికి రూ. 7200 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యా ప్రమాణాలతో కూడిన విద్యను పేద వర్గాలకు అందించడానికి ముఖ్యమంత్రి శ్రద్ధ తీసుకుంటుంటే విద్యాశాఖ అధికారులు టీచర్లను తొలగించుకుంటూ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేయడం తగదని ఆర్.కృష్ణయ్య హితవు పలికారు. ముట్టడి కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేష్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అంజి, ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, బీసీ సంఘ నాయకుడు సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఎం.పృథ్వీగౌడ్, నేతలు సతీష్, మల్లేష్ యాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి కార్మికుడి దుర్మరణం

మల్లాపూర్: గోడ కూలి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్ కర్నూలుకు చెందిన దామర్ల తిరుపతయ్య(45) బతుకు దెరువు కోసం ఎనిమిదేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. హెచ్‌బీకాలనీ చైతన్య నగర్ కాలనీలో ఉంటూ కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం నాచారం పారిశ్రామిక వాడలోని ప్రిట్‌రా కంపెనీలో గోడలను కూల్చేందుకు ఐదుగురు కార్మికులతో కలసి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా గోడ తిరుపతయ్య మీద పడింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయం కావడంతో తిరుపతయ్యను హుటాహుటిన నాచారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తిరుపతయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరువుతున్నారు.

ముగిసిన ఇఫ్లూ వీసీ సురేష్‌కుమార్ పదవీ కాలం

ఉస్మానియా యూనివర్సిటీ: ది ఇంగ్లిష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వీసీగా ఆరు సంవత్సరాలుగా కొనసాగుతున్న ప్రొఫెసర్ సురేష్‌కుమార్ పదవీ కాలం ఈ నెల 23న ముగిసింది. ఓయూ ఇంగ్లిష్ విభాగానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకులు ప్రొఫెసర్ సురేష్ కుమార్ ఇఫ్లూకు ఆరు సంవత్సరాలుగా వీసీగా పని చేశారు. నిబంధనల ప్రకారం సెంట్రల్ వర్సిటీల వీసీ పదవీ కాలం ఐదు సంవత్సరాలు కాగా సురేష్‌కుమార్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు పొడిగించింది. పొడిగించిన పదవీ కాలం కూడా పూర్తి కావడంతో ప్రస్తుతం ఇఫ్లూ వీసీ ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో ఏడాది సురేష్‌కుమార్ పదవీ కాలాన్ని పొడిగిస్తారా... లేదా కొత్త వీసీని నియమిస్తారా...? అనే విషయం ఇఫ్లూ క్యాంపస్‌లో చర్చనీయంగా మారింది.

తెలంగాణ దేశ ప్రజలను ఆకర్షిస్తోంది: బోయినపల్లి



ఉస్మానియా యూనివర్సిటీ: సరికొత్త రికార్డులతో తెలంగాణ రాష్ట్రం దేశ ప్రజలను ఆకర్షిస్తోందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఓయూ క్యాంపస్‌లోని ఐపీఈ ఆడిటోరియంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్–ఎస్‌ఆర్‌సీ (జాతీయ సామాజిక శాస్త్రాల అధ్యాయన కేంద్రం) గోల్డెన్ జూబకలీ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి, సామాజిక సమూహాల సాధికారత–తెలంగాణ రాష్ట్ర అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందంర్ అధ్యక్షత వహించగా వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ... రాష్ట్రంలో విద్య, కుల వృత్తుల ఆధారిత పథకాలు, మహిళా సాధికారత, నీటి పారుదల, వ్యవసాయం, విద్యుత్తు ఉత్పత్తి, అటవీ అభివృద్ధి తదితర అంశాలపై క్షుణంగా మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రైతులను ప్రోత్సహిస్తూ అధిక దిగుబడితో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని రైస్ బౌల్ మార్చారన్నారు. రాబోవు రోజుల్లో తెలంగాణ రాష్ట్రం సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఐసీఎస్ఎస్ఆర్ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ ధనుంజయ్ సింగ్, ఓయూ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఇటీవల మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన మిసెస్ గ్రాండ్ సీ వరల్డ్ 2023 (29-40 ఏళ్లలోపు పెళ్లైన మహిళలకు నిర్వహించే కాంటెస్ట్) పోటీల్లో హైదరాబాద్ వాసి శ్రీమతి మహతి కౌమారి 2వ స్థానం దక్కించుకుంది. మలేషియా దక్షిణాఫ్రికా సహా 15 దేశాల నుంచి 45 మంది మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం రావడం గురించి, తనను తాను కొత్తగా మెరుగు పరుచుకునే విధానాల గురించి వివరించింది మహతి కౌమారి. 'మన పరిధిని విస్తరించుకుంటేనే అవకాశాలు పెరుగుతాయి, ఏ కిరీటాలైనా దక్కుతాయి' నవ్వుతూ వివరించింది.

నాతో నేనే పోటీ పడ్డాను..!


● మహతి కౌమారి

''సొంతంగా ఎదగాలన్న ఆలోచనే ఈ రోజు నన్ను ఎల్లలు దాటేలా చేసింది. పదేళ్లు ఐటీ కంపెనీలలో వర్క్ చేశాను. పెళ్లి, ఇద్దరు పిల్లలు, కుటుంబం.. జీవితం ఒక దశ నుంచి మరో దశకు తీసుకెళుతూనే ఉంది. దీనితోపాటు నా కలలను కూడా తీర్చుకునే క్రమంలో నాతో నేనే పోటీపడుతుంటాను.

కాలేజీ రోజుల నుంచి నా డ్రెస్సులు నేనే స్వయంగా డిజైన్ చేసుకునేదాన్ని. రీ స్టైలింగ్ మీద ఎక్కువ ఆసక్తి చూపేదాన్ని. ఆ తర్వాత ఉద్యోగం చేస్తూ కూడా నా ఈ అలవాటు మానుకోలేదు. నా స్నేహితులు, సహోద్యోగులు నా డ్రెస్సింగ్ గురించి అడిగేవారు. వాళ్లూ తమకు డ్రెస్‌లు డిజైన్ చేయమని కోరేవారు. అలా మా బంధుమిత్రుల్లో అడిగిన వారికి నాకున్న ఖాళీ సమయాన్ని కేటాయించి డిజైన్ చేసిచ్చేదాన్ని. నేను డిజైన్ చేసిచ్చిన డ్రెస్సుల్లో వారిని చూసినప్పుడు చాలా ఆనందం కలిగేది.

సొంతంగా డిజైనింగ్ స్టూడియో

పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. కుటుంబం, ఉద్యోగం అనే వ్యాపకాలు ఉన్న నాకు సొంతంగా నా డిజైన్ స్టూడియో పెట్టుకుంటే బాగుంటుందని ఆలోచన పెరగడానికి నా డిజైన్స్ ఇష్టపడే బంధుమిత్రులే కారణం. మా కుటుంబం కూడా ఆమోదం తెలపడంతో ఉద్యోగం వదిలి, డ్రెస్ డిజైనింగ్‌లోకి వచ్చేశాను. ఎనిమిదేళ్లుగా డిజైనింగ్ స్టూడియో నడుపుతున్నాను. మొదట ఇద్దరికి ఉద్యోగాలు ఇచ్చిన నేను, ఇప్పుడు పదిహేనుమందికి ఉపాధి చూపించగలుగుతున్నందుకు ఆనందంగా ఉంది. ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు క్లాసులు కూడా ఇస్తుంటాను.

బ్యూటీ కాంటెస్ట్‌తో మరో అడుగు

'తెలిసిన వారికి వర్క్ చేసిస్తే సరిపోదు, నేను చాలామందికి రీచ్ అవ్వాలి. ఎక్కువ మంది మహిళలకు పని కల్పించేలా నన్ను నేను మలుచుకోవాలి..' ఈ ఆలోచన నన్ను అవకాశాల కోసం వెతికేలా చేసింది. ఆన్‌లైన్‌లో మిసెస్ బ్యూటీ కాంటెస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్ చూసినప్పుడు నా స్కూల్, కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నాను. కాంటెస్ట్‌లో పాల్గొనడానికి ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్నాను. మన దేశం నుంచే కాదు మరో పదిహేను దేశాల నుంచి చాలామంది మహిళలు ఈ పోటీలకు అప్లై చేసుకున్నారు. ఇంటర్వ్యూ తర్వాత మన దేశం నుంచి నేను ఎంపిక అయ్యాను. రెండు నెలలు ప్రత్యేక శిక్షణ తీసుకుని, పోటీల్లో పాల్గొన్నాను.

ఇప్పుడు నాకు విదేశాలలోనూ స్నేహితులు పెరిగారు. పోటీలకు వచ్చిన వారందరితోనూ మంచి స్నేహం ఏర్పడింది. దీంతో నాకున్న అవకాశాలను వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తున్నాను'' అని వివరించి ఈ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

> **మనసును సేదతీర్చేలా...**
> కర్ణాటక సంగీతం నాకున్న మరో హాబీ. కుటుంబం, బిజినెస్ బాధ్యతలు ఎన్ని ఉన్నా నాకు ఇష్టమైన సంగీతాన్ని నిత్యం సాధన చేస్తూనే ఉంటాను. హాబీస్‌కి నాకంటూ కొంత సమయం కేటాయించుకోవడంలో ఏ మాత్రం అలక్ష్యం చేయను. పిల్లలు కూడా నా ఇష్టాలను ప్రోత్సహిస్తుంటారు.



బ్యూటిప్స్

● జుట్టు పొడిబారి నిర్జీవంగా ఉంటే పెరుగు మంచి ఫలితాన్నిస్తుంది. ఒక కప్పు పుల్లటి పెరుగు తీసుకోవాలి. జుట్టును చిక్కులేకుండా దువ్వి పెరుగును ఒక్కొక్క స్పూన్ తల మీద వేస్తూ వేళ్లతో మర్దన చేయాలి. తలంతా ప్రతి వెంట్రుక కుదురుకూ పెరుగు పట్టాలన్న మాట. ఓ అరగంట తర్వాత వేడినీటితో తల స్నానం చేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే జుట్టు చిట్లిపోకుండా మృదువుగా, ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. వేళ్లతో తలంతా మర్దన చేసుకోవడం సాధ్యం కాకపోతే జుట్టు కుదుళ్లకు పెరుగును పట్టించిన తర్వాత గుండ్రటి పళ్లున్న దువ్వెనతో పది నిమిషాల సేపు దువ్వితే సరిపోతుంది.

● జుట్టు రాలుతుంటే బంగాళా దుంప రసం బాగా పని చేస్తుంది. బంగాళాదుంపను తురిమి రసం తీసుకోవాలి. అరకప్పు రసంలో రెండు టేబుల్ స్పూన్‌ల కలబంద గుజ్జు కలిపి తలకు పట్టించాలి. జుట్టుకు పైన రాసి సరిపుచ్చకూడదు. కేశాల మొదళ్లకు పట్టేలా రాసి పది నిమిషాల సేపు మర్దన చేయాలి. రెండు గంటల తర్వాత వేడి నీటితో తల స్నానం చేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తుంటే జుట్టురాలడం తగ్గిపోతుంది.



అన్నపూర్ణలు

ఆకలికి వైద్యం అన్నం పొట్లం

హాస్పిటల్‌లోని పేషెంట్లకు వైద్యులు వైద్యం చేస్తారు. కాని వారి ఆకలికి ఎవరు వైద్యం చేస్తారు? కేరళలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పేషెంట్ల కోసం, వారిని చూసుకుంటూ ఉండిపోయిన బంధువుల కోసం ఎందరో గృహిణులు వంట చేస్తారు. 'అన్నం పొట్లం' కట్టి అందిస్తారు. ఇలా దాదాపు రోజూ 40 వేల అన్నం పొట్లాలు అక్కడి యూత్ ఫెడరేషన్ ద్వారా నిత్యం సరఫరా అవుతూనే ఉంటాయి.


● సేకరించిన అన్నం పొట్లాలు పంచుతున్న డీవైఎఫ్‌ఐ కార్యకర్తలు

ఉదయాన్నే లేచిన సౌమ్య ఆఫీసుకు వెళ్లే భర్త కోసం క్యారేజీ కట్టే హడావిడిలో ఉంది. అలాగే పిల్లలకు కూడా లంచ్ బాక్సులు కట్టాలి. ఒకటిన్నర గ్లాసుల బియ్యం పడేస్తే సరిపోతాయి. కాని ఆమె ఆ రోజు రెండు గ్లాసులకు పైనే వండింది. భర్తకు, పిల్లలకు కట్టగా తను తినాల్సింది గిన్నెలో పెట్టి మిగిలింది పొట్లంగా కట్టింది. అన్నంతో పాటు పప్పు, పచ్చడి, తాలింపు, ఒక ఆమ్లెట్టు... చక్కగా అరిటాకులో వేసి న్యూస్‌పేపర్‌లో చుట్టింది. ఆ పొట్లాన్ని కాసేపటికి ఒక కార్యకర్త వచ్చి సేకరించుకుని వెళ్లాడు. అలా ఆ కార్యకర్త ఆ వీధిలో అన్నం పొట్లం కట్టమని చెప్పిన ఇళ్లన్నింటికీ వెళ్లి అన్నం పొట్లాలను సేకరించాడు. ఇలా సేకరించినవి మధ్యాహ్నానికి ఊళ్లోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుతాయి. లోపల ఉన్న పేద పేషెంట్లకూ వారి కోసం బయట కాచుకుని ఉన్న అటెండర్ల కోసం పంచుతారు. 'ఏ తల్లి కట్టిచ్చిన అన్నమో' అని తిన్నవారు ఆ గృహిణులను ఆశీర్వదిస్తారు. ఇలా కేరళలో గృహిణుల వల్ల గత నాలుగేళ్లుగా రోగుల ఆకలి తీరుతోంది. వారి ఆరోగ్యం బాగుపడుతోంది.



ఇంటి నుంచి ఆస్పత్రికి

కేరళలోని డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) 2017లో 300 అన్నం పొట్లాలు సేకరించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా ఉండే పెద్దాస్పత్రులకు పంచే కార్యక్రమం మొదలు పెట్టింది. దీనికి వారు పెట్టిన పేరు 'హృదయపూర్వం పొత్తిచోరు'. అంటే 'హృదయపూర్వకంగా అన్నం పొట్లం'. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు అన్నం కొనుక్కునే స్తోమత అన్ని వేళలా ఉండదు. అలాగే వారిని చూసుకోవడానికి వచ్చే బంధువులు కూడా అన్నం కొనుక్కోలేరు. పేదవారు ఇలా బాధపడుతుంటే చూస్తూ ఊరుకోవడమేనా అని డివైఎఫ్ఐ కార్యకర్తలకు అనిపించింది. 'ప్రతి ఇంట్లోనూ ఓ అమ్మ అన్నం వండుతుంది. ఒక గుప్పెడు అదనంగా వండమని కోరుదాం. ఒకరికి భోజనం పొట్లం కట్టి ఇవ్వమని అడుగుదాం. ఇస్తారు' అని స్త్రీల కరుణ మీద ఉండే విశ్వాసంతో ధైర్యంగా రంగంలోకి దిగారు. కార్యక్రమ ప్రారంభం రోజున 300 అన్నం పొట్లాలు వచ్చాయి. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 40,000 అన్నం పొట్లాలు పంపిణీ అవుతున్నాయి.


● అన్నం పొట్లం

పకడ్బందీగా సేకరణ

కేరళ అంతా డివైఎఫ్ఐ కార్యకర్తలు ఉన్నారు. వారు తమ తమ ఊళ్లలో ఎన్ని అన్నం పొట్లాలు అవసరమో లెక్కించి తమ ఏరియాలో ఉన్న గృహిణులను ముందు రోజే రిక్వెస్ట్ చేస్తారు. మరుసటి రోజు మధ్యాహ్నం అన్నం పొట్లం ఇవ్వమంటారు. అలా ఒకోరోజు ఒక ఏరియాలో కొన్ని ఇళ్లను ఎంపిక చేసుకుని అడుగుతారు. మళ్లీ ఆ ఇళ్లలోని గృహిణులను అడగడానికి వారం పదిరోజులు పట్టొచ్చు. అందుకని స్త్రీలు సంతోషంగా అన్నం పొట్లం కట్టి ఇస్తారు. కొందరు స్త్రీలు రెండు మూడు పొట్లాలు కట్టిచ్చి సంతోష పడతారు.

సారీ అంకుల్!

ఈ అన్నం పొట్లాల పంపిణీలో ఎన్నో ప్రేమమయ సంఘటనలు కూడా ఉన్నాయి. ఒకరోజు ఒక రోగికి తన వంతుగా అందిన అన్నం పొట్లంలో చిన్న చీటీ కనిపించింది. అందులో ఇలా ఉంది. 'అంకుల్.. అమ్మకు వీలు కాలేదు. నేనే స్కూల్‌కు వెళ్లే హడావిడిలో వంట చేశాను. అంత రుచిగా లేవు. క్షమించండి. మీరు తొందరగా కోలుకోండి' అని ఒక అమ్మాయి రాసింది. దానిని అందుకుని ఆ రోగి ఆ చీటిని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తూ 'బంగారుతల్లీ... నువ్వు పంపిన భోజనం ఎంతో రుచిగా ఉంది. మెతుకు మెతుకులో నీ ప్రేమ ఉంది' అని రాశాడు.

అన్నం పొట్లం కట్టివ్వడానికి అమ్మలాంటి స్త్రీలు ఎందరో ఉంటారు. చేయవలసిందల్లా ప్రయత్నమే.

సాగుబడి
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

తక్కువ ఖర్చుతో నాలుగు నెలల్లో కోతకు వచ్చే మెట్ట వరి సాగు చేపడితే రైతులకు ఆర్థికంగానే కాకుండా అనేక ఇతర ప్రయోజనాలు కూడా నెరవేరుతాయని నిపుణులు చెబుతున్నారు. సేంద్రియ మెట్ట వరి సాగుపై జనగామ జిల్లా లింగాల గణపురం మండలం జీడికల్ గ్రామంలో ఇటీవల రైతులకు శిక్షణ ఇవ్వటంతో పాటు క్షేత్రస్థాయిలో సీడ్ డ్రిల్‌తో విత్తనం వేసి చూపించారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ), సుస్థిర వ్యవసాయ కేంద్రం(సిఎస్ఎ), ఆదర్శ ఎనబావి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ, డా. రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్ట వరి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సిఎస్ఎ సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ ద్వారా సేంద్రియ మెట్ట వరి సాగు తీరుతెన్నుల గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

సేంద్రియ మెట్ట వరి సాగు మేలు


● మెట్ట వరి పొలం

● ట్రాక్టరుకు అనుసంధానం చేసిన సీడ్ డ్రిల్‌తో మెట్ట వరి విత్తుకోవాలి



● 8 వరుసల సీడ్ డ్రిల్


● మెట్ట వరి సాగు చేసిన మహిళా రైతు

సాంప్రదాయ పద్ధతిలో దమ్ముచేసి నాట్లు వేసి నీరు నిల్వగట్టడం వలన అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు మూడు వారాలు ఆలస్యం కావడంతో మెట్ట వరి సాగు వైపు రైతులు దృష్టిసారిస్తున్నారు. మెట్ట వరి సాగు వలన అనేక లాభాలు ఉన్నాయి. అధిక కూలీల ఖర్చు, భూగర్భ జలాల వినియోగం ఎక్కువ కావటం, భూమి చౌడుబారడం, మిథైన్ విషవాయువు విడుదలై వాతావరణం వేడెక్కడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం మెట్ట వరి సాగు.

- బోర్ల కింద వరి సాగు చేసే రైతులకు మెట్ట వరి సాగు అనువైనది. దీర్ఘకాలిక(180 రోజుల) పంట అయిన పత్తి సాగు నచ్చక కొందరు రైతులు మెట్ట వరి సాగు చేపడుతున్నారు. స్వల్ప, మధ్యకాలిక(120–140 రోజులు) సన్నరకం వరి రకాలను మెట్ట పొలాల్లో ఆరుతడి పంటగా సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.
- సాధారణ వరి సాగులో భూసారం దెబ్బతినటమే కాకుండా చౌడుబారుతుంది. చౌడు వల్ల నీరు నిల్వ ఉండి, కలుపు సమస్య తీవ్రమవుతుంది. సాధారణ వరి సాగుతో పోల్చినప్పుడు నీటి వాడకాన్ని, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి మెట్ట వరి పద్ధతి ఉపకరిస్తుంది. సేంద్రియ పద్ధతులు పాటించి మెట్ట వరి సాగు చేస్తే మరింత ప్రయోజనం.
- మెట్ట వరి సాగు వల్ల 60–70% కూలీల ఖర్చు తగ్గుతుంది. నారుమళ్లు పోయటం, నాట్లు వేయటం ఉండదు కాబట్టి కూలీల అవసరం, ఖర్చు భారీగా తగ్గుతాయి. మహిళా రైతులు బురదలో నడుము వంచి చేయాల్సిన చాకిరీ తప్పుతుంది. వారి పాదాలు బురదలో నానాల్సిన అవసరం ఉండదు కాబట్టి ఆరోగ్యంగా ఉంటారు.
- పంట వేరు వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది కాబట్టి పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. నీటిలో నిల్వగట్టే పద్ధతిలో వేరు వ్యవస్థ బలహీనంగా ఉంటుంది కాబట్టి చీడపీడల బెడద కూడా ఎక్కువ.
- మెట్ట వరి సాగుకు నల్లరేగడి నేలలు అనువు కాదు. ఎర్ర నేలలు లేదా మధ్యస్థ నేలలు అనుకూలం. సేంద్రియ పద్ధతుల్లో సాగుకు దుక్కిలో ఎకరానికి 4 క్వింటాళ్ల పశువుల ఎరువు వేసి, అజోటోబాక్టర్‌తో విత్తన శుద్ధి చేసి, ఆ తడి ఆరిన తర్వాత విత్తుకోవాలి.
- మెట్ట పద్ధతిలో ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన సీడ్ డ్రిల్ ద్వారా లేదా ఎద్దులతో గొర్రు ద్వారా వరుసలుగా వరిని పొడి నేలలో విత్తుకోవాలి. వరుసల మధ్య అడుగు దూరం ఉంటుంది. 8 వరుసలు విత్తే పెద్ద సీడ్ డ్రిల్ ద్వారా గంట సేపట్లోనే ఎకరంలో విత్తనం వేసే పనిని పూర్తి చేయొచ్చు. ఎకరానికి 10–15 కిలోల విత్తనం సరిపోతుంది.
- దుక్కి, చదును చేసి పొడి మట్టిలో విత్తుకోవాలి. విత్తనం 2 అంగుళాల లోతులో పడాలి. అంతకన్నా లోతులో వేస్తే మొలక శాతం తగ్గుతుంది. విత్తిన తర్వాత 4–5 రోజులు వర్షం పడకపోయినా పర్వాలేదు. మట్టిలో తేమ పూర్తిగా ఆరిపోకుండా చూసుకోవాలి. మరీ అవసరమైతే నీటి తడి ఇవ్వాలి.
- సేంద్రియ మెట్ట వరిలో 40–45 రోజుల వరకు కలుపు మొలుస్తుంటుంది. సైకిల్ గొర్రు, వీడర్లతో కలుపును అదుపులో ఉంచాలి. నల్లరేగడి, చౌడు నేలల్లో కలుపు నిర్మూలన కష్టం. ఎర్ర నేలల్లో కలుపు తీయటం తేలిక.
- వర్షాధార వరి సాగులో మట్టిలో తేమ ఆరిపోకుండా చూసుకోవాలి. పంట మధ్యలో ఎక్కువ రోజులు వర్షం పడకపోతే నీటి తడి ఇవ్వాలి. ముఖ్యంగా పాలుపోసుకునే/పొట్ట దశలో వర్షం పడకపోతే విధిగా నీటి తడి ఇవ్వాలి.
- సేంద్రియ మెట్ట వరి సాగులో మొదటి నుంచీ ప్రతి 20–25 రోజులకోసారి ద్రవజీవామృతాన్ని (కలిపిన 7–15 రోజుల్లో) ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి. కనీసం 4 సార్లు చల్లాలి. ఇది వీలుకాకపోతే, ప్రతి 20–25 రోజులకోసారి ఎకరానికి 400 కిలోల వర్మీ కంపోస్టు చల్లాలి.
- కాండం తొలిచే పురుగు, సుడిదోమను కనిపెట్టి ఉండాలి. చీడపీడలు కనిపిస్తే సేంద్రియ కషాయాలు చల్లాలి. ఎర్రనేలల్లో మెట్టసాగులో చెదలు సమస్య కూడా రావచ్చు. ఎకరానికి రెండు లీటర్ల వేపనూనెను 10 కిలోల ఇసుకలో కలిపి ఒకసారి చల్లాలి. సలహాలు, సూచనల కోసం సిఎస్ఎ శాస్త్రవేత్త డా. రాజశేఖర్ (83329 45368)కు ఫోన్ చేయవచ్చు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

ఏడాది పొడవునా పంటలు, ఆదాయం

- 6.5 ఎకరాల్లో మూడు కాలాల్లోనూ ప్రకృతి సేద్యం
- ఏడాదికి రూ. 5 లక్షల నికరాదాయం పొందుతున్న గిరిజన రైతు వినీత
- డా.ఎం.వి.రెడ్డి ఉత్తమ రైతు పురస్కారం ప్రదానం చేసిన ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ


● వినీత వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న ఇండోనేసియా మహిళా శాస్త్రవేత్త (ఫైల్)

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తనకున్న 6.5 ఎకరాల్లో ఏడాది పొడవునా బహుళ పంటలను సాగు చేస్తూ రూ. 5 లక్షల వరకు నికరాదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు గిరిజన యువ మహిళా రైతు పాంగి వినీత(20). అల్లూరి సీతారామరాజు జిల్లా బలియగూడ మండలం దుంబ్రిగూడ గ్రామంలో ఆమె ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇతర రైతులకు స్ఫూర్తినిస్తున్నారు. ఆమెకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 'డాక్టర్ ఎం.వి.రెడ్డి ఉత్తమ రైతు పురస్కారా'న్ని ఇటీవల ప్రదానం చేసింది. అరకు మండలం కిలోగుడలో సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 15వ దేశీ విత్తనోత్సవంలో కూడా ఉత్తమ రైతుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల ఇండోనేషియా శాస్త్రవేత్తల బృందం ఆమె వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి సాగు పద్ధతులను తెలుసుకున్నారు.

కొండ ప్రాంతంలోని ఎర్ర నేలలో సార్వా, దాళ్వా, వేసవి సీజన్లలో వరుసగా భర్త బాల కృష్ణతో కలసి వినీత ఏడాది పొడవునా పంటలు సాగు చేస్తూ నిరంతరం ఆదాయం పొందుతుండటం విశేషం.

కొండ వాగుల్లో నీటిని సేకరించి పంటలకు మళ్లించడం ద్వారా ఖరీఫ్‌తో పాటు రబీ, వేసవి పంటలను కూడా సాగు చేస్తున్నారు.

వర్షాధారంగా వరి, గుళి రాగి పద్ధతిలో రాగులు, కూరగాయలు, పండ్లు, పూలు, చింతపండుతో పాటు కొద్ది సంఖ్యలో నాటుకోళ్ల, గొర్రెలు, మేకలను సైతం పెంచుతూ అనుదినం మంచి ఆదాయం పొందుతున్నారు.

వినీత అన్ని పంటలకు పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానాలనే అవలంభిస్తున్నారు. ఏపీ రైతు సాధికార సంస్థ సహాయంతో వివిధ కషాయలను తయారు చేసి తమ పంటలకు వాడటంతో పాటు గ్రామంలోని ఇతర రైతులకు అందిస్తున్నారు.

ఏయే పంటల్లో ఎంత ఆదాయం?

గత ఏడాది ఖరీఫ్‌లో 4.3 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. 2 ఎకరాల్లో వరి (దిగుబడి 32 క్విం./రూ. 26 వేల నికరాదాయం), అరెకరం మొక్కజొన్న (9 క్విం./రూ.12,500), ఎకరంలో రాగులు (7.5 క్విం./రూ.11,500), అరెకరంలో టొమాటో (4.8 క్విం./రూ.4,200), 30 సెంట్లలో సామలను వినీత సాగు చేశారు.

రబీలో 3 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అరెకరంలో వరి (9 క్విం./రూ. 8,550 నికరాదాయం), అరెకరంలో మొక్కజొన్న (6 క్విం./రూ.8,000), ఎకరంలో టొమాటో (12.6 క్విం./రూ.12,100), అరెకరంలో ముల్లంగి (1.25 క్విం/రూ.2వేలు), 30 సెంట్లలో పచ్చిమిరప, కూరగాయలను సాగు చేశారు.

అదేవిధంగా ఎండాకాలంలో ఎకరన్నరలో పంటలు సాగు చేశారు. 30 సెంట్లలో కొత్తిమీర, 20 సెంట్లలో ముల్లంగి, అరెకరంలో కూరగాయలు, అరెకరంలో టొమాటోలు సాగు చేశారు. ఎకరన్నరలో బొప్పాయి, అరటి, అల్లం, పసుపు వంటి వార్షిక పంటలను సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక పంటలు కాఫీ, మిరియాలు 40 సెంట్లలో సాగు చేస్తున్నారు. 30 పనస, 6 చింత చెట్లున్నాయి. అన్ని పంటలు, కోళ్లు, గొర్రెలు, మేకల ద్వారా ఏటా సగటున రూ. 5 లక్షల నికరాదాయం పొందుతున్నట్లు వినీత తెలిపారు.


● వినీత

పంట మార్పిడి ఖచ్చితంగా అనుసరిస్తున్నారు. ఏడాది పొడవునా మూడు సీజన్లలోనూ అంతర పంటలు, బహుళ అంతస్తుల పంటలు సాగు చేస్తున్నారు. సజీవ ఆచ్ఛాదనతోపాటు గడ్డిని ఆచ్ఛాదనగా వాడుతూ నేల తేమను సమర్థవంతంగా సంరక్షించుకుంటున్నారు. చింతపల్లి, అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్‌ల శాస్త్రవేత్తల సూచనల మేరకు జీవ నియంత్రణ పద్ధతులను అనుసరిస్తున్నారు. వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన కంపోస్టును పంటలకు వాడుతున్నారు. అంతర పంటల సాగును అనుసరిస్తారు. మొక్కజొన్న+ముల్లంగి, టొమాటో+ ముల్లంగి, పసుపు+అల్లం, బీన్స్+వంకాయ, కొత్తిమీర+టమోటాలను మిశ్రమ పంటలుగా సాగు చేస్తున్నారు. టమోటా, కొత్తిమీర, ముల్లంగిని దశలవారీగా విత్తటం ద్వారా సంవత్సరం పొడవునా పంట దిగుబడి తీస్తున్నారు.

ఏడాది పొడవునా ఆదాయ భద్రత

ఒకటికి పది పంటల సాగుతో వ్యవసాయ భూమి నుంచి సురక్షితమైన ఆదాయాన్ని పొందడంలో వినీత విజయం సాధించారు. దేశీ వరి, కూరగాయలతో పాటు పాడి, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. మొత్తంగా 6.5 ఎకరాల ద్వారా సుమారు రూ. ఐదు లక్షలను ఏడాదికి సగటు నికరాదాయం పొందుతున్నారు.

దేశీ వరిని వరుసలుగా విత్తటం, గుళి పద్ధతిలో రాగి నారు మొక్కలను నాటేసి సాగు చేయటం, అంతర పంటలు, మొక్కజొన్న ఇతర పంటలను ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయటం వినీత ప్రత్యేకత.

'పాత విత్తనాలనే వాడుతున్నాం. విత్తనాలను మునుపటి పంట నుండి సేకరించి తదుపరి సీజన్‌కు వినియోగిస్తాం. ఎక్కువగా దేశీ రకాలనే వాడుతున్నాం. సహజ పద్ధతిలో పండించిన నాణ్యమైన ఆహారోత్పత్తులను థిమ్సా ఎఫ్.పి.ఓ. ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నందున మంచి ఆదాయం వస్తోంద'ని వినీత తెలిపారు.

2న బసంపల్లిలో రైతులకు శిక్షణ

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామం (ధర్మవరం- పుట్టపర్తి రోడ్‌)లో జూలై 2న (ప్రతి నెలా మొదటి ఆదివారం) సీనియర్ ప్రకృతి వ్యవసాయదారుడు నాగరాజు తన పొలంలోనే ఉ. 9 గం. నుంచి సా. 4 వరకు రైతులకు ప్రకృతి వ్యవసాయ శిక్షణ ఇస్తారు. భోజనం, నిర్వహణ కోసం రూ. 200 చెల్లించాలి. వివరాలకు.. 91826 71819.



అంతరిక్షంలో ప్రపంచకప్! అరుదైన రీతిలో ఐసీసీ ప్రచారం

వన్డే ప్రపంచకప్‌కు మరో 100 రోజుల సమయం ఉంది. భారత్‌లో జరిగే ఈ టోర్నీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), బీసీసీఐ సంయుక్తంగా కొత్త తరహాలో ప్రచారాన్ని మొదలు పెట్టాయి. వరల్డ్ కప్ ట్రోఫీని ఏకంగా అంతరిక్షంలోకి పంపించి టోర్నీపై ఆసక్తిని మరింతగా పెంచే ప్రయత్నం చేశాయి. జెస్పోక్ బెలూన్‌తో జత చేసిన ట్రోఫీ భూమి నుంచి 1 లక్షా 20 వేల అడుగుల ఎత్తులో ఉన్న 'స్ట్రాటోస్ఫియర్'ను చేరింది. అక్కడ ఉన్న ట్రోఫీని 4కె కెమెరాతో కొన్ని షాట్స్ తీశారు. అనంతరం ట్రోఫీ నేలకు దిగి నేరుగా వరల్డ్ కప్ తొలి మ్యాచ్ జరిగే అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి చేరింది. నేటినుంచి జరిగే వరల్డ్ టూర్‌లో భాగంగా ట్రోఫీ 18 దేశాలకు ప్రయాణిస్తుంది. ఇందులో ప్రపంచ కప్‌లో భాగం కాని కువైట్, బహ్రెయిన్, మలేసియా, నైజీరియా, ఉగాండా, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాలు కూడా ఉన్నాయి. నేడు ముంబైలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వరల్డ్ కప్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు జరుగుతుంది.


తేజ


వాన్ బీక్

'డచ్' ధమాకా

వెస్టిండీస్ 374/6 : నెదర్లాండ్స్ 374/9
- 'సూపర్ ఓవర్'లో వెస్టిండీస్‌పై నెదర్లాండ్స్ సంచలన విజయం
- తేజ నిడమనూరు అద్భుత సెంచరీ
- వాన్ బీక్ 'సూపర్' ప్రదర్శన

హరారే: ఒకప్పుడు అన్ని జట్లను గడగడలాడించిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా గ్రూప్ 'ఎ'లో జింబాబ్వే చేతిలో ఓడిన వెస్టిండీస్ జట్టుకు నెదర్లాండ్స్ జట్టు చేతిలోనూ పరాజయం తప్పలేదు. ముందుగా వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 374 పరుగులు సాధించింది. నికోలస్ పూరన్ (65 బంతుల్లో 104 నాటౌట్; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (76; 13 ఫోర్లు), జాన్సన్ చార్లెస్ (54; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 375 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన నెదర్లాండ్స్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి సరిగ్గా 374 పరుగులు చేయడంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. నెదర్లాండ్స్ జట్టుకు ఆడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు (76 బంతుల్లో 111; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) అసాధారణ ఆటతో సెంచరీ సాధించాడు. చివరి ఓవర్లో నెదర్లాండ్స్ విజయానికి 9 పరుగులు అవసరంకాగా ఆ జట్టు 8 పరుగులే చేయడంతో స్కోర్లు సమమయ్యాయి.

వాన్ బీక్ వండర్...

మ్యాచ్ 'టై' కావడంతో విజేతను నిర్ణయించడానికి 'సూపర్ ఓవర్' ఆడించారు. ఈ సూపర్ ఓవర్‌లో నెదర్లాండ్స్ బ్యాటర్ లొగాన్ వాన్ బీక్ చెలరేగిపోయాడు. జేసన్ హోల్డర్ వేసిన సూపర్ ఓవర్‌లో వాన్ బీక్ వరుసగా 4,6,4,6,6,4తో 30 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ వన్డే, టి20 క్రికెట్‌లో సూపర్ ఓవర్‌లో అత్యధిక పరుగులు సాధించిన జట్టుగా నెదర్లాండ్స్ రికార్డు సృష్టించింది. అనంతరం వాన్ బీక్ బౌలింగ్‌కు దిగి సూపర్ ఓవర్ వేశాడు. తొలి బంతిపై జాన్సన్ చార్లెస్ సిక్స్ కొట్టగా... తర్వాతి రెండు బంతులకు సింగిల్స్ వచ్చాయి. నాలుగో బంతికి చార్లెస్‌ను, ఐదో బంతికి రొమారియో షెఫర్డ్‌ను వాన్ బీక్ అవుట్ చేయడంతో వెస్టిండీస్ ఇన్నింగ్స్ 5 బంతుల్లో 8 పరుగుల వద్ద ముగిసింది. 22 పరుగుల తేడాతో నెదర్లాండ్స్ చిరస్మరణీయ విజయం సాధించింది. 'సూపర్ ఓవర్' నిబంధనల ప్రకారం ఓ జట్టు రెండు వికెట్లు చేజార్చుకుంటే ఇన్నింగ్స్ ముగుస్తుంది. సూపర్ ఓవర్‌లో 30 పరుగులు చేయడంతోపాటు 2 వికెట్లు తీసిన వాన్ బీక్ ఒంటిచేత్తో నెదర్లాండ్స్‌ను గెలిపించాడు.

జింబాబ్వే జిగేల్...

వన్డే క్రికెట్‌లో రెండో అతి పెద్ద విజయం ● అమెరికాపై 304 పరుగుల తేడాతో గెలుపు
తొలిసారి వన్డేల్లో 400 పరుగులు చేసిన జింబాబ్వే ● సీన్ విలియమ్స్ భారీ సెంచరీ

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పరుగుల వరద పారుతోంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' దశకు అర్హత పొందిన ఆతిథ్య జింబాబ్వే జట్టు తమ గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికాను హడలెత్తించింది. ఏకంగా 304 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన జింబాబ్వే తమ గ్రూప్ దశను అజేయంగా ముగించింది. టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 408 పరుగులు సాధించింది. వన్డేల్లో జింబాబ్వే జట్టుకిదే అత్యధిక స్కోరు. ఇంగ్లండ్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్ జట్ల తర్వాత వన్డే ఫార్మాట్‌లో 400 అంతకంటే ఎక్కువ పరుగులు నమోదు చేసిన ఏడో జట్టుగా జింబాబ్వే గుర్తింపు పొందింది. పరుగుల పరంగా భారత జట్టు (2023లో శ్రీలంకపై 317 పరుగుల తేడాతో) తర్వాత వన్డేల్లో రెండో అతి పెద్ద విజయం జింబాబ్వే ఖాతాలోకి చేరింది. కెప్టెన్ సీన్ విలియమ్స్ (101 బంతుల్లో 174; 21 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారం చేసి కెరీర్‌లో ఏడో సెంచరీ సాధించాడు. సికందర్ రజా (27 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), రియాన్ బర్ల్ (16 బంతుల్లో 47; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా అమెరికా బౌలర్లను చితగ్గొట్టారు. అంతకుముందు ఓపెనర్లు జాయ్‌లార్డ్ గుంబీ (103 బంతుల్లో 78; 5 ఫోర్లు), ఇన్నోసెంట్ కయా (41 బంతుల్లో 32; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. కయా అవుటయ్యాక గుంబీతో కలిసి సీన్ విలియమ్స్ రెండో వికెట్‌కు 160 పరుగులు జోడించాడు. 65 బంతుల్లోనే సెంచరీ సాధించిన విలియమ్స్ మూడో వికెట్‌కు సికందర్ రజాతో 88 పరుగులు... రియాన్ బర్ల్‌తో నాలుగో వికెట్‌కు 81 పరుగులు జత చేశాడు. తమ ఇన్నింగ్స్‌లో మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగా సీన్ విలియమ్స్ పెవిలియన్ చేరుకున్నాడు. ఓవరాల్‌గా జింబాబ్వే ఇన్నింగ్స్‌లో 37 ఫోర్లు, 13 సిక్స్‌లు నమోదు కావడం విశేషం. 409 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన అమెరికా 25.1 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. అభిషేక్ (24; 3 ఫోర్లు), జెస్సీ సింగ్ (21; 4 ఫోర్లు), గజానంద్ సింగ్ (13; 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. జింబాబ్వే బౌలర్లలో ఎన్‌గరవా, సికందర్ రజా రెండు వికెట్లు చొప్పున తీయగా... ఇవాన్స్, ల్యూక్ జోంగ్వి, రియాన్ బర్ల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గిన జింబాబ్వే గ్రూప్ టాపర్‌గా నిలిచింది.


సీన్ విలియమ్స్

అల్‌కరాజ్.. మళ్లీ నంబర్‌వన్

లండన్: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన క్వీన్స్‌క్లబ్ టోర్నీలో అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. గ్రాస్‌కోర్టులపై తొలిసారి టైటిల్ నెగ్గిన ఈ స్పెయిన్ స్టార్ ఈ క్రమంలో నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌ను రెండో స్థానానికి పంపించాడు. ప్రస్తుతం అల్‌కరాజ్ ఖాతాలో 7,675 పాయింట్లు, జొకోవిచ్ ఖాతాలో 7,595 పాయింట్లు ఉన్నాయి. వీరిద్దరి మధ్య కేవలం 80 పాయింట్ల తేడా ఉండటంతో...జూలై 16న వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ముగిశాక టాప్ ర్యాంక్ మళ్లీ తారుమారయ్యే అవకాశముంది. ఈనెల 11న ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ సాధించాక జొకోవిచ్ నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకొని రెండు వారాల పాటు ఈ స్థానంలో ఉన్నాడు. ఇక వింబుల్డన్ టోర్నీలో జొకోవిచ్ డిఫెండింగ్ చాంపియన్‌గా పోటీపడనున్నాడు. గత ఏడాది అల్‌కరాజ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయాడు. దాంతో ఈసారి వింబుల్డన్ టోర్నీలో వీరిద్దరు కనబరిచే ప్రదర్శన వారి తదుపరి ర్యాంకింగ్స్‌ను నిర్ధారించనుంది.



ఆసీస్‌దే విజయం

- మహిళల యాషెస్ సిరీస్ టెస్టులో ఇంగ్లండ్ ఓటమి
- 8 వికెట్లు తీసిన ఆసీస్ స్పిన్నర్ ఆష్లే గార్డ్‌నర్

నాటింగ్‌హామ్: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మహిళా జట్ల మధ్య జరుగుతున్న మల్టీ ఫార్మాట్ యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. మూడు ఫార్మాట్ల ఫలితాలతో విజేత ఖరారయ్యే ఈ సిరీస్‌లో ఆసీస్ అమ్మాయిలు ఏకైక టెస్టులో గెలిచి ఆధిక్యంలోకి వచ్చారు. ఇక ఈ యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే తదుపరి జరిగే ఆరు మ్యాచ్‌ల్లో (మూడు టి20లు, మూడు వన్డేలు) ఐదింట గెలవాలి. సోమవారం ముగిసిన టెస్టులో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. ఆసీస్ ఆఫ్ స్పిన్నర్ ఆష్లే గార్డ్‌నర్ (8/66) ఇంగ్లండ్‌ను దెబ్బ తీసింది. భారత స్పిన్నర్ నీతూ డేవిడ్ (8/53; 1995లో ఇంగ్లండ్‌పై) తర్వాత ఒకే ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా ఆష్లే నిలిచింది. 268 పరుగుల లక్ష్యంతో ఆఖరి రోజు 116/5తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి సెషన్‌లోనే ఆలౌటైంది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 49 ఓవర్లలో 178 పరుగుల వద్ద ముగిసింది. నాలుగో రోజు ఆటలోనే 3 కీలక వికెట్లు తీసిన ఆష్లే చివరి రోజు ఉదయం మరో ఐదు వికెట్లను పడగొట్టింది. ఈ టెస్టులో ఆమె మొత్తం 12 వికెట్లు (తొలి ఇన్నింగ్స్‌లో 4) పడగొట్టింది. తద్వారా మహిళల టెస్టు చరిత్రలో రెండో ఉత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసింది. ఈ జాబితాలో పాక్ బౌలర్ షాయిజా ఖాన్ (2004లో విండీస్‌పై 13 వికెట్లు) అగ్రస్థానంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఆసీస్ 473, ఇంగ్లండ్ 463 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 257 పరుగులు చేసింది.


గార్డ్‌నర్

భారత్‌కు పతకాల పంట

బెర్లిన్: స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ గేమ్స్‌ను భారత జట్టు ఏకంగా 202 పతకాలతో ముగించింది. ఇందులో 76 స్వర్ణ పతకాలు, 75 రజత పతకాలు, 51 కాంస్య పతకాలు ఉన్నాయి. బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారికి ప్రోత్సహించేందుకు స్పెషల్ ఒలింపిక్స్ పేరిట క్రీడలు నిర్వహిస్తారు. ఓవరాల్‌గా భారత్ నుంచి 198 మంది క్రీడాకారులు బరిలోకి దిగారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గుజ్జల అలివేలమ్మ మహిళల టేబుల్ టెన్నిస్ డి-3 కేటగిరీ సింగిల్స్‌లో, డి02 డబుల్స్‌లో స్వర్ణ పతకాలు నెగ్గింది. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబ్ల్యూ-7 కేటగిరీలో దూదేకుల షమీలా కాంస్య పతకం సాధించింది.


అలివేలమ్మ

'ఎంసీసీ' కమిటీలో జులన్‌కు చోటు

లండన్: ప్రతిష్టాత్మక మెరిలిబోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) వరల్డ్ క్రికెట్ కమిటీలో భారత మాజీ పేసర్ జులన్ గోస్వామికి స్థానం లభించింది. ఆమెతో పాటు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్‌లు ఇయాన్ మోర్గాన్, హీతర్ నైట్‌లను కూడా కమిటీలోకి తీసుకున్నట్లు ఎంసీసీ చైర్మన్ మైక్ గ్యాటింగ్ వెల్లడించారు. క్రికెట్ నిబంధనలు రూపొందించే ఎంసీసీలో భాగమైన వరల్డ్ క్రికెట్ కమిటీ కొత్తగా వచ్చే సాంకేతిక అంశాలను, వాటిని ఉపయోగించడానికి సంబంధించి తగిన సూచనలు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎంసీసీ ప్రధాన కేంద్రం లార్డ్స్ మైదానంలో ఉంది. లార్డ్స్‌లోనే జరిగిన ఫైనల్ మ్యాచ్‌లలో 2019 వన్డే వరల్డ్ కప్, 2017 వన్డే వరల్డ్ కప్‌లలో ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. ఈ టీమ్‌లకు మోర్గాన్, హీతర్ నైట్ కెప్టెన్లుగా వ్యవహరించారు. గత ఏడాది ఇదే లార్డ్స్ మైదానంలో తన ఆఖరి వన్డే ఆడి జులన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్‌లలో కలిపి 355 వికెట్లు పడగొట్టిన జులన్‌కు ఈ ఏడాదే ఎంసీసీ గౌరవ సభ్యత్వం దక్కింది.



సినిమా

త్వరలో టైటిల్

వరుణ్ తేజ్ హీరోగా శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీటీ 13' (వర్కింగ్ టైటిల్). సందీప్ ముద్ద నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ని త్వరలో ప్రకటించనున్నారు. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఇండియన్ బిగ్గెస్ట్ ఎయిర్ ఫోర్స్ యాక్షన్ చిత్రంగా రూపొందుతున్న మూవీ ఇది. ఇందులో వరుణ్ తేజ్ ఐఏఎఫ్ అధికారిగా కనిపిస్తారు. ఈ చిత్రం లోని భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి భారీ సెట్ రూపొందించాం. ఈ సీక్వెన్స్ కోసం వరుణ్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ చిత్రం టైటిల్‌ను త్వరలో ప్రకటిస్తాం '' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లార్ రాడార్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు.


● వరుణ్ తేజ్

పాత్రలే దెయ్యాలైతే..!

కాజల్, రెజీనా, జననీ అయ్యర్ ముఖ్య తారలుగా నటించిన తమిళ చిత్రం 'కరుంగాప్పియం'. డి. కార్తికేయన్ (డీకే) దర్శకత్వం వహించారు. వెంకట సాయి ఫిల్మ్స్ పతాకంపై ముత్యాల రామదాసు సమర్పణలో టి. జనార్దన్ 'కార్తీక' పేరుతో ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా ముత్యాల రాందాస్, టి. జనార్దన్ మాట్లాడుతూ– ''జూలై 7న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం. ఇందులో ఐదుగురు వ్యక్తుల జీవితాలను చూపించే క్రమంలో రెజీనా లైబ్రరీలో వందేళ్ల క్రితం నాటి కాటుక బొట్టు అనే బుక్ చదువుతుంది. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పే బుక్ అది. అయితే అందులోని పాత్రల గురించి చదువుతున్నప్పుడు అవి దెయ్యాలుగా మారి ఆమె ముందుకు వస్తాయి. ఇక తనకు హాని కలిగించిన వ్యక్తులపై దెయ్యంగా మారి పగ తీర్చుకునే పాత్రను కాజల్ చేశారు. జనని పాత్ర కూడా అలరించే విధంగా ఉంటుంది. హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని డీకే అద్భుతంగా తెరకెక్కించారు'' అన్నారు.


● రెజీనా

నేను ఎరేసి వేటాడతా

జగపతిబాబు, మమతా మోహన్ దాస్, విమలా రామన్, ఆశిష్ గాంధీ, గానవి లక్ష్మణ్, 'బాహుబలి' ప్రభాకర్, ఆర్ఎస్ నంద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' చిత్రాలకు డైలాగ్స్ రాసిన అజయ్ సామ్రాట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదలకానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ని యూనిట్ విడుదల చేసింది. తెలంగాణ చారిత్రక నేపథ్య కథతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ మూవీలో భీమ్ రావ్ దొరగా జగపతిబాబు, జ్వాలా భాయిగా మమతా మోహన్ దాస్, మల్లేష్‌గా ఆశిష్ గాంధీ నటించారు. 'ఒకడు ఎదురుపడి వేటాడతాడు.. ఒకడు వెంటపడి వేటాడతాడు.. నేను ఎరేసి వేటాడతా' అంటూ జగపతిబాబు చెప్పే డైలాగ్స్‌తో ట్రైలర్ సాగుతుంది. ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ శనమోని, సంగీతం: నాఫల్ రాజా.


● జగపతిబాబు

నిజాలను చూడటం కష్టం!

''కొన్నిసార్లు నిజాలను చూడటం చాలా కష్టం.. మరి మీరు ఆమె చీకటి ప్రపంచాన్ని చూడ్డానికి రెడీ అవుతారా?'' అంటూ సోనమ్ కపూర్ నటించిన తాజా చిత్రం 'బ్లైండ్' విడుదల తేదీని ప్రకటించారు. జూలై 7 నుంచి ఈ చిత్రం ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. కొరియన్ మూవీ 'బ్లైండ్'కి రీమేక్‌గా రూపొందిన ఈ చిత్రంలో సోనమ్ అంధురాలిగా నటించారు. ఓ సీరియల్ కిల్లర్‌ను పట్టుకోడానికి ఓ లేడీ పోలీసాఫీసర్ చేసే ప్రయత్నం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. బ్లైండ్ పోలీసాఫీసర్‌గా సోనమ్ అద్భుతంగా నటించారని చిత్ర యూనిట్ పేర్కొంది.. షోమ్ మఖీజా దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. కాగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో సోనమ్ కనిపించనున్న తొలి చిత్రం ఇదే కాగా, తల్లయ్యాక (గత ఏడాది ఆగస్ట్ 20న ఓ బాబుకి జన్మనిచ్చారు) కనిపించనున్న చిత్రం కూడా ఇదే అవుతుంది.


● సోనమ్ కపూర్

నిర్మాతగా ఉండాలంటే కష్టం - శ్రీకాంత్

''అభినవ్ సర్దార్ చాలా రంగాల్లో విజయం సాధించాడు. ఇండస్ట్రీలో నిర్మాతగా ఉండాలంటే కష్టం. కానీ, 'మిస్టేక్' కథని నమ్మి సర్దార్ నిర్మాతగా మారాడు. ఈ మధ్య చిన్న సినిమాలు మంచి సక్సెస్ సాధిస్తున్నాయి. ట్రైలర్ చూశాక 'మిస్టేక్' కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని హీరో శ్రీకాంత్ అన్నారు. భరత్ కొమ్మాలపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'మిస్టేక్'. అభినవ్ సర్దార్ హీరోగా నటించి, నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్ విడుదల చేశారు. ''భరత్ చెప్పిన కథపై నమ్మకంతో 'మిస్టేక్' సినిమా నిర్మించాను'' అన్నారు అభినవ్ సర్దార్. ''జూలైలో ఈ చిత్రం విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు భరత్ కొమ్మాలపాటి.


● భరత్ కొమ్మాలపాటి, శ్రీకాంత్, అభినవ్

తండ్రి నిర్మాత.. కుమార్తె కథానాయిక

'**అ**లాంటి ఇలాంటి లాంచింగ్ కాదు.. ఓ రేంజ్‌లో ఉండాలి' అన్నట్లు కుమార్తె సుహానా ఖాన్ వెండితెర అరంగేట్రానికి షారుక్ ఖాన్ రంగం సిద్ధం చేస్తున్నారట. ఇప్పటికే సుహానా నటిగా మేకప్ వేసుకుంది. జోయా అక్తర్ దర్శకత్వంలో 'ది ఆర్చీస్' అనే సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఈలోపు సుహానా వెండితెరపై పరిచయం కావడానికి ఓ సినిమా సైన్ చేసిందని సమాచారం. కుమార్తె అరంగేట్రం అట్టహాసంగా జరగాలనే ఆలోచనతో తనకు ఇటీవల 'పఠాన్'లాంటి హిట్ ఇచ్చిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించాలని షారుక్ అనుకుంటున్నారట. అది మాత్రమే కాదు.. అతిథి పాత్ర కూడా చేయాలని అనుకుంటున్నారట. ప్రస్తుతం కథ రెడీ అవుతోందని సమాచారం. ఇంకా దర్శకుడి ఎంపిక జరగలేదని టాక్.


● షారుక్


● సుహానా ఖాన్

ఇకపై భాగ్ సాలే సినిమా గుర్తొస్తుంది - హీరో కార్తికేయ

''భాగ్ సాలే ట్రైలర్ వినోదాత్మకంగా ఉంది. ఇప్పటిదాకా భాగ్ సాలే అంటే మహేశ్ బాబుగారి పాట గుర్తుకొచ్చేది. ఇకపై భాగ్ సాలే అంటే ఈ సినిమా గుర్తొస్తుంది. శ్రీ సింహాకి 'భాగ్ సాలే' పెద్ద హిట్ ఇవ్వాలి'' అని హీరో కార్తికేయ అన్నారు. శ్రీ సింహా కోడూరి హీరోగా, నేహా సోలంకి, నందినీ రాయ్ హీరోయిన్లుగా ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భాగ్ సాలే'. అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కల్యాణ్ సింగనమల నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ చిత్రం ట్రైలర్‌ను కార్తికేయ విడుదల చేశారు. ''క్రైమ్ కామెడీగా రూపొందిన చిత్రమిది'' అన్నారు అర్జున్ దాస్యన్. ''ఇది హైదరాబాద్ బెస్ట్ మూవీ. మంచి ఇరానీ చాయ్‌లాంటి సినిమా '' అన్నారు ప్రణీత్ బ్రహ్మాండపల్లి. ''ఈ చిత్రంలో అర్జున్ అనే టక్కరి దొంగ పాత్ర చేశాను. విలువైన ఉంగరం దొరకడం వల్ల అర్జున్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? అనేది ఆసక్తిగా ఉంటుంది '' అన్నారు శ్రీ సింహా.


● కార్తికేయ, శ్రీసింహా, కాలభైరవ

సర్కిల్‌లోనూ ఆ ప్రయత్నం కొనసాగించా - నీలకంఠ

''నా సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రాధాన్యత ఇస్తాను. 'షో'లో మంజుల, 'మిస్సమ్మ'లో లయ, భూమిక, 'సదా మీ సేవలో' చిత్రంలో శ్రియ.. ఇలా నా హీరోయిన్ల క్యారెక్టర్స్ బాగుంటాయని అందరూ చెబుతారు. 'సర్కిల్'లోనూ ఆ ప్రయత్నాన్ని కొనసాగించాను. ఈ సినిమాలో అరుంధతి పాత్రలో రిచా పనై కొత్తగా కనిపిస్తుంది. అర్షిణ్, సాయి రోనక్, బాబా భాస్కర్ కూడా చక్కగా నటించారు'' అని డైరెక్టర్ నీలకంఠ అన్నారు. సాయి రోనక్, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ''నీలకంఠగారితో పని చేయడం ఒక ఛాలెంజ్. ఈ సినిమా షూటింగ్‌ని ఎంజాయ్ చేశాను'' అన్నారు సాయి రోనక్. ''ఇదొక డిఫరెంట్ మూవీ.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శరత్ చంద్ర.


● నీలకంఠ, రిచా, సాయి రోనక్, అర్షిణ్

సరికొత్త ప్రేమకథ

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి జంటగా దివ్య భావన దర్శకత్వం వహించిన చిత్రం 'ఓ సాథియా'. చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాత కేఎస్ రామారావు విడుదల చేసి, ''సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''ఆర్యన్ గౌర తన గురించి చెప్తుంటే నా తొలి సినిమా కష్టాలు గుర్తొచ్చాయి'' అన్నారు డైరెక్టర్ త్రినాథ రావు నక్కిన. ''మా సినిమా చూసి ప్రేక్షకులు చక్కని చిరునవ్వుతో థియేటర్ నుంచి బయటికొస్తారు'' అన్నారు ఆర్యన్ గౌర. ''నా గురువు విజయేంద్ర ప్రసాద్ గారివల్లే నేను ఇక్కడ ఉన్నాను. సరికొత్త ప్రేమకథగా రూపొందించిన చిత్రం 'ఓ సాథియా'' అన్నారు దివ్య భావన. ''మా సినిమా చూశాక అందరికీ తమ తొలి ప్రేమ గుర్తుకొస్తుంది'' అన్నారు సుభాష్ కట్టా.


● మిస్తీ, ఆర్యన్ గౌర

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	9	62,970
నిఫ్టీ △	26	18,691

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,383	▽	110
డోజోన్స్	33,776	△	48
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454	▽	8
డాక్స్	15,813	▽	17
షాంఘై	3,152	▽	47
నికాయ్	32,699	▽	83

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో – ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,726
బంగారం (99.5 స్వచ్ఛత)	58,491
వెండి (కిలో)	69,392

పల్లెపల్లెకూ ఫార్మసీ స్టోర్!



వెయ్యి మంది జనాభా ఉంటే చాలు
- తెరుచుకుంటున్న ఔషధ దుకాణం
- మెరుగుపడిన వైద్య వసతులు
- పెరిగిన జీవనశైలి వ్యాధులు
- పల్లెల్లోనూ అధిక ఔషధ వినియోగం

న్యూఢిల్లీ: మారిన జీవనశైలి, ఆహార నియమాలతో పట్టణం, పల్లె అని వ్యత్యాసం లేకుండా ప్రజలు పలు రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ తదితర జీవనశైలి వ్యాధులు పెరిగిపోయాయి. దీనికితోడు వైద్య వసతులు పెరగడంతో పల్లెల్లోనూ ఔషధ విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. దీంతో ఫార్మసీ స్టోర్లు జోరుగా తెరుచుకుంటున్నాయి. ముఖ్యంగా కరోనా అనంతరం ప్రజల్లో ఆరోగ్యం పట్ల ఏర్పడిన అవగాహన సైతం ఔషధ వినియోగాన్ని పెంచింది. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, ఏటా మార్కెట్లోకి పెద్ద సంఖ్యలో ఫార్మాసిస్టులు రావడం కూడా ఔషధ దుకాణాల సంఖ్య విస్తరణకు మద్దతుగా ఉంటున్నాయి. ఏటా 4,50,000 మంది ఫార్మసీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తుంటే, ఇందులో 40,000–45,000 వరకు సొంతంగా దుకాణాలను తెరుస్తున్నట్టు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ జనరల్ సెక్రటరీ రాజీవ్ సింఘాల్ తెలిపారు. దేశంలో 12 లక్షల మంది ఫార్మాసిస్టులకు ఈ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తోంది. ''ఫార్మాసిస్టులు పల్లె బాట పడుతున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనీసం 1,000–2,000 మంది జనాభా ఉన్న ప్రతి ఊరులోనూ ఫార్మసీ స్టోర్ ఉంది''అని సింఘాల్ వెల్లడించారు. కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు తమ ఆరోగ్య సమస్యల విషయంలో శ్రద్ధ చూపిస్తున్నారని, క్రమం తప్పకుండా ఔషధాలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ పథకం

పల్లెలు, చిన్న పట్టణాల్లో ఔషధ విక్రయాలు పెరగానికి ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కీలకంగా పనిచేస్తోంది. ఈ పథకం కింద 26,055 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో 4.3 కోట్ల మంది చేరి వైద్యం పొందినట్టు 2022–23 ఆర్థిక సర్వే వెల్లడించింది. దేశవ్యాప్తంగా 1,54,070 ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఈ కేంద్రాలు ప్రిస్కిప్షన్‌ను జారీ చేస్తే ఔషధాలను ప్రభుత్వ చానళ్ల ద్వారా లేదంటే ప్రైవేటు ఫార్మసీ స్టోర్లలో కొనుగోలు చేసుకుంటున్నట్టు సింఘాల్ తెలిపారు. దీంతో మారుమూల ప్రాంతాల్లోనూ ఔషధాలకు డిమాండ్ ఏర్పడినట్టు చెప్పారు. భారత ఫార్మా మార్కెట్‌లో టైర్–2 నుంచి టైర్–6 వరకు పట్టణాల వాటా 21 శాతంగా ఉంటుందని అంచనా. ఔషధాలకు డిమాండ్ ఏర్పడడంతో ఫార్మసీ కంపెనీలు సైతం మార్కెటింగ్ సిబ్బందిని చిన్న పట్టణాల్లోనూ మోహరిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సిబ్బందిని పెంచుకుంటున్నాయి. తమకున్న విస్తృత నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో అందుబాటు ధరలకే నాణ్యమైన ఔషధాలను అందిస్తున్నట్టు సన్‌ఫార్మా ప్రతినిధి తెలిపారు. ''నేను దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి ప్రజలు, మా కంపెనీ స్టాకిస్టులు, అమ్మకాల సిబ్బందితో మాట్లాడాను. రహదారులు, ఆస్పత్రులు, విద్యుత్ తదితర సదుపాయాల విస్తరణతో ప్రజలు తమ స్వస్థలాల్లోనే ఉండాలనుకుంటున్నారు. మెట్రో పట్టణాలకు రావాలని అనుకోవడం లేదు. కరోనా తర్వాత సొంత గ్రామాల్లోనే ఉండాలన్నది వారి అభీష్టంగా ఉంది''అని మ్యాన్ కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం సైతం అమ్మకాలు పెరగడానికి తోడ్పడుతున్నట్టు తెలిపారు. చిన్న పట్టణాల్లోనూ వైద్యుల అందుబాటు పెరిగినట్టు ఎరిస్ లైఫ్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి కృష్ణకుమార్ పేర్కొన్నారు. ''మాకు 140 పాయింట్ ఆఫ్ ప్రజెన్స్ ఉన్నాయి. ఒక్కోటీ చుట్టుపక్కల 50 కిలోమీటర్ల పరిధిని కవర్ చేస్తుంది. ఈ పాయింట్లను 300కు పెంచుతున్నాం. దేశంలో 85 శాతం ప్రాంతాలను చురుకోగలం''అని వివరించారు.

సవాళ్ల మధ్య ఆశావహంగా భారత్

- భవిష్యత్తులోకి దూసుకెళ్లేందుకు సిద్ధం
- హెచ్‌యూఎల్ చైర్మన్ నితిన్ పరాంజపే



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్ల మధ్య భారత్ కాంతిరేఖలా వెలుగొందుతోందని, ఆశావహంగా కనిపిస్తోందని ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హెచ్‌యూఎల్ చైర్మన్ నితిన్ పరాంజపే వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోకి దూసుకెళ్లేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. అయితే, ఉద్యోగాల కల్పన, వ్యవసాయ ఉత్పాదకత వంటి సవాళ్లను తప్పక పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా పరాంజపే ఈ విషయాలు తెలిపారు. గత దశాబ్దకాలంగా భారత్ అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎకానమీగా నిలుస్తోందని, త్వరలోనే జపాన్, జర్మనీలను కూడా అధిగమించి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ హోదాను దక్కించుకోగలదని ఆయన చెప్పారు. 2047 నాటికి అధిక ఆదాయ దేశంగా ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమేనని పరాంజపే పేర్కొన్నారు. పెరుగుతున్న వినియోగం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పెట్టుబడులు, కొత్త ఆవిష్కరణల సంస్కృతి, పెద్ద సంఖ్యలో యువజనాభా మొదలైన సానుకూలతలు ఇందుకు దోహదపడగలవన్నారు. ప్రస్తుతం 66% జనాభా 35 ఏళ్ల వయస్సు లోపు వారేనని, 40% మంది 13–35 ఏళ్ల మధ్యలో ఉన్న వారని పరాంజపే తెలిపారు. పెరిగే యువ జనాభాతో పాటు భారత్‌లో వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోందని ఆయన చెప్పారు.

సెన్సెక్స్‌కు నష్టం.. నిఫ్టీకి లాభం..!

- ఇంట్రాడేలో పరిమిత శ్రేణిలో ట్రేడింగ్
- ప్రపంచ ప్రతికూల పరిస్థితుల ప్రభావం



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ.., పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందడంతో అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, టీసీఎస్ షేర్లు ఒకశాతం నష్టపోయి సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఉదయం సెన్సెక్స్ 33 పాయింట్లు నష్టపోయి 62,946 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 282 పాయింట్ల పరిధిలో 62,854 వద్ద కనిష్టాన్ని, 63,136 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి తొమ్మిది పాయింట్ల నష్టంతో 62,970 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు పెరిగి 18,666 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,647 – 18,722 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 26 పాయింట్ల స్వల్పలాభంతో 18,691 వద్ద నిలిచింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇంధన షేర్లు నష్టాలను చవిచూశాయి. ఆటో, ఐటీ, ఫార్మా, మెటల్, ఎఫ్‌ఎంసీజీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు రాణించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.04%, 0.71 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.409 కోట్ల షేర్లను విక్రయించగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.250 కోట్లు నష్టపోయారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఎనిమిది పైసలు నష్టపోయి 82.04 వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

సేవా సంస్థలకు పన్ను నిబంధనల్లో మార్పులు



న్యూఢిల్లీ: సామాజిక సేవా సంస్థలు వెల్లడించాల్సిన వివరాల నిబంధనలను ఆదాయపన్ను శాఖ సవరించింది. ఈ మార్పులు అక్టోబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఇక మీదట చారిటబుల్ సంస్థలు తమ కార్యకలాపాలు ధార్మికమైనవా లేదా మతపరమైనవా లేక మతపరమైన సేవా కార్యక్రమాల కిందకు వస్తాయా? అన్నది వెల్లడించాల్సి ఉంటుంది. ఒకరోజులో రూ.2 లక్షలకు మించి ఎవరైనా విరాళం ఇస్తే ఆ వివరాలను ఆదాయపన్ను శాఖకు తెలియజేయాలి. చెల్లించిన వ్యక్తి, చిరునామా, పాన్ నంబర్ ఇవ్వాలి. ఆదాయపన్ను చట్టంలో ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది.

సెప్టెంబర్ నాటికి ఆడిట్ పూర్తి

ఇన్వెస్టర్లకు బైజూస్ హామీ



న్యూఢిల్లీ: 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాతాల ఆడిట్ ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి కాగలదని ఎడ్‌టెక్ దిగ్గజం బైజూస్ సీఈవో బైజూ రవీంద్రన్.. ఇన్వెస్టర్లకు హామీ ఇచ్చారు. అలాగే 2023 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలు డిసెంబర్ నాటికి పూర్తి కాగలవని షేర్‌హోల్డర్లతో కాన్ఫరెన్స్ కాల్ సందర్భంగా పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతంలో తప్పిదాలు జరిగాయని అంగీకరించిన రవీంద్రన్.. వాటి నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నట్లు చెప్పారు. అటు బోర్డు సభ్యుల రాజీనామా విషయం కూడా వాస్తవమేనని, కానీ కంపెనీ ఇంకా వాటిని ఆమోదించలేదని తెలిపారు. ఈలోగానే రాజీనామా వార్తలు లీకయ్యాయని పేర్కొన్నారు. కొత్తగా నియమితులైన సీఎఫ్‌వో అజయ్ గోయల్‌ను రవీంద్రన్ పరిచయం చేశారు. రాజీనామా చేసిన ముగ్గురు డైరెక్టర్లు కూడా సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం. ఆడిటర్లు వైదొలగడం, తమ రాజీనామాలు రెండూ వేర్వేరు అంశాలని వారు చెప్పినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. సంస్థలోని వివిధ విభాగాలు మెరుగ్గానే పనిచేస్తున్నాయని, గ్రూప్ కౌన్సిల్‌తో కలిసి కొత్త సీఎఫ్‌వో సంస్థను మరింత పటిష్టం చేయగలరని రవీంద్రన్ తెలిపినట్లు పేర్కొన్నాయి. 2022 ఆర్థిక సంవత్సర ఫలితాలను ఇంకా వెల్లడించకపోవడం, ఆడిటర్లు.. డైరెక్టర్లు రాజీనామా చేయడం, 1 బిలియన్ డాలర్ల రుణాల చెల్లింపుపై వివాదం నెలకొనడం తదితర సవాళ్లతో బైజూస్ సతమతమవుతున్న సంగతి తెలిసిందే.

ఏపీలో ఎన్‌ఎండీసీ రూ. 500 కోట్ల వ్యయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో ఉన్న బంగారు గని కోసం రూ.500 కోట్లు వ్యయం చేసే అవకాశం ఉందని సమాచారం. గుడుపల్లి మండలంలో ఏడు గ్రామాల్లో విస్తరించిన ఈ గోల్డ్ బ్లాక్‌కు సంబంధించిన లీజును ఎన్‌ఎండీసీ త్వరలో దక్కించుకోనుంది. ప్రాజెక్ట్ విషయమై గతేడాది చివరలో ఏపీ ప్రభుత్వంతో ఎన్‌ఎండీసీ చేతులు కలిపింది. నిబంధనల ప్రకారం లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేసిన మూడేళ్లలో మైనింగ్ లీజు పొందాల్సి ఉంటుంది. ఈ గనిలో 18.3 లక్షల టన్నుల బంగారు ఖనిజం ఉన్నట్టు అంచనా. టన్నుకు 5.15 గ్రాముల పుత్తడి వెలికితీయవచ్చని ఎన్‌ఎండీసీ భావిస్తోంది.

అసోచాం ఏపీ, తెలంగాణ చైర్మన్‌గా రవికుమార్‌రెడ్డి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచాం) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్స్ చైర్మన్‌గా యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ కటారు రవికుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. 2023–24 సంవత్సరానికిగాను ఆయన ఈ పదవిలో ఉంటారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఆర్మీలో 62వ, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్(టెక్నికల్) కోర్సు

ఇండియన్ ఆర్మీ 62వ, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సు ఏప్రిల్ 2024లో చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రారంభం కానుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 196
» **పోస్టుల వివరాలు:** 62వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) పురుషులు–175, 33వ షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) మహిళలు–19,ఎస్ఎస్‌సీ డబ్ల్యూ టెక్–01, ఎస్ఎస్‌సీ డబ్ల్యూ నాన్ టెక్–01.
» **విభాగాలు: ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్స్.
» **అర్హత:** బీఈ, బీటెక్/ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.04.2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:**రూ.56,100 నుంచి రూ.1,77,500.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, స్టేజ్ –1, స్టేజ్–2 ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2023.
» **కోర్సు ప్రారంభం:** ఏప్రిల్ 2024.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

డీఆర్‌డీవో-ఏఎస్ఎల్, హైదరాబాద్‌లో 13 జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో–అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ల్యాబొరేటరీ.. జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 13;
» **నెలవారీ స్టైపెండ్:** రూ.31,000.
» **విభాగాలు:** మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్.
» **అర్హత:** బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.drdo.gov.in

నల్సార్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 15
» **విభాగాలు:**లా,సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్.
» **అర్హత:** 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ లేదా కంపెనీ సెక్రటరీ ఎగ్జామ్ /ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.07.2023.
» **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేది:** 15.07.2023.
» **వెబ్‌సైట్:** www.nalsar.ac.in

సీఈఎస్ఎస్, హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సీఈఎస్ఎస్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ యూనివర్శిటీ (నిజామాబాద్) సహకారంతో రెగ్యులర్ పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 12
» **విభాగాలు:** ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా ఎంఫిల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.07.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 27.07.2023
» **వెబ్‌సైట్:** www.cess.ac.in

పచ్చని కెరీర్‌కు అగ్రి కోర్సులు

» తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పలు కోర్సులు
» ఎంసెట్ బైపీసీ, ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు
» హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీల్లోనూ కోర్సులు
» పీజేటీఎస్ఏయూ ఆధ్వర్యంలో ఉమ్మడి కౌన్సెలింగ్
» 2023 సంవత్సరానికి మొదలైన దరఖాస్తు ప్రక్రియ



అగ్రికల్చర్, అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు, హార్టికల్చర్, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఎస్ఏయూ).. ఉమ్మడి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించింది. దీనికి టీఎస్ ఎంసెట్(బైపీసీ/ఎంపీసీ)లో ర్యాంకు సాధించిన విద్యార్థులు అర్హులు. 2023-24 విద్యాసంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలోని.. పీజేటీఎస్ఏయూ, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ, పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీల్లో.. వివిధ కోర్సుల్లో అడ్మిషన్ కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ మూడు వర్సిటీల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రవేశ విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

అగ్రికల్చర్, అనుబంధ కోర్సులకు సంబంధించి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మూడు యూనివర్సిటీల పరిధిలో ఎనిమిది కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అగ్రికల్చరల్, వెటర్నరీ సైన్స్, ఫిషరీ సైన్స్, హార్టికల్చర్ సైన్స్‌ల కోర్సులను మూడు యూనివర్సిటీలు అందిస్తున్నప్పటికీ.. ప్రవేశ ప్రక్రియను మాత్రం ఉమ్మడి కౌన్సెలింగ్ విధానంలో నిర్వహిస్తున్నారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో.. ఉమ్మడి కౌన్సెలింగ్ జరుగుతుంది. దీనికోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పీజేటీఎస్ఏయూ కోర్సులు

- **అగ్రికల్చరల్ బీఎస్సీ–ఆనర్స్:** మొత్తం సీట్లు–720. వీటిలో 200 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా పేర్కొన్నారు.
- **బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్:** మొత్తం సీట్లు–43(5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీటెక్–అగ్రికల్చరల్ ఇంజనీరింగ్:** మొత్తం సీట్లు –29(9 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీటెక్ ఫుడ్ టెక్నాలజీ:** మొత్తం సీట్లు–30(10 సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు).
- **బీఎస్సీ ఆనర్స్–కమ్యూనిటీ సైన్స్:** మొత్తం సీట్లు 42(5సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు) (ఎంపీసీ స్ట్రీమ్).

పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోర్సులు

- **బీవీఎస్సీ అండ్ ఏహెచ్:** మొత్తం సీట్లు–174.
- **బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్(బీఎఫ్ఎస్‌సీ):** మొత్తం సీట్లు–39.
- ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం–ఏపీలోని కాలేజీ ఆఫ్ ఫిషరీసైన్స్ ముత్తుకూరు(నెల్లూరు జిల్లా)లో 11 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం కోర్సులు

బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్–204 కోర్సులు.వీటిలో 34సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా పేర్కొన్నారు.

ఎంసెట్ బైపీసీ/ఎంపీసీ

- తెలంగాణ రాష్ట్రంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, ఫిషరీ సైన్స్, అనుబంధ కోర్సులకు సంబంధించి టీఎస్ ఎంసెట్ బైపీసీ/ఎంపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణత ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్, కమ్యూనిటీ సైన్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్‌సీ, బీఎస్సీ ఆనర్స్–హార్టికల్చర్ కోర్సుల సీట్లను ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్ ర్యాంకుతో భర్తీ చేస్తారు.
- బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్,బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్లలో ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. దీంతోపాటు బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లను ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.
- హోమ్ సైన్స్‌లో మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసుకున్న వారికి సూపర్ న్యూమరరీ కోటా కింద 8 సీట్లు అందుబాటులో ఉంటాయి.

అర్హత

- **బైపీసీ స్ట్రీమ్ కోర్సులు:** ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణత సాధించాలి. బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్ కోర్సుకు బైపీసీలో 50 శాతం మార్కులు తప్పనిసరి. దీంతోపాటు టీఎస్ ఎంసెట్ బైపీసీ స్ట్రీమ్‌లో ఉత్తీర్ణత ఉండాలి. ▪ **ఎంపీసీ స్ట్రీమ్ కోర్సులు:** ఇంటర్ ఎంపీసీ ఉత్తీర్ణతతోపాటు ఎంసెట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించాలి.

ఫార్మర్స్ కోటా విధానం

అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లోని సీట్లను భర్తీ చేసే క్రమంలో ఫార్మర్స్ కోటా విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ఒక ఎకరానికి తక్కువ కాకుండా భూమి ఉన్న రైతుల కుటుంబాలకు చెందిన పిల్లలకు అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీ కోర్సుల్లో 40 శాతం సీట్లు, వెటర్నరీ యూనివర్సిటీ కోర్సుల్లో 25శాతం సీట్లు కేటాయిస్తారు. ఈ కోటా సీట్లు పొందాలనుకునే విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ మధ్యలో కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివుండాలి.

పెరుగుతున్న పోటీ

- అగ్రికల్చర్ అనుబంధ కోర్సుల్లో ప్రవేశాలకు గత కొన్నేళ్లుగా విద్యార్థుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో వీటికి పోటీ పెరుగుతోంది. గత ఏడాది కౌన్సెలింగ్ ఆయా కోర్సుల్లో చివరి ర్యాంకులను పరిశీలిస్తే.. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో స్థానిక కోటాలో నాన్–ఫార్మర్ కేటగిరీలో 3,299వ ర్యాంకు, ఫార్మర్/రూరల్ కోటాలో 5,705వ ర్యాంకు చివరి ర్యాంకులుగా నిలిచాయి.

ఉజ్వల అవకాశాలు

అగ్రికల్చర్ కోర్సులకు డిమాండ్ పెరగడానికి ఈ రంగంలో లభిస్తున్న ఉపాధి అవకాశాలే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. కోర్సుల వారీగా భవిష్యత్తు అవకాశాల వివరాలు..

అగ్రికల్చర్ బీఎస్సీ

వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసుకున్న వారికి ప్రైవేటు రంగంలో విత్తన ఉత్పాదక సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్లుగా చేరే వీలుంది.

బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్

పేరుకు ముందు డాక్టర్ హోదా.. కెరీర్ పరంగా ఉన్నత స్థానాలు అందుకునేందుకు దోహదం చేస్తున్న కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్‌సీ అండ్ ఏహెచ్). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు తదితర అంశాల్లో నైపుణ్యం కల్పించే కోర్సు ఇది. వీరికి పౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశువైద్య ఆసుపత్రులు, పశుసంవర్ధక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శన శాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపక కేంద్రాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

హార్టికల్చర్ సైన్స్

పర్యావరణంపై ఆసక్తి ఉన్న వారికి సరైన కోర్సు.. బీఎస్సీ హార్టికల్చర్ సైన్స్. ఈ కోర్సును పూర్తి చేసుకున్న వారికి స్టేట్ హార్టికల్చర్ మిషన్, నాబార్డ్ సహా పలు బ్యాంకుల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అదేవిధంగా ప్రైవేట్ డ్రిప్ ఇరిగేషన్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల్లోనూ ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతున్నాయి. ఉన్నత విద్య పరంగా పీజీ స్థాయిలో ఫ్రూట్ సైన్స్, వెజిటబుల్ సైన్స్, ఫ్లోరికల్చర్, ప్లాంటేషన్ అండ్ స్పైస్ క్రాప్ ప్రత్యేక అంశాలుగా ఎమ్మెస్సీ చదివే అవకాశం ఉంది.

బీఎఫ్ఎస్‌సీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్..సంక్షిప్తంగా బీఎఫ్ఎస్‌సీ. చేపల పెంపకం,సేకరణకు సంబంధించి ప్రత్యేక పద్ధతులు అనుసరించేందుకు అవసరమయ్యే నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తిచేసుకున్న వారికి ఆక్వాకల్చర్ కంపెనీలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీటెక్–ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేయడం ద్వారా ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు. దీంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ ప్రొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్

వ్యవసాయ ఉత్పత్తులు, పరికరాల డిజైన్, నిర్వహణకు సంబంధించిన నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. మైక్రో ఇరిగేషన్ పరికరాలు, ప్రాసెసింగ్ పరికరాలు, గ్రీన్ హౌస్‌ల నిర్మాణం పర్యవేక్షణ వంటి నైపుణ్యాలు లభిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసుకున్న అభ్యర్థులు అగ్రి ఎక్విప్‌మెంట్ సంస్థలు, క్రాప్ ప్రొడక్షన్ కంపెనీల్లో సాంకేతిక విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్

సామాజిక అంశాలు, విలువలు, సామాజిక అభివృద్ధిలో సాంకేతికతను వినియోగించే నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. కోర్సులో భాగంగా ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్, ఫ్యామిలీ స్టడీస్, అపరెల్ డిజైన్, రిసోర్స్ మేనేజ్‌మెంట్, కన్స్యూమర్ సైన్సెస్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు హాస్పిటల్స్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్స్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- బైపీసీ స్ట్రీమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది: 15.07.2023
- బైపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూలై 17,2023
- బైపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: జూలై 18, 19 తేదీలు
- ఎంపీసీ స్ట్రీమ్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది: 07.07.2023
- ఎంపీసీ స్ట్రీమ్ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 09.07.2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://ug.pjtsau.ac.in https://btech.pjtsau.ac.in

డీఏ బకాయిలు జీపీఎఫ్‌లో జమ

- అక్టోబర్ 31లోపు రిటైర్ అయ్యే వారికి నగదు
- సీపీఎస్ ఉద్యోగులకు రెండు పద్ధతుల్లో చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల పెంచిన కరువు భత్యం (డీఏ) బకాయిలను వారి జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్)లో జమ చేయనున్నారు. జనవరి 2022 నుంచి మే 2023 వరకు పెంచిన డీఏ బకాయిల చెల్లింపుపై మార్గదర్శకాను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 31 లోపు రిటైర్ అయ్యే ఉద్యోగుల బకాయిలను నగదు రూపంలో చెల్లించనున్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) పరిధిలోకి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిల్లో 10 శాతాన్ని ఉద్యోగుల ప్రాన్ (పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్)కు, మిగిలిన 90 శాతాన్ని ఈ ఏడాది జూలై నుంచి ప్రారంభించి 17 వాయిదాల్లో చెల్లిస్తారు. పింఛన్ దారులకూ డీఏ బకాయిలను 17 వాయిదాల్లోనే ఇవ్వనున్నారు. ఈ మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులు ఇవ్వకముందు లేదా వాయిదాల మధ్యలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛన్‌దారు మరణిస్తే వారి వారసులకు మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తారు. ఇక జీపీఎఫ్ అకౌంట్లు లేని పార్ట్ టైం, కంటింజెంట్ ఉద్యోగులకు పెంచిన డీఏను జూలై నెల వేతనంతో చెల్లించనున్నారు.

ర్యాంకుల్లో రాష్ట్రం | వెనుకబాటు బాధాకరం

యూనివర్సిటీల పరిస్థితిపై గవర్నర్ తమిళిసై

- కారణాలు అన్వేషించాలి
- విద్యార్థులను ఉద్యోగాలు సృష్టించే వారిగా తీర్చిదిద్దాలి
- వీసీల సమావేశంలో పలు సూచనలు చేసిన గవర్నర్
- ప్రధాన వర్సిటీల వీసీలు గైర్హాజరు


వీసీల సమావేశంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంచి విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నా, జాతీయ ర్యాంకుల్లో తెలంగాణ వెనుకబడటం బాధాకరమని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ధ్యేయంగా వర్సిటీల వీసీలు పనిచేయాల్సిన అవసరం ఉందని ఉద్బోధించారు. రాజ్‌భవన్‌లో సోమవారం ఆమె విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ వంటి జాతీయ స్థాయి ర్యాంకుల్లో మనం ఎందుకు వెనుకబడ్డామనేది గుర్తించాలని, ఈ లోపాన్ని అధిగమించేందుకు కృషి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయాల నుంచి బయటకొచ్చే విద్యార్థులను ఉద్యోగాలు కల్పించే వారిగా తీర్చిదిద్దాలని, ఉన్నత విద్యలో మౌలిక వసతుల కల్పనకు తోడ్పడాలని సూచించారు. విద్యాలయాల్లో, ముఖ్యంగా అమ్మాయిలుండే కాలేజీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. విద్యార్థులను సామాజిక బాధ్యత, పరిశోధన, కొత్తదనం వైపు నడిపించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపైనే ఉందన్నారు. ఈ దిశగా కృషి చేసిన వర్సిటీలకు ఉత్తమ అవార్డులు అందిస్తామన్నారు. కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు విషయంలో యూజీసీ, ఇతర విశ్వవిద్యాలయాలు, విద్యావేత్తలు నుంచి సమాచారం తీసుకున్నానని, తన వ్యాఖ్యలతో బిల్లును రాష్ట్రపతికి సిఫార్సు చేశానని గవర్నర్ తెలిపారు. ఈ క్రమంలో తాను వివిధ యూనివర్సిటీలను సందర్శించానని, కొంతమంది వీసీలను తొలగించాల్సి ఉన్నా కూడా కొనసాగించాల్సి వచ్చిందన్నారు. ప్రైవేటు వర్సిటీల బిల్లు విషయంలోనూ విద్యార్థులకు ఏది ఉపయోగమో అదే చేస్తానన్నారు. బిల్లును రాష్ట్రపతికి పంపినట్టు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సేవలు వాడుకోవాలి..

వర్సిటీలు పూర్వ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని, క్రీడలను ప్రోత్సహించాలని గవర్నర్ తమిళిసై సూచించారు. ఈ అంశాలపై తనకు నివేదిక ఇవ్వాలని వీసీలను ఆదేశించారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరమన్నారు. వారిలో మనోధైర్యం నింపేలా విద్యాబోధన జరగాలన్నారు. వీసీలకు పరిమితులన్నా విద్యార్థుల కోసం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకోసం డిజిటల్ లైబ్రరీని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ వర్సిటీల వీసీలు.. లక్ష్మీకాంత్ రాథోడ్, గోపాల్‌రెడ్డి, నీరజ్ ప్రభాకర్, కవిత థరియా రావు, రవీందర్ రెడ్డి, బి.కరుణాకర్ రెడ్డి, విజ్జులత, కిషన్‌రావు, రిజిస్ట్రార్లు లక్ష్మీనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు. కాగా, జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల వీసీలు గవర్నర్ సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశమైంది.

ట్రిపుల్ ఐటీ వీసీ, రిజిస్ట్రార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకుగాను నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను జూలై 14కు వాయిదా వేసింది. ముంబైకి చెందిన ధైర్య ఓంప్రకాశ్ ఝున్‌ఝున్‌వాలాకు 2020లో రూ.1,60,000 కట్టి ఐఐటీ–హైదరాబాద్‌లో బీటెక్‌లో చేరారు. అనంతరం ఐటీ–ముంబైలో సీటు రావడంతో అక్కడ చేరారు. ఫీజును తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా నిరాకరించడంతో ఐఐటీ–హైదరాబాద్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం 2020 నుంచి 12 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని 2023, ఏప్రిల్‌లో తీర్పునిచ్చింది. గడువు పూర్తయినా కోర్టు ఆదేశాలు అమలు చేయకపోవడంతో ఓంప్రకాశ్ హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

హోంమంత్రి మహమూద్ అలీ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/వెంగళరావునగర్: దేశ భవిష్యత్ ఆరోగ్యవంతమైన యువతపైనే ఆధారపడి ఉంటుందని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హోంమంత్రి మహమూద్ అలీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఏఎన్‌బీ), వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హోంమంత్రి మహమూద్‌అలీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ చెడు స్నేహాలతో యువత ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవద్దు సూచించారు. కార్యక్రమంలో నటి కృతిశెట్టి, మహిళా శిశుసంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలికేరి, సీపీ సీవీ ఆనంద్, డైరెక్టర్ బి.శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో విజేతలకు నగదు పురస్కారాలు అందించారు. కాగా, మాదకద్రవ్యాల వ్యతిరేకదినాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషాముక్త భారత్, సే నో టు డ్రగ్స్ ప్రచారంలో భాగంగా దుండిగల్‌లోని హైదరాబాద్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టులో రూ.295 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను కస్టమ్స్ అధికారులు ధ్వంసం చేశారు.

కొనసాగుతున్న అల్పపీడనం

సాక్షి, హైదరాబాద్: ఒడిశా పరిసర ప్రాంతాల మీద నుంచి దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల,కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో సగటున 10.69 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. సోమవారం నాటికి 5.62 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 47 శాతం లోటు వర్షపాతం ఉంది. సోమవారం రాష్ట్రంలో 5.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

సోమవారం రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం (సెం.మీ.లలో) నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	వర్షపాతం
ఆదిలాబాద్ టౌన్	ఆదిలాబాద్	4.85
తాంసీ	ఆదిలాబాద్	3.68
పిప్పలదారి	ఆదిలాబాద్	3.58
జీఎస్ ఎస్టేట్	ఆదిలాబాద్	3.33
సిర్పూర్	ఆసిఫాబాద్	3.18

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.